తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

గురువారం 02.10.2025 | సంపుటి :12 సంచిక : 74 | పేజీలు :12 వెల : రూ. 4/-

RNI NO.TELTEL / 2013 /50370

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698







# అమెరికా షట్‌డౌన్

- కీలకమైన బిల్లులకు ఆమోదం లభించకపోవడంతో ప్రకటించిన ఆ దేశ ప్రభుత్వం
- ఆరేళ్లలో తొలిసారి ఇలా..

**వాషింగ్టన్(జనంసాక్షి):**కీలకమైన బిల్లులకు ఆమోదం లభించకపోవడంతో అమెరికా ప్రభుత్వం షట్‌డౌన్‌ను ఎదుర్కొంటోంది ఆరేళ్ల తర్వాత తొలిసారి ఇలా జరిగింది. అర్ధరాత్రి గడువుకు ముందే రెండు నిధుల బిల్లులను సెనెట్ ఆమోదించకపోవడంతో అమెరికా ప్రభుత్వం షట్‌డౌన్‌లోకి వెళ్లింది. అమెరికా కాలమానం ప్రకారం బుధవారం మొదలు కాగానే(భారత కాలమానం ప్రకారం ఉదయం 9.30కి) ఈ ప్రక్రియ ప్రారంభమైంది. తమ డిమాండ్లు నెరవేర్చని రిపబ్లికన్ స్టాపేజ్ ఫండింగ్ బిల్లును డెమోక్రాట్లు అడ్డుకోవడంతో ఈ షట్‌డౌన్ మొదలైంది. దీంతో అత్యవసరం కాని సేవల కార్యకలాపాలు నిలిచిపోతాయి. అమెరికాలో లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. దాదాపు 7,50,000

మిగతా 2లో..





**జనంసాక్షి** పాఠకులకు, ప్రకటన కర్తలకు, శ్రేయోభిలాషులకు

**దసరా పండుగ శుభాకాంక్షలు**

**సెలవు**

పండుగ సందర్భంగా **జనంసాక్షి** కార్యాలయానికి నేడు సెలవు. కావున రేపటి సంచిన వెలువడదు. పున:దర్శనం శనివారం

## జూబ్లీహిల్స్, స్థానిక సంస్థల ఎన్నికలపై

# సీఎం కసరత్తు

- ఆశావహుల నివేదిక ఇవ్వండి
- గెలుపే లక్ష్యంగా పనిచేయండి
- స్థానిక సంస్థల ఎన్నికల్లో అధిక స్థానాలను కైవసం చేసుకోవాలి
- ఇంఛార్జి మంత్రులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచన



**హైదరాబాద్(జనంసాక్షి):**జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు సంబంధించిన కసరత్తును కాంగ్రెస్ పార్టీ ప్రారంభించింది. స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్‌తో పాటు జూబ్లీహిల్స్ ఎన్నిక షెడ్యూల్ కూడా వస్తుంది కాబట్టి.. కాంగ్రెస్ పార్టీ తమ అభ్యర్థి ఎంపికపై ఫోకస్ పెట్టింది. ఇందులో భాగంగానే సీఎం రేవంత్ రెడ్డితో పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్ భేటీ అయ్యారు. ఈ భేటీలో స్థానిక సంస్థల ఎన్నికల అభ్యర్థులతో పాటు జూబ్లీహిల్స్ అభ్యర్థిపై చర్చ జరిగింది. ఈ నెల 6న ఏఐసీసీలో స్క్రీనింగ్ కమిటీ సమావేశం జరగనుంది. ఈ నేపథ్యంలో స్క్రీనింగ్ కమిటీ సమావేశంకు ముందే అభ్యర్థుల ఎంపికను పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు .జూబ్లీహిల్స్ ఉపఎన్నికకు కాంగ్రెస్ అభ్యర్థి ఎంపికపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్షించారు. దీనిపై నివేదిక ఇవ్వాలని ముగ్గురు మంత్రులకు ఆయన సూచించారు. తాజా రాజకీయ పరిస్థితులను వివరిస్తూ.. నివేదికలో

మిగతా 2లో..

# స్థానిక సంస్థల ఎన్నికల్లో శాంతిభద్రతల పరిరక్షణకు కట్టుదిట్టమైన చర్యలు

- కావాల్సిన యంత్రాంగం ఉంది
- సాంకేతికతతో ముందుకు వెళతాం
- తెలంగాణలో శాంతి భద్రతలకు పెద్దపీట
- ఖాళీల భర్తీని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా..
- నూతన డీజీపీగా బాధ్యతలు చేపట్టిన శివధర్ రెడ్డి

**హైదరాబాద్(జనంసాక్షి):** రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలను సమర్థంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని నూతన డిజిపిగా బాధ్తయలు స్వీకరించిన శివధర్ రెడ్డి తెలిపారు. మాకు బలమైన జట్టు ఉంది. క్షేత్రస్థాయిలో సాంకేతికతను వినియోగించుకుంటాం అన్నారు. రాష్ట్రంలో పోలీసు శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను త్వరగా భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని కోరుతామని నూతన డీజీపీ శివధర్ రెడ్డి తెలిపారు. నూతన డీజీపీగా ఆయన లక్డీకపూల్‌లోని డీజీపీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. వేద మంత్రాలతో డీజీపీ కార్యాలయంలోకి ఆయన్ను

మిగతా 2లో..



డీజీపీగా బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ముఖ్యమంత్రి మర్యాద పూర్వకంగా కలిసిన డీజీపీ బి. శివధర్ రెడ్డి

# దేశీయంగా ఐదోతరం స్టెల్త్ యుద్ధ విమానాల తయారీ

- అగ్రరాజ్యాల సరసన భారత్
- డీఆర్‌డీవోతో మరో భారీ ఒప్పందం
- రూ. 2 లక్షల కోట్ల వ్యయంతో 125 అత్యాధునిక జెట్‌ఫైటర్ల తయారీ

**న్యూఢిల్లీ(జనంసాక్షి)** స్వదేశీ ఐదోతరం స్టెల్త్ యుద్ధ విమానాల తయారీ కార్యరూపం దాల్చే దిశగా మరో అడుగుపడింది. ప్రొటోటైప్ ఏఎంసీఏ ప్రాజెక్టులో భాగంగా డీఆర్‌డీఓతో కలిసి పనిచేసేందుకు ఏడు దేశీయ కంపెనీలు బిడ్డింగ్ దాఖలుచేశాయి. రూ. 2 లక్షల కోట్ల వ్యయంతో 125 ఐదోతరం స్టెల్త్ జెట్ ఫైటర్లను తయారు చేయనున్నారు. దీంతో భారత్ అగ్రదేశాలైన అమెరికా, రష్యా, చైనాల సరసన చేరనుంది.డీఆర్డీవో సారథ్యంలో ఐదో తరం స్టెల్త్ యుద్ధ విమానాల అభివృద్ధి కోసం ప్రారంభమైన ఏఎమ్‌సీఏ ప్రాజెక్టులో ముందడుగు పడింది. ఏఎమ్‌సీఏ ప్రొటోటైప్ నమూనాల రూపకల్పన, అభివృద్ధి కోసం 7 భారతీయ కంపెనీలు డీఆర్‌డీవోతో కలిసి పనిచేసేందుకు బిడ్డింగ్ దాఖలు చేశాయి. ఈ ప్రాజెక్టులో భాగంగా 125 ఐదోతరం స్టెల్త్ యుద్ధ విమానాలను డీఆర్‌డీవో భాగస్వామ్యంలో తయారు చేయనున్నారు. ఎల్ అండ్ టీ, హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్, టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్,

మిగతా 2లో..







# ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించండి

- లేదంటే సమ్మె బాట పడతాం
- మరోసారి ప్రైవేటు కళాశాలలు హెచ్చరిక

**హైదరాబాద్(జనంసాక్షి):** ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో ప్రైవేటు కళాశాలలు సమ్మెకు సిద్ధమవుతున్నాయి. ఇవాళ అత్యవసర సమావేశం నిర్వహించిన కళాశాలల యాజమాన్యాలు భవిష్యత్ కార్యాచరణపై చర్చించాయి. సమావేశం అనంతరం ఎఫ్‌ఏటీహెచ్‌ఐ ఛైర్మన్ రమేశ్ మీడియాతో మాట్లాడారు."ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు ప్రభుత్వం విడుదల చేయలేదు. ప్రభుత్వానికి విద్యారంగం ఆఖరి ప్రాధాన్యతగా ఉంది. గత నెల 21, 22 తేదీల్లో రూ.600 కోట్లు ఇస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క హామీ ఇచ్చినా బకాయిలు చెల్లించలేదు. కేవలం రూ.200 కోట్లు మాత్రమే విడుదల చేశారు. దీపావళిలోపు రూ.1200 కోట్లు ఇస్తామ న్నారు..ఎలా ఇస్తారో చెప్పాలి. ఈనెల 12లోపు బకాయిలు చెల్లించకుంటే.. 13 నుంచి సమ్మెకు వెళ్తాం. ఇవాల్టి నుంచి సీఎంవో కార్యాలయంతో తప్ప మరెవరితో చర్చించం. అవసరమైతే విద్యార్థులతో కలిసి ఛలో హైదరాబాద్ చేపడతాం" అని వివరించారు.

# 3% డీఏ పెంపు

## కేంద్రప్రభుత్వ ఉద్యోగులకు కరవుభత్యాన్ని పెంచుతూ కేబినెట్ ఆమోదం




**న్యూఢిల్లీ(జనంసాక్షి):**ప్రభుత్వ ఉద్యోగులకు కేంద్రం శుభవార్త చెప్పింది. దీపావళి కానుకగా కరవు భత్యాన్ని 3 శాతం పెంచేందుకు కేంద్ర క్యాబినెట్ ఆమోద ముద్ర వేసింది. ఈ మేరకు కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ బుధవారం వెల్లడించారు. ఏటా రెండుసార్లు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల డీఏ (ఆం)ను కేంద్రం సవరిస్తూ ఉంటుంది. పెరుగుతున్న నిత్యావసర ధరలకు పరిహారంగా ఉద్యోగులు, పెన్షనర్లకు ఈ కరవు భత్యాన్ని అందజేస్తారు. 3శాతం పెంపు నిర్ణయంతో 55 శాతంగా ఉన్న డీఏ 58 శాతానికి చేరనుంది. 49 లక్షలమంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, 69 లక్షల మంది పింఛనుదారులు లబ్ధి పొందనున్నారు.ఇదిలాఉంటే.. దసరా, దీపావళి సందర్భంగా రైల్వే ఉద్యోగులకు బోనస్ చెల్లించేందుకు కేంద్ర క్యాబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన సంగతి తెలిసిందే. 78 రోజుల వేతనాన్ని 'ఉత్పాదకతతో ముడిపడిన బోనస్' (ఖఒః) రూపంలో చెల్లించేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయంతో మొత్తం 10.91 లక్షల మంది ఉద్యోగులకు ప్రయోజనం చేకూరనుంది. ఈ డీఏ పెంపుతో పాటు క్యాబినెట్ మరికొన్ని నిర్ణయాలు తీసుకుంది. రూ.5,863 కోట్లతో 57 కేంద్రీయ విద్యాలయాల ఏర్పాటుకు నిర్ణయం తీసుకుంది. అలాగే రూ.11,440 కోట్లతో పప్పుధాన్యాల స్వయం సమృద్ధికి ఆమోదం ఇచ్చింది.



# దేశవ్యాప్తంగా కొత్తగా 57 కేవీలు

- స్కూళ్ల నిర్మాణానికి రూ. 5,863 కోట్లు కేటాయించిన కేంద్రం
- తెలంగాణలో భద్రాద్రి కొత్తగూడెం,ములుగు, జగిత్యాల,వనపర్తి జిల్లాల్లో ఏర్పాటు

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**తల్లిదండ్రులకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త తెలిపింది. దేశవ్యాప్తంగా 57 కొత్త కేంద్రీయ విద్యాలయాలను (కేవీ) స్థాపించేందుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ స్కూళ్ల నిర్మాణానికి కేంద్రం రూ. 5,863 కోట్లు కేటాయించింది. వాటిల్లో ఏడు కేంద్రియ విద్యాలయాల నిర్మాణం కేంద్ర హెూం మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో..

మిగతా 2లో..

# కేసీఆర్ పాలన రైతుల పాలిట స్వర్ణయుగం

- జాతీయ నేర గణాంక విభాగం నివేదికతో అది మరోసారి రుజువైంది: కేటీఆర్
- బీఆర్ఎస్ పాలనపై విమర్శించే వారికి ఈ నివేదిక చెంపపెట్టు: హరీశ్ రావు




**హైదారబాద్(జనంసాక్షి):** తెలంగాణలో 2014 నుంచి పదేళ్ల కాలంలో రైతుల బలవన్మరణాలు తగ్గాయన్న జాతీయ నేర గణాంక విభాగం నివేదికపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు.

మిగతా 2లో..
















# స్థానిక సంస్థలు, జూబ్లీహిల్స్ ఎన్నికలపై సీఎం కసరత్తు

అభ్యర్థుల పేర్లు, వివరాలు ఉండాలని పేర్కొన్నారు. గెలుపు గుర్రాన్ని జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో నిలబెట్టాలన్న కోణంలోనే నివేదిక ఉండాలని సీఎం పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికశాతం స్థానాలను కైవసం చేసుకోవాలని స్పష్టం చేశారు. ఈ అంశంలో ఇన్‌ఛార్జ్ మంత్రులతోపాటు ఎంపీల భాగస్వామ్యంతో వెళ్లాలని సూచించారు. సీఎం రేవంత్‌రెడ్డితో పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ కూడా సమావేశమై ఈ అంశంపై చర్చించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు సంబంధించి మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్, తుమ్మల నాగేశ్వర రావు జిల్లా ఇన్‌ఛార్జిలుగా ఉన్నారు. టికెట్ ఆశిస్తున్న అభ్యర్థుల జాబితాను సిద్ధం చేయాలని జిల్లా ఇన్‌ఛార్జిలకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. అలానే గెలుపు కోసం అనుసరించే ప్రణాళికలను కూడా సిద్ధం చేయాలని సూచించారు. ఇక్కడ బీసీ అభ్యర్థిని రంగంలోకి దించుతారా? లేదా ఓసీకి అవకాశం ఇస్తారా? అన్నది ఇంకా క్లారిటీ లేదు. బీసీ కోటాలో అంజాన్ కుమార్ యాదవ్, నవీన్ యాదవ్, బొంతు రామ్మోహన్ రేసులో ఉన్నారు. రెడ్డి కోటలో సీఎస్ రెడ్డి, రంజిత్ రెడ్డిలు ఉన్నారు.

# కేసీఆర్ పాలన రైతుల పాలిట స్వర్ణయుగం

తన అధికారిక సోషల్ మీడియా అకౌంట్ ఎక్స్ ద్వారా స్పందన తెలియజేశారు. కేసీఆర్ రైతుబంధు పాలన రైతు లకు స్వర్ణయుగమనే విషయం మరోమారు రు జువైందని ఆయన పేర్కొన్నారు. అప్పటి ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలు, ప్రాజెక్టుల వల్ల 2014 నుంచి 2023 మధ్య తెలంగాణ లో రైతుల ఆత్మహత్యలు గణనీయంగా తగ్గా యని కేంద్ర ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయని తెలిపారు. 2014లో తెలంగాణలో రైతులు, కౌలుదారులు, రైతు కూలీల ఆత్మహత్యల సంఖ్య 1,347గా ఉన్నదని, అదే 2023లో ఆ ఆత్మహత్యల సంఖ్య 56కు తగ్గిందని కేటీఆర్ చెప్పారు. అంటే 96 శాతం తగ్గు దల నమోదైం దని అన్నారు. దేశంలోని రైతుల ఆత్మహత్యల్లో తెలంగాణ వాటా 2014లో 10.9 శాతం ఉంటే.. 2023 నాటికి అది 0.51 శాతం తగ్గిందని తెలిపారు. కానీ కాంగ్రెస్ అధికారం లోకి రాగానే పరిస్థితి తారుమారైందని విమ ర్శించారు. రెండేళ్లలోనే 700 మందికిపైగా అన్నదాతల ఆత్మహత్యలు నమోదయ్యాయని ఆందోళన వ్యక్తంచేశారు. కాగా కేసీఆర్ పాలన గురించి నోరు పారే సుకునే వారికి జాతీయ నేర గణాంక విభాగం నివేదిక చెంపపెట్టు సమాధానమని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. 2014లో రైతు ఆత్మహత్యల్లో రెండో స్థానంలో ఉన్న తెలంగాణ నేడు 14వ స్థానానికి పరిమితమైందన్నారు. పదేండ్ల బీఆర్‌ఎస్ పాలనలో అన్నదాతల ఆత్మహత్యలు రికార్డు ఉస్థాయిలో 95.84 శాతం తగ్గాయని చెప్పారు. రైతును రాజును చేయాలన్న కేసీఆర్ సంకల్పానికి, చేసిన నిర్విరామ కృషికి వచ్చిన ఫలితమని చెప్పారు. కేసీఆర్‌కు రైతుకు ఉన్నది పేగు బంధం, ఆత్మ బంధం అయితే.. కాంగ్రెస్‌కు ఉన్నది కేవలం ఓటు బంధం మాత్రమేనని విమర్శించారు. '2014లో 1347 రైతు ఆత్మహత్యలు నమోదు కాగా, 2023 నాటికి 56కి తగ్గుదల. 2014లో రైతు ఆత్మహత్యల్లో రెండో స్థానంలో ఉన్న తెలంగాణ నేడు 14 వ స్థానికి పరిమితం. 2023లో దేశవ్యాప్తంగా 10,786 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకోగా అందులో తెలంగాణ వాటా కేవలం 0.51 శాతం. 10 ఏండ్ల బీఆర్‌ఎస్ పాలనలో అన్నదాతల ఆత్మహత్యలు రికార్డు స్థాయిలో 95.84 శాతం తగ్గుదల. ఇవి మాటలు కాదు, కేసీఆర్ తిరగరాసిన రికార్డులు, కేంద్ర ప్రభుత్వ లెక్కలు చెబుతున్న వాస్తవాలు అన్నారు. రైతును రాజు చేయాలన్న కేసీఆర్ సంకల్పానికి, వారు చేసిన నిర్విరామ కృషికి వచ్చిన ఫలితం అన్నారు. స్వరాష్ట్రంలో ఒక్కో పథకంతో వ్యవసాయరంగానికి జీవం పోశారు. సాగును బాగు చేశారు. రుణమాఫీతో రైతన్నకు ధీమా దొరికింది. రైతు బంధు బంధువు అయ్యింది. రైతు బీమా కొండంత భరోసా ఇచ్చింది. 24 గంటల ఉచిత విద్యుత్తు వెలుగులు నింపింది. పంట కొనుగోళ్లతో ప్రోత్సాహం అందింది. కాళేశ్వరం ప్రాజెక్టుతో సాగునీటి గోస తీరింది. మిషన్ కాకతీయతో చెరువుల పునరుద్ధరణ జరిగింది. భూగర్భ జలాలు ఉబికి బీడు భూములను పంట పొలాలుగా మార్చింది. ఉమ్మడి పాలనలో నిత్య దుర్భిక్షం, సాగు విధ్వంసం, వలసల దురవస్థ, ఆత్మహత్యల దౌర్భాగ్యం..తెలంగాణ. స్వరాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులతో సుజలమై, ధాన్యపురాశులతో సుఫలమై, సాగుభూమి సస్యశ్యామ లమై.. కేసీఆర్ పాలనలో విరాజిల్లింది తెలంగాణ. తెలంగాణను అన్నంగిన్నెగా దేశానికే ఆదర్శంగా నిలిపింది కేసీఆర్. ఆత్మహత్యల తెలంగాణను, అన్నపూర్ణగా మార్చింది కేసీఆర్. కేసీఆర్ పాలన గురించి నోరు పారేసుకునే వారికి ఇది చెంపపెట్టు సమాధానం. కేసీఆర్ కు

# అమెరికా షట్‌డౌన్

మందిని పని ప్రదేశంలో రిపోర్టు చేయవద్దంటారు. మిలిటరీ, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ వంటి విభాగాల్లోని లక్షల మంది సిబ్బంది మాత్రం అత్యవసర సేవలు కొనసాగించాల్సి ఉంటుంది. వీరితో సెలవుల్లో కూడా పని చేయించుకొని చెక్ ఇవ్వని పరిస్థితి ఉంటుంది. షట్‌డౌన్ ముగిశాకే.. వారికి పాత వేతనాల చెల్లింపులు జరుగుతాయి. కొన్ని కాంట్రాక్టుల్లో ఈ చెల్లింపులకు ఎలాంటి హామీలు ఉండవని తెలిపింది.

ఏ విభాగాలపై ప్రభావం..

సోషల్ సెక్యూరిటీ, మెడికేర్ లబ్ధిదారులపై దీని ప్రభావం ఉండదు. వీరికి సంబంధించిన ప్రయోజనాలను కాంగ్రెస్ ప్రత్యేక చట్టం రూపంలో ఆమోదం తెలుపుతుంది. వీటికి వార్షిక చెల్లింపులు అవసరం లేదు. కానీ, సోషల్ సెక్యూరిటీ ఆఫీస్‌లు అందించే ప్రయోజనాలు పరిమితంగా ఉంటాయి. నేషనల్ పార్క్ సర్వీసులు మూతపడతాయి. 2013లో వందలకొద్దీ పార్కులు, మ్యూజియంలు, ఇతర ప్రదేశాలను మూసేశారు. ఈ మూసివేత వల్ల వెంటనే ఆర్థిక ప్రభావం పడకపోయినా.. దీర్ఘకాలంగా కొనసాగితే మాత్రం ఆర్థిక వృద్ధి మందగిస్తుంది. మార్కెట్లకు అంతరాయం కలిగిస్తుంది. ఇవన్నీ ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీస్తాయి. అయితే 2018లో జరిగిన షట్‌డౌన్‌తో ఈసారి కాస్త తీవ్రత ఎక్కువగా ఉండొచ్చని అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఈ షట్‌డౌన్‌లో ఉన్న ప్రతివారం ఆర్థిక వృద్ధిలో 0.1 నుంచి 0.2 పాయింట్లు తగ్గొచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం చట్టసభ సభ్యుల్లో రాజీ సూచనలు కనిపించడం లేదు. అమెరికాలో షట్‌డౌన్ మొదలైతే ఎంతకాలం కొనసాగుతుందో చెప్పలేము. 1981 నుంచి అమెరికా ప్రభుత్వం 15 సార్లు మూతపడింది. 2018-19 మధ్య దాదాపు 35 రోజుల పాటు మూతపడగా.. నాడు ట్రంప్ అధ్యక్షుడిగా ఉన్నారు. అమెరికా చరిత్రలోనే అది సుదీర్ఘమైన షట్‌డౌన్.

అమెరికా షట్‌డౌన్‌తో భారత వాణిజ్యంపై ప్రభావం ఎంత?

అమెరికా ప్రభుత్వం అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సారథ్యంలో ఆరేళ్ల తర్వాత షట్‌డౌన్‌లోకి వెళ్లింది. ఈ నేపథ్యంలో భారత వాణిజ్యంపై పడే ప్రభావాల గురించి చర్చ జరుగుతోంది. అమెరికా షట్‌డౌన్ ప్రభావం భారత వాణిజ్యంపై తప్పకుండా ఉంటుంది. అయితే ఆ ప్రభావం తీవ్రత షట్‌డౌన్ ఎంత కాలం కొనసాగుతుందనే దానిపై ఆధారపడి ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. అమెరికా ప్రభుత్వం షట్‌డౌన్ అంటే ఫెడరల్ ప్రభుత్వానికి తాత్కాలికంగా నిధులు నిలిచిపోవడం అని అర్థం. అమెరికాలో ఫెడరల్ ప్రభుత్వ కార్యకలాపాలకు నిధులు కేటాయించడానికి అక్కడి పార్లమెంట్ (కాంగ్రెస్) 'బడ్జెట్ బిల్లులు' లేదా 'అప్రాప్రియేషన్ బిల్లులు' ఆమోదించాలి. ప్రతి ఆర్థిక సంవత్సరం ప్రారంభానికి ముందే ఈ నిధుల బిల్లులు ఆమోదం పొందాలి. ఒకవేళ కాంగ్రెస్ (సెనేట్, హౌస్ ఆఫ్ రిప్రజెంటేటివ్స్) తమలో తాము విభేదాల కారణంగా లేదా రాజకీయ కారణాల వల్ల ఆ గడువులోపు ఈ బిల్లులను ఆమోదించడంలో విఫలమైతే, ప్రభుత్వం వద్ద ఖర్చు చేయడానికి చట్టబద్ధంగా నిధులు ఉండవు. నిధులు లేకపోవడంతో అమెరికాలోని అత్యవసరం కాని అన్ని ప్రభుత్వ విభాగాలు, సర్వీసులు నిలిచిపోతాయి (షట్‌డౌన్ అవుతాయి). ప్రధానంగా పాలక పార్టీలు, ప్రతిపక్ష పార్టీల మధ్య రాజకీయ విభేదాలు తీవ్రంగా ఉన్నప్పుడు షట్‌డౌన్ ఏర్పడుతుంది. ఆరోగ్య సంరక్షణ, రక్షణ, సరిహద్దు భద్రత లేదా వలస విధానాల వంటి అంశాలపై ఏ పార్టీ ఎంత ఖర్చు చేయాలనే విషయంలో రాజీ కుదరకపోతే ఇలాంటి పరిస్థితులు నెలకొంటాయి. నిధుల బిల్లు ఆమోదాన్ని అడ్డుకుని తమకు కావాల్సిన ఇతర రాజకీయ డిమాండ్లు లేదా విధాన మార్పులను బడ్జెట్‌లో చేర్చాలని ఏదైనా ఒక పార్టీ పట్టుబడితే కూడా షట్‌డౌన్ వస్తుంది. అత్యవసరం కాని సేవలు నిలిపేస్తారు. జాతీయ పార్కులు మూసివేస్తారు. మ్యూజియంలు, అనేక ప్రభుత్వ కార్యాలయాలు మూతపడతాయి. పరిశోధన, గ్రాంట్ల జారీ, కొన్ని రకాల నియంత్రణ తనిఖీలు నిలిచిపోతాయి. అయితే అత్యవసర సేవలను మాత్రం కొనసాగిస్తారు. జాతీయ భద్రత, సైనిక కార్యకలాపాలు, విమాన రాకపోకల నియంత్రణ సోషల్ సెక్యూరిటీ, మెడికేర్ వంటి అత్యవసర సేవలు మాత్రం కొనసాగుతాయి. అత్యవసరం కాని విభాగాల్లోని లక్షలాది మంది ఉద్యోగులకు జీతాలు లేకుండా సెలవు ఇస్తారు. అత్యవసర విధుల్లో ఉన్న ఉద్యోగులు జీతం లేకుండా పనిచేయాల్సి వస్తుంది. కాంగ్రెస్ షట్‌డౌన్ తర్వాత ఆమోదాన్నిబట్టి వారికి తర్వాత జీతాలు చెల్లిస్తారు. షట్‌డౌన్ అనేది అమెరికా ఆర్థిక వ్యవస్థకు, ప్రపంచ దేశాలకు అనిశ్చితిని కలిగించే ఒక అరుదైన రాజకీయ సంక్షోభం. సాధారణంగా షట్‌డౌన్ కొన్ని రోజులు లేదా కొన్ని వారాలు మాత్రమే ఉంటే భారత వాణిజ్యంపై పెద్దగా ప్రభావం ఉండకపోవచ్చు. ఈ వార్తల కారణంగా ప్రపంచ మార్కెట్లు ముఖ్యంగా స్టాక్ మార్కెట్లు, డాలర్ విలువలో అస్థిరత ఏర్పడవచ్చు. దీని ఫలితంగా భారతీయ స్టాక్ మార్కెట్లు కూడా కొంత ఒడిదుడుకులకు లోనుకావచ్చు. షట్‌డౌన్ కారణంగా కీలకమైన అమెరికా ఆర్థిక డేటా (ఉదాహరణకు ఉద్యోగాల నివేదికలు, ద్రవ్యోల్బణం లెక్కలు) విడుదల ఆలస్యం కావచ్చు. ఈ డేటా ఆధారంగానే పెట్టుబడిదారులు, సెంట్రల్ బ్యాంకులు (ఫెడ్) నిర్ణయాలు తీసుకుంటాయి. కాబట్టి ఈ అనిశ్చితి ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతుంది.

వీసా, ఇమ్మిగ్రేషన్ సేవల్లో ఆలస్యం

అమెరికా ప్రభుత్వ కార్యకలాపాలు నెమ్మదిస్తే భారతీయ వృత్తి నిపుణులకు లేదా వ్యాపారవేత్తలకు సంబంధించిన వీసా, ఇమ్మిగ్రేషన్ సేవల్లో ఆలస్యం జరగవచ్చు. భారతీయ కంపెనీలకు అమెరికాలో అవసరమైన కొన్ని నియంత్రణ అనుమతులు లేదా లైసెన్సుల జారీలో ఆలస్యం ఏర్పడవచ్చు.

# దేశీయంగా ఐదోతరం స్టెల్త్ యుద్ధ విమానాల తయారీ

అదానీ డిఫెన్స్ తదితర సంస్థలు బిడ్డింగ్ దాఖలు వేశాయి. ఆ బిడ్లను మాజీ బ్రహ్మోస్ ఏరోస్పేస్ చీఫ్ ఎ.శివథాను పిళ్లై నేతృత్వంలోని కమిటీ పరిశీలించి రక్షణశాఖకు నివేదించనుంది. షార్ట్ లిస్ట్ చేసిన రెండు కంపెనీలను రక్షణశాఖ తుది ఎంపిక చేయనుంది. ఇద్దరు బిడ్డర్లకు రూ.15వేల కోట్ల విలువైన పనులు అప్పగిస్తారు. రూ. 2లక్షల కోట్ల ఏఎంసీఏ ప్రాజెక్టులో భాగంగా 125 ఐదోతరం స్టెల్త్ యుద్ధ విమానాలు తయారు చేయనున్నారు. 2035 నాటికి అవి వాయుసేనలో చేరే అవకాశం ఉంది. ఐదోతరం స్టెల్త్ యుద్ధ విమానాలను తయారు చేస్తే భారత్ అగ్ర దేశాలైన అమెరికా, చైనా, రష్యా సరసన చేరుతుంది. ఇప్పటివరకు అమెరికా ఎఫ్- 22, ఎఫ్- 35, చైనా జే- 20, రష్యా ఎస్‌యూ- 57 ఐదోతరం స్టెల్త్ యుద్ధ విమానాలు కలిగి ఉన్నాయి. భారత్ తయారు చేసే తొలి ఐదోతరం స్టెల్త్ యుద్ధ విమానాలు సింగిల్ సీట్, రెండు ఇంజన్లు కలిగి ఉండనున్నాయి. ఇవి అమెరికా, రష్యాకు చెందిన ఎఫ్?- 22, ఎఫ్?- 35, ఎస్?యూ- 57 మాదిరిగా అడ్వాన్స్‌డ్ స్టెల్త్ కోటింగ్‌తో పాటు అంతర్గత ఆయుధాలు కలిగి ఉండనున్నాయి. వాటి ఆపరేషనల్ సామర్థ్యం 55వేల అడుగులు కాగా అంతర్గతంగా 1,500కిలోలు, బాహ్యంగా 5,500కిలోలు ఆయుధాలను మోసుకెళ్లగలవని అంచనా. ఏఎంసీఏ మరో 6,500కిలోల ఇంధనాన్ని మోసుకెళ్లే సామర్థ్యం కలిగి ఉంటుంది. ఇందులో రెండు వెర్షన్ల ఇంజిన్లు ఉంటాయని తెలుస్తోంది. రెండో ఇంజిన్‌ను భారత్ దేశీయంగా అభివృద్ధి చేయనుంది. అది అమెరికా తయారీ జీఈ 414 మొదటి ఇంజిన్ కంటే శక్తివంతంగా ఉంటుందని అంచనా. మొత్తంగా ఇది సూపర్ మ్యానోవ్రబుల్, స్టెల్త్ మల్టీరోల్ ఫైటర్ జెట్ కానుంది.

## పూర్తి కాలం నేనే సీఎం

### స్పష్టం చేసిన ముఖ్యమంత్రి సిద్ధరామయ్య

బెంగుళూరు(జనంసాక్షి):కర్ణాటకలో ముఖ్యమంత్రి మార్పు అంశం మరోసారి తెరపైకి వచ్చింది. తమ గురువు డీకే శివకుమార్‌ను సీఎంగా చూడాలని కోరుకుంటున్నట్లు కుణిగల్ ఎమ్మెల్యే సహా పలువురు పార్టీ నేతలు డిమాండ్ చేయడం చర్చనీయాంశమైంది. వీటిపై స్పందించిన ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఐదేళ్ల పదవీ కాలానికి తానే సీఎంగా కొనసాగుతానని స్పష్టం చేశారు."ఐదేళ్ల పదవీకాలానికి నేనే సీఎంగా ఉంటా. వచ్చే ఏడాది మైసూరు దసరా ఉత్సవాల్లోనూ పుష్పార్చన చేస్తాననే నమ్మకం ఉంది. అయితే, పార్టీ అధిష్ఠానం ఏది నిర్ణయిస్తే దానికి కట్టుబడి ఉండాల్సిందే" అని సిద్ధరామయ్య పేర్కొన్నారు. ముఖ్యమంత్రిని మార్చాలంటూ కాంగ్రెస్‌లో ఓ వర్గం డిమాండ్ చేస్తోందని అడిగిన ప్రశ్నకు సీఎం ఇలా స్పందించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయానికి డీకే శివకుమార్ చేసిన కృషిని పార్టీ అధిష్ఠానం గుర్తించాలని కుణిగల్ ఎమ్మెల్యే హెచ్‌డీ రంగనాథ్ పేర్కొన్నారు. తన రాజకీయ గురువు డీకే శివకుమార్ అని.. సామాజిక సేవతో పాటు పాలనలోనూ ఆయన తనదైన ముద్ర వేసుకున్నారని చెప్పారు. రాష్ట్ర పాలనా పగ్గాలను డీకేఎస్‌కు అప్పగించాలన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు, ఓటర్లు ఇదే కోరుకుంటున్నారని, ఈ దిశగా అధిష్ఠానం కూడా నిర్ణయం తీసుకుంటుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు.

# మల్లికార్జున ఖర్గేకు అస్వస్థత

### – ఆస్పత్రికి తరలింపు – నిలకడగా ఆరోగ్యం

**బెంగళూరు(జనంసాక్షి):** కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభలో విప క్ష నేత మల్లికార్జున్ ఖర్గే (83) స్వల్ప అస్వస్థతతో బెంగళూరులోని ఎంఎస్ రామయ్య ఆసుపత్రిలో బుధవారం చేరారు. ఆ యన గుండెకు పేస్‌మేకర్ అమర్చాలని వైద్యులు సూచించారని ఖర్గే కుమారుడు ప్రియాంక్ ఖర్గే వెల్లడించారు. తన తండ్రి ఆరోగ్యం నిలకడగా ఉందని సామాజిక మాధ్యమం 'ఎక్స్' లో తెలిపా రు. 'ఖర్గేకు జ్వరం, కాలు నొప్పి కారణంగా మంగ ళవారం నాడు ఆసుపత్రిలో చేర్చాం. ఆయన ఆరో గ్యం నిలకడగా ఉంది. ఆందోళన పడాల్సిన పని లేదు. వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారు' అని కాం గ్రెస్ నేత ఒకరు తెలిపారు. ఖర్గే ఇటీవల పాట్నాలో జరిగిన సీడబ్ల్యూసీలో పాల్గొన్నారు. ఉత్తర కర్ణాటకలో భారీ వరదలు, పంట నష్టం బాధితులను ఆదుకోవాలని కర్ణాటక ప్రభు త్వాన్ని కోరారు. కేంద్ర సాయానికి లేఖ రాస్తానని కూడా చెప్పారు. ఈ క్రమంలో ఆయన అస్వస్థతకు గురయ్యారు.

# డిసెంబర్‌లో భారత్‌కు పుతిన్

### కేంద్రప్రభుత్వ వర్గాల వెల్లడి

న్యూఢిల్లీ(జనంసాక్షి): రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ డిసెంబర్‌లో భారత్‌కు రానున్నారు. రష్యా చమురు కొనుగోలుపై అమెరికా న్యూఢిల్లీపై శిక్షాత్మక సుంకాలను విధించిన దరిమిలా ఇరు దేశాల మధ్య సంబంధాలు బలపడుతున్న తరుణంలో పుతిన్, ప్రధాని మోదీల భేటీ కీలకంగా మారనుంది. గత ఆగస్టులో జాతీయ భద్రతా సలహాదారు (ఎన్‌ఎస్‌ఏ)అజిత్ దోవల్ మాస్కో పర్యటన సందర్భంగా ఈ ఉన్నత స్థాయి పర్యటనను తొలుత ప్రకటించారు. అయితే ఆ సమయంలో తేదీలను ఖరారు చేయలేదు. రష్యా అధ్యక్షుడు ఇటీవల చైనాలో జరిగిన షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) శిఖరాగ్ర సమావేశంలో ప్రధాని మోదీని కలుసుకున్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో శాంతిభద్రతల పరిక్షణకు కట్టుదిట్టమైన చర్యలు

పండితులు ఆహ్వానించారు. తెలంగాణ 6వ డీజీపీగా 1994 బ్యాచ్ ఐపీఎస్ అధికారి శివధర్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. నూతన డీజీపీగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం మీడియా సమావేశంలో పాల్గొన్నారు. తెలంగాణ డీజీపీగా అవకాశం కల్పించిన సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. పోరాట మార్గం వీడేందుకు సిద్ధమని ఇటీవల నక్సల్స్ నేత లేఖ రాశారు. జనజీవన ప్రవంతిలో కలిసిపోవాలని వారిని కోరుతున్నాం. మావోయిస్టుల సిద్ధాంతాలు ఆచరణలో విఫలమయ్యాయని భావిస్తున్నాం. లొంగిపోయిన వారికి అన్ని రకాలుగా అండగా ఉంటాం. రాష్ట్రంలో పోలీ సుస్టేషన్ల సంఖ్య కంటే పోలీసుల్లో నైపుణ్యాలను పెంచేందుకు చర్యలు తీసుకుంటాం. పోలీసు శాఖ ప్రత్యేక విభాగాల్లోని ఖాళీలను నిపుణులతో భర్తీ చేస్తాం అని డీజీపీ తెలిపారు. తెలంగాణలో శాంతి భద్రతలు కాపాడం మా మొదటి కర్తవ్యం. తెలంగాణ అభివృధికి, పెట్టుబడులు రాకకు లా అండ్ ఆర్డర్ ఎంతగానో



దోహదపడుతుంది. మా ముందు ఉన్న లక్ష్యం స్థానిక సంస్థల ఎన్నికలు సజావుగా నిర్వహించడం. మీడియా సహకారం చాలా అవసరం. పోలీస్ శాఖలో 17 వేల పోస్టులు ఖాళీ ఉన్నాయి, వాటిని భర్తీ చేయాలి. మావోయిస్టులు జనజీవన ప్రవంతిలో కలవడండి. మావోయిస్టులపై నమోదు అయిన కేసులు విషయంలో సానుకూలంగా వ్యవహరిస్తా. మావోయిస్టుపై వేధింపులు ఉండవు. ప్రభుత్వం ముందు మీరు ఆత్మసమర్పణ చేసుకోండి, ముందుకు రండి. మావోయిస్టు పార్టీ నుండి బయటికి రండి. మావోయిస్టు పొలిట్ బ్యూరో సుజాత ఇటీవలే మావోయిస్టు పార్టీని వీడారు. వేణుగోపాల్ ఇచిన స్టేట్మెంట్ జగన్ ఖండించారు. మావోయిస్ట్ నేత జగన్ ఇచిన స్టేట్మెంట్ అందరూ చూసాం. వీరి మధ్యలో సమస్యలు ఉన్నట్లు తెలుస్తుంది. ప్రభుత్వం మావోయిస్టులకు అందించాల్సిన బెనిఫిట్స్ అందిస్తాం. సైబర్ క్రైమ్ నేరాలు అరికట్టేందుకు తగిన చర్యలు తీసుకుంటాం. పోలీస్ సిబ్బంది స్కిల్స్ పెంచుతాం. బేసిక్ పోలింగ్ అండ్ విజువల్ పోలీసింగ్ మానిటరింగ్ సిస్టమ్ ఇంప్రూవ్ చేస్తాము' అని కొత్త డీజీపీ శివధర్ రెడ్డి చెప్పారు.

# డ్రగ్స్‌తో సరఫరా చేస్తూ పట్టుబడ్డ బాలీవుడ్ నటుడు

### చెన్నై విమానాశ్రయంలో నటుడు విశాల్ బ్రహ్మ నుంచి రూ.40 కోట్ల విలువైన మాదక ద్రవ్యాలు స్వాధీనం

చెన్నై(జనంసాక్షి):'స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్ 2' నటుడు విశాల్ బ్రహ్మ డ్రగ్స్‌తో పట్టుబడ్డారు. చెన్నై విమానాశ్రయంలో డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారులు ఆయన్ను అరెస్టు చేశారు. రూ.40 కోట్ల విలువైన మాదకద్రవ్యాలను స్వాధీనం చేసుకున్నారు. దీని వెనుక నైజీరియా గ్యాంగ్ హస్తం ఉన్నట్టు ప్రాథమికంగా గుర్తించారు. అస్సాంకు చెందిన విశాల్ బ్రహ్మ సినీ అవకాశాలు లేకపోవడం వల్ల ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటున్నాడని, డబ్బు కోసం స్నేహితుల ద్వారా నైజీరియా ముఠాకు పరిచయమయ్యాడని సమాచారం. అన్ని ఖర్చులూ తామే భరించి బ్రహ్మను కాంబోడియా ట్రిప్‌కు వెళ్లమని, భారత్‌కు మాదకద్రవ్యాలు చేరవేసేందుకు కొంత నగదు ఇస్తామని వారు ఆశ చూపినట్టు తెలిసింది. ఈ మేరకు రెండు వారాల క్రితం విశాల్ బ్రహ్మ దిల్లీ నుంచి కాంబోడియా వెళ్లాడని, తిరిగి వచ్చేటప్పుడు ఓ నైజీరియన్ అతడికి ట్రాలీ బ్యాగ్ ఇచ్చాడని, అందులోనే డ్రగ్స్ ఉన్నట్టు సమాచారం. సింగపూర్ మీదుగా కాంబోడియా నుంచి చెన్నై విమాన ప్రయాణం, చెన్నై నుంచి దిల్లీకి రైలు ద్వారా చేరుకునేలా నైజీరియా ముఠా బ్రహ్మకు సూచించినట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం

# దేశవ్యాప్తంగా కొత్తగా 57 కేవీలు

మిగిలిన 50 కేవీ స్కూల్స్ వివిధ రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో అందుబాటులోకి రానున్నాయి. తాజాగా కేంద్రం ప్రకటించిన 57కేవీ స్కూల్స్‌లలో ఇప్పటివరకు కేంద్రీయ విద్యాలయం లేని 20 జిల్లాల్లో కేంద్రం స్థాపించనుంది. మిగిలిన 14 అభివృద్ధి చెందాల్సిన జిల్లాల్లో, నాలుగు ఎల్‌బ్ల్యూఈ అంటే మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో, మిగిలిన ఐదు విద్యాలయాలు ఈశాన్య రాష్ట్రాలు పర్వత ప్రాంతాల్లో అందుబాటులోకి తెచ్చేలా కేంద్ర కేబినెట్ నిర్ణయం తీసుకుందని కేంద్ర మంత్రి అశ్వనీ వైష్ణవ్ అధికారికంగా ప్రకటించారు. ఈ కొత్త కేంద్రీయ విద్యాలయాలు 17 రాష్ట్రాలు,కేంద్ర పాలిత ప్రాంతాల్లో స్థాపించనుంది. దీంతో పాటు కేంద్ర కేబినెట్ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు 3 శాతం డీఏ పెంచింది. 57 నూతన కేంద్రీయ విద్యాలయాలకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఆత్మ నిర్భర భారత్ కింద పప్పు దినుసుల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి కోసం రూ. 11,440 కోట్ల రూపాయలు కేటాయించింది. ఈ మొత్తాన్ని క్వాలిటీ సీడ్స్, ట్రైనింగ్, మౌలిక వసతుల పెంపు, పప్పు ధాన్యాల సాగు విస్తీర్ణం పెంపు , ధర స్థిరీకరణ నిధి తదితర అంశాలపై కేంద్రం ఖర్చు చేయనుంది. రబీ సీజన్లో పంటలకు మద్దతు ధర కోసం రూ. 84,263 కోట్ల రూపాయలు కేటాయింపు. గోధుమకు రూ.2,585 రూపాయలు, బార్లీ రూ. 2150, శనగపప్పు రూ.5875, ఎర్ర పప్పు రూ.7000, ఆవాలు రూ. 6200, కుసుమ రూ. 6540 కేటాయించింది. కలియ బోర్ నుంచి నుమాలీఘర్ సెక్షన్ మధ్య జాతీయ రహదారి నిర్మాణానికి రూ.6957 కోట్లు విడుదల చేస్తున్నట్లు తెలిపింది. బయో మెడికల్ రీసెర్చ్ కెరీర్ ప్రోగ్రాం ఫేజ్ 3 కి ఆమోదం తెలిపిన కేంద్ర క్యాబినెట్.. ఈ ప్రాజెక్టులో 1500 కోట్ల రూపాయల పెట్టుబడి పెట్టనుంది. వందేమాతరం గేయం 150 సంవత్సరాల ఉత్సవాలకు క్యాబినెట్ ఆమోదం తెలుపుతూ నిర్ణయం తీసుకుంది.

**తెలంగాణకు కొత్తగా నాలుగు కేంద్రీయ విద్యాలయాలు: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి**

కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు కొత్తగా మరో నాలుగు కేంద్రీయ విద్యాలయాలను కేటాయించిందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. ఇప్పటికే ఉన్న 35 కేంద్రీయ విద్యాలయాలకు తోడుగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రం (యాస్పిరేషనల్ డిస్ట్రిక్ట్), ములుగు జిల్లా కేంద్రం (గిరిజన ప్రాంతం), జగిత్యాల జిల్లా - జగిత్యాల రూరల్ మండలం చెల్గల, వనపర్తి జిల్లా - నాగవరం శివారులో ఏర్పాటు చేయనున్నట్టు వివరించారు. ఈ నాలుగు విద్యాలయాలు మారుమూల ప్రాంతాల్లో.. నాణ్యమైన ప్రాథమిక, సెకండరీ విద్యను అందించడంలో కీలకం కానున్నాయని కిషన్ రెడ్డి విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. తెలంగాణలో విద్యాభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తున్నందుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు ధన్యవాదాలు చెప్పారు. గత రెండేళ్లలోనే కేంద్ర ప్రభుత్వం తెలంగాణలో నాణ్యమైన సెకండరీ విద్యను అందించేందుకు రూ.400 కోట్లతో 832 పీఎం-శ్రీ స్కూల్స్‌ను మంజూరు చేసిందని కిషన్ రెడ్డి తెలిపారు. దేశవ్యాప్తంగా పీఎం శ్రీ స్కూల్స్ కోసం ఎక్కువ కేటాయింపులు అందుకున్న రాష్ట్రం తెలంగాణనే కావడం విశేషమన్నారు. సమగ్రశిక్షా అభియాన్ కింద గత రెండేళ్లలో తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం దాదాపు రూ.2వేల కోట్లు కేటాయించిందని వివరించారు. దాదాపు రూ.వెయ్యి కోట్లతో ములుగు జిల్లాలో సమ్మక్క సారక్క సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీని కూడా కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిందని గుర్తుచేశారు.

# రెపోరేటు మరోసారి యథాతథం

### జీఎస్టీ సవరణలతో సుంకాల నుంచి ఉపమశమనం

### ఆర్‌బిఐ గవర్నర్ మల్హోత్రా వెల్లడి

ముంబయి(జనంసాక్షి):ఆర్బీఐ ద్రవ్య పరపతి విధాన సమీక్ష నిర్ణయాలను ప్రకటించింది. రెపోరేట్‌ను మరోసారి యథాతథంగా ఉంచింది. విశ్లేషకుల అంచనాలకు భిన్నంగా వరుసగా రెండోసారి రెపోరేట్‌ను 5.5 శాతం వద్దే కొనసాగించింది. ఈ ఏడాది ఫిబ్రవరి, ఏప్రిల్ సమీక్షల్లో 0.25 శాతం చొప్పున కీలక రేట్లను తగ్గించిన ఆర్‌బీఐ.. జూన్‌లో నిర్వహించిన సమావేశంలో ఏకంగా 50 బేసిస్ పాయింట్లు తగ్గించిన సంగతి తెలిసిందే. అలా మూడు వరుస సమీక్షల్లో కలిపి రెపోరేట్ 1శాతం తగ్గింది. ట్రంప్ టారిఫ్ ప్రకటనలు, అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో ఆగస్టులో మాత్రం యథాతథంగా 5.5 శాతం వద్దే ఉంచింది. కాగా, 2026-27 ఆర్థిక సంవత్సరానికి వినియోగదారుల ధరల ఆధారిత సూచీ ఆధారిత ద్రవ్యోల్బణం 4 శాతం లేదా అంతకంటే తక్కువ స్థాయిలో ఉండవచ్చని ఎస్‌బీఐ నివేదిక అంచనా వేసింది. జీఎస్టీ హేతుబద్ధీకరణతో అక్టోబర్‌లో అది మరింత తక్కువ ఉండే అవకాశముందని తెలిపింది. దాంతో కీలక వడ్డీరేట్లను మరో 25 బేసిస్ పాయింట్లు తగ్గించేందుకు హేతుబద్ధత ఉందని పేర్కొన్న సంగతి తెలిసిందే. కానీ అంచనాలకు భిన్నంగా ఈసారి రేట్‌ను యథాతథంగా కొనసాగించింది. ఇటీవల ప్రధాని నరేంద్ర మోదీ తీసుకువచ్చిన జీఎస్టీ, ఇతర సంస్కరణలు దేశ ఆర్థికవృద్ధిపై అమెరికా సుంకాల ప్రభావాన్ని కొంతమేర భర్తీ చేస్తాయని ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా అన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం రెండో భాగంలో సుంకాలకు సంబంధించిన పరిణామాలు తగ్గే అవకాశం ఉందన్నారు. 2026 ఆర్థిక సంవత్సరానికి జీడీపీ వృద్ధి అంచనాలను 6.5 నుంచి 6.8 శాతానికి ఆర్బీఐ సవరించిందన్నారు. దీంతో అనుకూల పరిస్థితులు, తక్కువ ద్రవ్యోల్బణం, ద్రవ్య సడలింపుల ద్వారా ఆర్థిక వృద్ధి అంచనా స్థిరంగా ఉందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో దేశీయ ఆర్థిక కార్యకలాపాలు ఊపందుకున్నట్లు తెలిపారు. మోదీ ప్రభుత్వం ప్రకటించిన వృద్ధిని ప్రేరేపించే విధాన సంస్కరణలు అమెరికా సుంకాల ప్రతికూల ప్రభావాలను ఎదుర్కోవడానికి సహకరిస్తాయని ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా పేర్కొన్నారు. సాఫ్ట్‌వేర్, సేవల ఎగుమతి బలంగా ఉందన్నారు. దేశంలోని 700.2 బిలియన్ డాలర్ల విదేశీ మారకపు నిల్వలు 11 నెలల దిగుమతులను సరిచేయడానికి సరిపోతాయన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో బలమైన చెల్లింపులు అవసరమన్నారు. ద్రవ్యోల్బణం గురించి మాట్లాడుతూ.. భారత ఆర్థికవ్యవస్థ అధిక వృద్ధిని నమోదు చేయడానికి సిద్ధంగా ఉందన్నారు. రూపాయి ఆధారిత లావాదేవీలను పెంచే లక్ష్యంతో నేపాల్, భూటాన్, శ్రీలంకలోని ప్రవాసులకు భారత రూపాయిలలో రుణాలు ఇవ్వడానికి బ్యాంకులను అనుమతించాలని ఆర్బీఐ ప్రతిపాదించింది. వాణిజ్యాన్ని సులభతరం చేయడానికి భారతదేశ ప్రధాన వాణిజ్య భాగస్వాముల కరెన్సీలకు పారదర్శక సూచన రేటును ఏర్పాటు చేయాలని సూచించింది..అదనంగా, కార్పొరేట్ బాండ్లు, వాణిజ్య పత్రాలలో పెట్టుబడులను అనుమతించడం, ప్రాంతీయ వాణిజ్యంలో రూపాయి ఏకీకరణను ప్రోత్సహించడం ద్వారా స్పెషల్ రూపీ వోస్ట్రో ఖాతా బ్యాలెన్స్‌ల వినియోగాన్ని విస్తరించాలని సూచించింది.

## చొరబాటుదారుల నుంచి దేశానికి ముప్పు

### – దేశ సేవలో ఎప్పుడూ ముందే ఉంటా

### – ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో ప్రధాని మోడీ వెల్లడి

న్యూఢిల్లీ(జనంసాక్షి):భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకగా ఉన్న భారతదేశానికి చొరబాటుదారుల నుంచి ముప్పు పొంచి ఉందని ప్రధాని మోదీ ఆందోళన వ్యక్తం చేశారు. వీరి వల్ల అంతర్గత భద్రతతోపాటు మత సామరస్యం ఆపదలో పడే అవకాశం ఉందన్నారు. బుధవారం న్యూఢిల్లీలో బీఆర్ అంబేద్కర్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో ప్రధాని మోదీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రూ.100 నాణెంతోపాటు పోస్టల్ స్టాంప్‌ను విడుదల చేశారు. అనంతరం ప్రధాని మోదీ మాట్లాడుతూ.. ఆర్‌ఎస్‌ఎస్ సేవలను ఈ సందర్భంగా ప్రశంసించారు. ఆర్‌ఎస్‌ఎస్ అనేది ఒక సంస్థ కాదని.. వ్యక్తిత్వ వికాసం ద్వారా దేశ నిర్మాణం కోసం పాటు పడే శక్తి అని అభివర్ణించారు. నేను అనే అహాన్ని వీడి.. మనం అనే సామూహిక భావన వైపు నడిపించే ప్రయాణమే ఆర్‌ఎస్‌ఎస్ అని వివరించారు. ఆర్‌ఎస్‌ఎస్‌కు అనేక అనుబంధ సంస్థలు ఉన్నా.. వాటి అంతిమ లక్ష్యం ఒక్కటేనని.. జాతీయతే అగ్రస్థానమని స్పష్టం చేశారు. అంతేకాకుండా ఈ అనుబంధ సంస్థల మధ్య వైరుధ్యాలు ఉండవని పేర్కొన్నారు. సంఘ్ వ్యవస్థాపకులు డాక్టర్ హెడ్గేవార్ దేశ నిర్మాణంతోపాటు స్వాతంత్య్ర పోరాటం కోసం ఆయన చేసిన సేవలను ఈ సందర్భంగా మోదీ గుర్తు చేశారు. ఇక స్వాతంత్య్రం అనంతరం ఆర్‌ఎస్‌ఎస్‌పై అనేక దాడులు జరిగాయని.. వాటన్నింటినీ తట్టుకుని నిలబడిందని ప్రధాని మోదీ తెలిపారు. శతాబ్ది ఉత్సవాలు జరుపుకొంటున్న ఆర్‌ఎస్‌ఎస్‌కు శుభాకాంక్షలు తెలిపారు. పేదల జీవితాల్లో మార్పు తెచ్చేందుకు ఆర్‌ఎస్‌ఎస్ కృషి చేస్తోందన్నారు. అసత్యంపై సత్యం, అన్యాయంపై



## డీజీపీని కలిసిన ఉప్పల శ్రీనివాస్ గుప్తా

**హైదరాబాద్ (జనంసాక్షి) :** తెలంగాణ నూతన డిజిపి బత్తుల శివధర్ రెడ్డిని తన కార్యాలయంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త మర్యాద పూర్వకంగా కలిసి దసరా పండుగ శుభకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ డీజీపీ గా పదవీ బాధ్యతలు స్వీకరించిన శివదర్ రెడ్డికి శుభకాంక్షలు తెలిపారు. వారి సారధ్యంలో శాంతి భద్రతల పరిరక్షణ సజావుగా సాగాలని ఆయన అన్నారు.

# వైభవంగా బతుకమ్మ వేడుకల ముగింపు

- జిల్లాలో ఉత్సాహంగా సాగిన పూలపండగ
- ఆడిపాడిన ఆడపడచులు..యువత కేరింతలు



**హైదరాబాద్, అక్టోబర్1 (జనంసాక్షి) :** తొమ్మిది రోజుల పాటు సందడి చేసిన బతుకమ్మ సంబరాలు ముగిసాయి. కొన్నిచోట్ల పదిరోజులు ఆడిపాడారు. హైదరాద్ ట్యాంక్‌బండ్‌పై పదిరోజుల నాడు సద్దుల బతుకమ్మ నిర్వహించారు. పెద్ద ఎత్తున నిర్వహించిన వేడుకల్లో మంత్రులు పొన్నం ప్రభాకర్, ఊపల్లి కృష్ణారావు, కొండాసురేఖ, పలువురు ప్రముఖ మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. సరూర్‌నగర్‌లో నిర్వహించిన బతుకమ్మ గిన్నీస్ బుక్‌లో చోటు సాధించింది. వచ్చే యేడాది మళ్లీ రావమ్మా అంటూ ఆడపడచులు బతుకమ్మకు వీడ్కోలు పలికారు. బుధవారం సద్దుల బతుకమ్మతో ఊరూవాడ సందడిగా కొనసాగింది. ఆడపడుచుల వీడ్కోలుతో బతుకమ్మ సాగిపోయింది. తెలంగాణలో ఆడబిడ్డలు తొమ్మిది రోజులపాటు పూల జాతరతో జరుపుకున్న బతుకమ్మ పండుగ సద్దుల బతుకమ్మతో ఘనంగా ముగిసింది. సద్దుల బతుకమ్మ సందర్భంగా పల్లె, పట్నం, ఊరూ, వాడా, తంగేడు, గునుగు పువ్వుల వనాలయ్యాయి. హైదరాబాద్‌లోని ట్యాంక్ బండ్ విద్యుత్ దీపకాంతుల్లో వెలిగిపోయింది. మొత్తంగా సద్దుల బతుకమ్మ పండుగ సంబరంగా ముగిసింది. తెలంగాణ ఇంట ఆడబిడ్డలు తొమ్మిది రోజులపాటు రకరకాలపూలతో ఆనందంగా జరుపుకొన్నారు. చిన్నా, పెద్దా తేడాలేకుండా ఆడబిడ్డలు రామ రామ రామ ఉయ్యాలో.. తొమ్మిది రోజులు ఉయ్యాలో.. అంటూ ఆడిపాడారు. తెలంగాణ బిడ్డలకు దీవెనలు ఇస్తూ బతుకమ్మ.. గంగమ్మ ఒడికి చేరింది. వర్షాలతో చెరువులు, కుంటలు కళకళలాడడంతో బతుకమ్మలకు కలిసివచ్చింది. పూల సింగిడి సందడి చేసింది.. సద్దుల సంబురం కనులవిందు చేసింది.. ఆడపడుచుల ఆనందం ఆకాశాన్నంటింది.. తొమ్మిదిరోజుల పాటు సంబురంగా జరుపుకున్న బతుకమ్మ వేడుకలను ఆడపడుచులు సంబురంగా జరుపుకున్నారు. ఎంగిలి పూల బతుకమ్మతో మొదలైన బతుకమ్మ సంబురాలు తొమ్మిది రోజుల పాటు అంగరంగవైభవంగా జరిగాయి. ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో మహిళా ఉద్యోగులు పెద్ద ఎత్తున బతుకమ్మ వేడుకల్లో పాల్గొని చివరిరోజు ట్యాంక్‌బండ్‌తో సహా, జిల్లాల్లో భారీ బతుకమ్మతో వేడుకలు నిర్వహించుకోగా సద్దుల బతుకమ్మను జిల్లా మహిళా మణులు భారీ బతుకమ్మలతో ఆడిపాడారు. అన్ని గ్రామాల్లో పూలపండగతో మహిళలు సందడి చేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, ఆడపడుచులు పెద్ద ఎత్తున బతుకమ్మ కార్యక్రమాల్లో పాల్గొని ఉత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. చివరి రోజు ప్రతీ ఇంటా బతుకమ్మను పేర్చి ఇళ్లవాకిళ్ల ఎదుట బతుకమ్మ పాటలతో ఆడిపాడి చివరికి బతుకమ్మ ఘాట్‌ల వద్ద కూడా చిందేశారు. బతుకమ్మ ఉత్సవంలో చివరిరోజు జిల్లా వ్యాప్తంగా ప్రజాప్రతినిధులు పాల్గొని సందడి చేశారు. ఆడపడుచులతో ఆడిపాడి సంబురంలో పాల్గొన్నారు. గల్లీల నుంచి పట్నం వరకు చిన్నారుల నుంచి పెద్దల వరకు బతుకమ్మ ఉత్సవాలను కనుల పండువగా జరుపుకున్నారు. రోజుకొక శాఖ ఉద్యోగులు కార్యాలయాల్లో బతుకమ్మలు పేర్చి డీజే పాటలతో సందడి చేశారు. సద్దుల బతుకమ్మ సందర్భంగా హైదరాబాద్‌లోని ట్యాంక్ బండ్ విద్యుత్ దీపకాంతుల్లో వెలిగిపోయింది. ప్రభుత్వం ఏర్పాటు చేసిన బతుకమ్మ ఉత్సవాలు ట్యాంక్‌బండ్ వద్ద సంబరంగా సాగాయి. సాంస్కృతిక కళారూపాలతో, పెద్దఎత్తున డప్పు చప్పుళ్లు, కళాకారుల నృత్యాలతో ట్యాంక్‌బండ్‌వరకు ఊరేగింపు కళాత్మకంగా సాగింది. రాత్రి పొద్దుపోయేవరకు ట్యాంక్‌బండ్‌పై ఆడబిడ్డలు బతుకమ్మ ఆడారు. వరంగల్ నగరంలో సద్దుల బతుకమ్మ సంబురాలు అంబరాన్నంటాయి. వేల మంది మహిళలు హన్మకొండలోని పద్మాక్షి గుండం, వరంగల్‌లోని రంగసముద్రం వంటి ప్రాంతాల్లో ఆడిపాడారు. కరీంనగర్, సిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లి, మెదక్, సిద్ధిపేట, సంగారెడ్డి, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, మహబూబ్‌నగర్, నిజామాబాద్, కామారెడ్డి, యాదాద్రి భువనగిరి, ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల, కుమ్రంభీం ఆసిఫాబాద్, నల్లగొండ, ఖమ్మం, సూర్యాపేట, భద్రాద్రి కొత్తగూడెం, జనగామ, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో సద్దుల పండుగ ఉత్సాహంగా సాగింది. పలు ప్రాంతాల్లో ఉత్తమ పాట, ఆటలకు బహుమతులు ప్రకటించడంతో ఆడిపాడేందుకు యువతులు పోటీపడ్డారు. సిద్ధిపేటలో పెద్ద ఎత్తున కోమటి చెరువు వద్ద ఆడిపాడారు. ప్రభుత్వం బతుకమ్మ ఉత్సవాన్ని అధికారికంగా నిర్వహించడంతో ప్రభుత్వ శాఖల అధికారులు అన్ని కార్యాలయాల్లో బతుకమ్మ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు.

# లండన్‌లో వైభవంగా 'టాక్ - చేనేత బతుకమ్మ - దసరా' సంబరాలు



**లండన్ (జనంసాక్షి) :** తెలంగాణ అసోసియేషన్ అఫ్ యునైటెడ్ కింగ్ డమ్(టాక్) ఆధ్వర్యంలో లండన్ లో చేనేత బతుకమ్మ – దసరా సంబరాలు ఘనంగా జరిగాయి. ఈ సంబరాలకు యూకే నలుమూలల నుండి రెండు వేలకు పైగా ప్రవాస భారతీయ కుటుంబ సభ్యులు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా స్థానిక హౌన్స్లో నగర మేయర్ అమీ క్రాఫ్ట్ , తెలంగాణ రాష్ట్ర ఫిలిం డెవలప్మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మరియు టాక్ వ్యవస్థాపకుడు అనిల్ కూర్మాచలం పాల్గొన్నారు. గత కెసిఆర్ నాయకత్వం లో చేనేతకు చేయూతనిస్తూ ఎన్నో కార్యక్రమాలు నిర్వహించిన విషయం మనందరికీ తెలిసిందే, అదే స్ఫూర్తితో రాష్ట్ర మాజీ మంత్రి కే.టి.ఆర్ గారి కృషికి మా వంతు బాధ్యతగా చేనేతకు చేయూతనిస్తూ ప్రతీ సంవత్సరం లాగా నేడు కూడా వేడుకలను "చేనేత బతుకమ్మ మరియు దసరా" గా జరుపుకున్నామని టాక్ అధ్యక్షుడు రత్నాకర్ కడుదుల తెలిపారు.

హౌన్స్లో నగర మేయర్ అమీ క్రాఫ్ట్ మాట్లాడుతూ యూకే లో నివసిస్తున్న తెలంగాణ ఎన్నారైలంతా సమాజ సేవలో ఎంతో క్రియాశీలకంగా పాల్గొంటారని, వీరి స్ఫూర్తి చాలా గొప్పదని తెలిపారు. విదేశాల్లో ఉన్నపటికీ తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలని ప్రపంచానికి చాటి చెప్తున్న తీరు చాలా గొప్పగా ఉందని టాక్ సంస్థను చూసి గర్వపడుతున్నామని తెలిపారు. టాక్ సంస్థ చేస్తున్న కార్యక్రమాలు ఎందరికో స్ఫూర్తినిస్తున్నాయని ప్రశంసించారు. స్థానికంగా ఎటువంటి సహాయం కావాలన్న మమ్మల్ని సంప్రదించవచ్చని, లండన్ నగరం భిన్న సంస్కృతుల ప్రజలు నివసించే నగరమని, మనమంతా ఐకమత్యంగా ఉండి పరస్పర సంప్రదాయాలని సంస్కృతిని గౌరవించుకుంటూ ముందుకు వెళ్లాలని తెలిపారు.

తెలంగాణ రాష్ట్ర ఎఫ్డీసి మాజీ చైర్మన్ అనిల్ కూర్మాచలం మాట్లాడుతూ నేడు ఈ వేడుకలకు టాక్ సంస్థ కార్యకర్తగా, మన తెలంగాణ సంస్కృతిని విశ్వవ్యాప్తం చెయ్యాలనే సంకల్పం తో పాల్గొనడం జరిగిందని, ముందుగా తెలంగాణ ఆడబిడ్డలకు బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు. లండన్ గడ్డ పై ఎత్తిన జెండాను దించకుండా అది రాజకీయ వేదికలైన సామాజిక సంస్థలకు సంబందించిన వేదికలైన ప్రపంచానికే స్ఫూర్తిగా, ఆదర్శంగా టాక్ కార్యవర్గం నిలిచిందని వారందరిని ప్రత్యేకంగా అభినందించారు. హాజరై విజయవంతం చేసిన అతిథులకు, ప్రవాస బిడ్డలకు, సహకరించ ప్రతీ ఒక్కరికి అనిల్ కృతజ్ఞతలు తెలిపారు. టాక్ తలపెట్టిన ప్రతీ కార్యక్రమాన్ని ఎంతో విజయవంతం చేసి ప్రవాస సామాజం లో టాక్ ప్రత్యేక గుర్తింపుని పొందిందని టాక్ ఉపాధ్యక్షురాలు శుష్మన తెలిపారు. మా పిలుపు మేరకు హాజరైన ప్రవాసులు చేనేత బట్టలు ధరించి పాల్గొనడం మాకెంత సంతోషాన్ని మరియు స్ఫూర్తినిచ్చిందని ప్రధాన కార్యదర్శి సుప్రజ పులుసు తెలిపారు. ఉపాధ్యక్షుడు సురేష్ బుడగం మాట్లాడుతూ, దసరా పండుగ సందర్భంగా స్వదేశం నుండి తెచ్చిన శమీ చెట్టుకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఏర్పాటు చేసిన దసరా అలాయ్ – బలాయ్ " కార్యక్రమం లో, చేనేత శాలువాలను ఒకరికొరకు పరస్పరం వేసుకొని, జమ్మి (బంగారం)ని ఇచ్చి పుచ్చుకొని శుభాకాంక్షలు తెలుపుకొని, చేనేతకు చేయూతగా వీలైనన్ని సందర్భాల్లో చేనేత బట్టలు దరిస్తామని ప్రతిజ్ఞ చేశారు. జమ్మి ఆకులు పంచుకుంటూ లండన్ పట్టణానికి 'అలాయ్ బలాయ్' ల తెలంగాణ స్నేహమాధుర్యాన్ని ప్రత్యక్షంగా రుచి చూపించారని పలువురు ప్రశంశించారు. చేనేత పేరుతో బతుకమ్మ వేడుకల్ని నిర్వహించడం వినూత్నంగా ఉందని, వీరి ప్రయత్నం ఫలించి నేత కుటుంబాలకు మేలు జరగాలని కోరుతూ శుభాకాంక్షలు తెలిపారు. అలాగే తెలంగాణ ప్రత్యేకతను చాటి చెప్పేలా బతుకమ్మ ను ఇంత పెద్ద ఎత్తున నిర్వహిస్తునందుకు టాక్ సంస్థను పలువురు అభినందించారు. టాక్ కన్వీనర్ అశోక్ గౌడ్ దూసరి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తరువాతే మన పండగలకు, మన సంస్కృతికి సరైన గౌరవం గుర్తింపు లభించిందని, కాబట్టి కెసిఆర్ గారి పేరు చరిత్రలో చిరస్మరణీయంగా నిలిచిపోతుందని తెలిపారు. బతుకమ్మ వేడుకల్లో పాల్గొనడం సంతోషంగా ఉందని చేనేతకు చేయూతగా చేస్తున్న వేడుకల్లో ఎంతో సామాజిక బాధ్యత ఉందని తెలిపారు. ఉద్యమ బిడ్డలుగా ప్రతి కార్యక్రమానికి సామాజిక బాధ్యతను జోడించి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, అన్నింటిని ప్రోత్సహించి విజయవంతం చేస్తున్న ప్రవాసులందరికి టాక్ అడ్విసోరీ బోర్డు చైర్మన్ మట్టా రెడ్డి మరియు టాక్ ఈవెంట్స్ ఇంచార్జి మల్లా రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

టాక్ కన్వీనర్, ఎన్నారై బీఆర్‌యస్ యూకే అధ్యక్షుడు నవీన్ రెడ్డి మాట్లాడుతూ టాక్ సంస్థ ఆలోచలనకు ఆశయాలకు అనుగుణంగా మన సంస్కృతిని విశ్వవ్యాప్తం చేయడానికి అన్నిరకాలుగా కృషి చేస్తామని తెలిపారు. హాజరైన అతిథులందరికీ తెలంగాణ పండగ భోజనాన్ని స్పాన్సర్ చేసిన నాగరాజు తౌటంని టాక్ సంస్థ ప్రత్యేకంగా సన్మానించి గౌరవించారు. టాక్ ఉపాధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి రాకేష్ పటేల్, సత్యపాల్ రెడ్డి పింగళి మాట్లాడుతూ గతంలో ఎన్నో సందర్భాల్లో నాగరాజు టాక్ సంస్థకు వివిది సహాయ సహకారాలు అందించారని, అలాగే ఎల్లపుడూ దాన్ని కొనసాగించాలని విజ్ఞప్తి చేసి వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. టాక్ కార్యదర్శులు రవి రేతినేని, హరి గౌడ్, గణేష్ కుప్పాల మాట్లాడుతూ మా వేడుకలకు హాజరైన ప్రవాస సంస్థల ప్రతినిధులకు, సహకిరించిన స్పాన్సర్ సంస్థలకు, స్థానిక అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఇక్కడికి వచ్చిన ప్రవాసులు, టాక్ సంస్థ ప్రతినిధులను ఉద్దేశించి ఈ వేడుకల్లో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందని. ఒక పక్క వ్యక్తిగతంగా రోజు వారి పనుల్లో బిజీగా వున్నప్పటికీ, బాద్యత గల తెలంగాణా బిడ్డలు గా తెలంగాణా సంస్కృతి ని ప్రపంచానికి చాటి చెప్తున్న టాక్ సంస్థని ప్రశంసించారు. ఉత్తమ బతుకమ్మలకు గోల్డ్ కాయిన్స్ బహుమతి మరియు బతుకమ్మ తెచ్చిన ఆడబిడ్డలకు బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఎఫ్డీసి మాజీ చైర్మన్ మరియు టాక్ వ్యవస్థాపకుడు అనిల్ కూర్మాచలం, టాక్ అధ్యక్షుడు రత్నాకర్ కడుదుల, టాక్ ఉపాధ్యక్షులు శుష్మణ రెడ్డి , సురేష్ బుడగం , రాకేష్ పటేల్, టాక్ ప్రధాన కార్యదర్శులు సుప్రజ పులుసు,సత్యపాల్, శ్రీకాంత్ జెల్ల , అడ్వైసరి బోర్డు చైర్మన్ మట్టా రెడ్డి, ముఖ్య సభ్యులు అశోక్ దూసరి, నవీన్ రెడ్డి ,మల్లా రెడ్డి, గణేష్ కుప్పాల ,పవిత్ర కంది , స్వాతి బుడగం, సుప్రజపులుసు, సత్యమూర్తి చిలుమలా , వెంకట్ రెడ్డి దొంతుల,సత్యంకంది ,రవి రేటినేని, రవి ప్రదీప్ ,హరి గౌడ్ నవాబ్ పేట్,క్రాంతి రేటినేని, జాహ్నవి , శశి, తేజ , నిఖిల్, నాగరాజు , ప్రవీణ్ వీర, మాధవ రెడ్డి , రంజిత్,కార్తీక్, శ్రీధర్ రావు , స్నేహ,శైలజ, శ్రీ విద్య, అంజన్ రావు, మహేందర్, శ్వేతా మహేందర్, మౌనిక ,రాజేష్ వాక , మ్యాడి యువజన విభాగం నాయకులు తరుణ్ తదితరులు పాల్గొన్న వారిలో ఉన్నారు.

## సీఎస్‌తో డీజీపీ మర్యాదపూర్వక భేటీ



**హైదరాబాద్, అక్టోబర్1 (జనంసాక్షి) :** నూతనంగా డిజిపిగా శివధర్ రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణా రావును మర్యాద పూర్వకంగా కలిశారు. ఇంటలిజెన్స్ విభాగం అడిషనల్ డీజీగా బాధ్యతలు చేపట్టిన విజయ్ కుమార్ కూడా సీఎస్ రామకృష్ణారావును మర్యాద పూర్వకంగా కలిశారు.

## రైలు ఎక్కబోతూ ప్రమాదానికి గురైన ఏఎస్ఐ

- చికిత్స పొందుతూ మృతి

**వికారాబాద్, అక్టోబర్1 (జనంసాక్షి) :** రైలు ఎక్కుతూ ప్రమాదవశాత్తు జారిపడి ఏఎస్సై మృతిచెందారు. ఈ ఘటన వికారాబాద్ జిల్లా తాండూరు రైల్వేస్టేషన్‌లో చోటుచేసుకుంది. వికారాబాద్ రైల్వే ఎస్‌హెచ్‌వో హరిప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటకలోని చించోలి తాలూకా మర్పల్లికి చెందిన మారుతి (49) కలబురగి జిల్లా జేడీ హల్లి పీఎస్‌లో ఏఎస్సైగా పనిచేస్తున్నారు. మంగళవారం రాత్రి విధులకు వెళ్లేందుకు తాండూరు రైల్వేస్టేషన్‌లో రాత్రి 11 గంటల సమయంలో యశ్వంతపూర్ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కేందుకు యత్నించారు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు జారి రైలు కింద పడ్డారు. రెండు కాళ్లు విరిగిపోవడంతో అపస్మారక స్థితికి చేరుకున్నారు. రైల్వే సిబ్బంది శ్రీను, నదీమ్ ఆయన్ను వెంటనే తాండూరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కుటుంబసభ్యులు కలబురగిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతిచెందారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు రైల్వే ఎస్‌హెచ్‌వో తెలిపారు.

## కరూర్ ఘటనతో విజయ్ తీవ్ర మనస్థాపం

- రాష్ట్ర పర్యటనలు రద్దు చేసుకున్నట్లు వెల్లడి

**చెన్నై, అక్టోబర్ 1 (జనంసాక్షి) :** తమిళనాడులో టీవీకే పార్టీ అధినేత, స్టార్ యాక్టర్ విజయ్ నిర్వహించిన ర్యాలీ విషాదకరంగా ముగిసింది. కరూర్ లో జరిగిన తొక్కిసలాటలో 41 మంది మరణించారు. పదుల సంఖ్యలో గాయపడ్డారు. ఇది ఆ రాష్ట్రంలో రాజకీయంగా విమర్శలు ప్రతివిమర్శలకు కారణమైంది. అధికార డీఎంకే పార్టీ మాట్లాడుతూ.. విజయ్ పోలీసుల నిబంధనలు, నియమాలను ఉల్లంఘించినట్లు ఆరోపించింది. ఈ వ్యవహారంలో డీఎంకే కుట్ర ఉందని విజయ్ పార్టీ ఆరోపించింది. స్వతంత్ర సంస్థ లేదా సీబీఐ ద్వారా విచారణ జరిపించాలని డిమాండ్ చేసింది.ఈ విషాదకర ఘటన తర్వాత విజయ్ తన రాష్ట్ర వ్యాప్త పర్యటన రద్దు చేసుకున్నారు. తొక్కిసలాట తర్వాత విజయ్ ర్యాలీలపై తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. ఇప్పుడున్న పరిస్థితుల్లో ర్యాలీని కొన్ని రోజుల వరకు రద్దు చేయాలని టీవీకే భావించినట్లు తెలుస్తోంది.

# సొంతూళ్లకు బయలుదేరిన నగరప్రజలు

- ప్రత్యేక బస్సులు నడుపుతున్న ఆర్టీసీ



**హైదరాబాద్, అక్టోబర్ 1 (జనంసాక్షి) :** దసరా పండుగ సందర్భంగా హైదరాబాద్ నగర వాసులు సొంతూళ్లకు పయనమయ్యారు. ప్రస్తుతం బస్‌స్టాండ్‌లు అన్ని జనాలతో కిక్కిరిసిపోయాయి. ప్రయాణికుల రద్దీ దృష్ట్యా తెలంగాణ ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. దసరాకి ప్రత్యేకంగా 7754 బస్సులను ప్రయాణికుల కోసం ఏర్పాటు చేసింది. జేబీఎస్, ఎంజీబీఎస్‌తో పాటు ఆరంఘర్, ఎల్బీ నగర్, ఉప్పల్ వంటి రద్దీ ప్రాంతాల్లో తాత్కాలిక బస్ స్టాండ్‌లను ఆర్టీసీ అధికారులు ఏర్పాటు చేశారు. గతంలో పండగలకు జనాలు ఆర్టీసీ బస్సులలో కిక్కిరిసిన రద్దీతో వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు పండగలకు అధిక సంఖ్యలో బస్సులను ఏర్పాటు చేయడంతో.. ప్రయాణికులు ప్రశాంతంగా జర్నీ చేస్తున్నారు. బస్సులు చాలా ఉండడంతో చాల మంది ప్రయాణికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇక 2013 జీవో ప్రకారమే పండగలకు అదనపు చార్జీలు వసూలు చేస్తున్నామని ఆర్టీసీ అధికారులు చెప్పారు. రిటర్న్ జర్నీ ఖాళీగా రావాల్సి వస్తుండటంతో.. చాలా మినిమం చార్జీలు వసూలు చేస్తున్నామని తెలిపారు. రేపే దసరా కాబట్టి ఇప్పటికే సగానికి పైగా సిటీ ఖాళీ అవ్వగా.. రాత్రికి మొత్తం ఖాళీ అయ్యే అవకాశం ఉంది.

## ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు జీతాలివ్వరా?

- ప్రభుత్వ తీరుపై మండిపడ్డ ఆర్ఎస్పి



**హైదారబాద్, అక్టోబర్ 1 (జనంసాక్షి) :** కాంగ్రెస్ సర్కార్‌పై బీఆర్ఎస్ సీనియర్ లీడర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కన్నెర్ర జేశారు. పలు ప్రభుత్వ సంస్థల్లో పని చేస్తున్న పార్ట్ టైమ్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు సమయానికి జీతాలు రాక అవస్థలు పడుతున్నారని ఆర్ఎస్పీ ధ్వజమెత్తారు. గత ఐదు నెలల నుండి సంక్షేమ గురుకులాల్లో పని చేస్తున్న పార్ట్ టైం ఉద్యోగస్తులకు జీతాలు రాలేదు అని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ గుర్తు చేశారు. చిరు కాంట్రాక్టర్లకు బిల్లులు కూడా రాలేదని ధ్వజమెత్తారు. ఈ దసరాకు వాళ్ల కుటుంబాల పరిస్థితి ఏంటి?బంధువులు ఇంటికొస్తే ఏం పెట్టాలె వాళ్లకు? అని సర్కార్‌ను ఆర్ఎస్పీ నిలదీశారు. కేవలం మీరు, మీ దగ్గరున్న బడా కాంట్రాక్టర్లు మాత్రమే మొబిలైజేషన్ అడ్వాన్సు తీసుకొని ఆనందంగా ఉంటే చాలా సీఎం రేవంత్ రెడ్డి గారు? అని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ప్రశ్నించారు.

# చుక్కా రామయ్యకు పద్మవిభూషణ్ ఇవ్వాలి

- తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్
- ప్రముఖ రచయిత నాగసూరి వేణుగోపాల్ రచించిన 'గ్లోబల్ రోల్‌మోడల్ మహాత్మాగాంధీ' పుస్తకావిష్కరణ



**హైదరాబాద్ (జనంసాక్షి) :** తెలుగు రాష్ట్రాల విద్యార్థులను సాంకేతిక సైన్యంగా తయారుచేసి, తరగతిగదే ప్రాణంగా జీవించిన స్వాతంత్ర్య సమరయోధుడు చుక్కా రామయ్యకు కేంద్ర ప్రభుత్వం పద్మ విభూషణ్ ఇచ్చి సత్కరించాలని తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్ కోరారు. వేలాదిమంది ఐఐటీలను తయారుచేసి దేశానికి ప్రపంచానికి అందించిన చుక్కారామయ్య రెండు తెలుగు రాష్ట్రాలు గర్వించదగిన వ్యక్తి అని పేర్కొన్నారు. గాంధీ 156వ జయంతి సందర్భంగా ప్రముఖ గాంధీయవాది, రచయిత డాక్టర్ నాగసూరి వేణుగోపాల్ రచించిన 'గ్లోబల్ రోల్ మోడల్ మహాత్మా గాంధీ' అన్న పుస్తకాన్ని ప్రముఖ విద్యావేత్త చుక్కా రామయ్య బుధవారం తన నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జూలూరు మాట్లాడుతూ అమెరికాలోని సిలికాన్ వాలీ తెలుగు విద్యార్థులతో నిండిపోవడానికి కారకుడు రామయ్యే అన్నారు. దేశం ఆత్మ గ్రామము అని గాంధీజీ చెప్పారని, తెలంగాణ గ్రామాల విముక్తి కోసం చుక్కారామయ్య తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొని జైలు జీవితాన్ని అనుభవించారని గుర్తు చేశారు. పుస్తక రచయిత డాక్టర్ నాగసూరి వేణుగోపాల్ మాట్లాడుతూ గాంధీని విడదీసి భారతదేశం చూస్తే దేశం కొత్తగా, మనది కాదన్నట్లుగా కనిపిస్తుందని చెప్పారు. గాంధీ వ్యక్తిత్వం, ఆయన ఆలోచనలు ఆచరణ, తాత్వికత నేటి కాలానికి ఎంత అవసరమో గ్లోబల్ రోల్ మోడల్ గాంధీ పుస్తకంలో వివరించినట్లు తెలిపారు. తెలంగాణ పబ్లికేషన్స్ వ్యవస్థాపకుడు కోయ చంద్రమోహన్ మాట్లాడుతూ నేటి సమాజానికి గాంధీ ఎంత అవసరమో రచయిత నాగసూరి ఈ పుస్తకంలో వివరించారని పేర్కొన్నారు. ఈ పుస్తకావిష్కరణలో రామానంద తీర్థ గ్రామీణ విద్యా సంస్థ చైర్మన్ నారా కిషోర్ రెడ్డి, రామయ్య తనయుడు సైంటిస్ట్ చుక్కా శ్రీనివాస్, ఫస్ట్ రీల్ ఎం.డి. జూలూరు శివసాగర్, చేగోని, కోటి తదితరులు పాల్గొన్నారు.

## బంగాళాఖాతంలో అల్పపీడనం

- ఉభయ తెలుగు రాష్ట్రాలకు వర్షసూచన

**విశాఖపట్టణం, అక్టోబర్ 1 (జనంసాక్షి) :** ఏపీ, తెలంగాణ రాష్ట్రలను వరుణుడు ఏమాత్రం వదిలిపెట్టడం లేదు. మొన్నటి వాయుగుండం ప్రభావం పూర్తిగా తగ్గక ముందే.. మరో అల్పపీడనం కదలికలు ప్రారంభించింది. ఇది వాయుగుండంగా మారే అవకాశముందని, వచ్చే నాలుగు రోజులపాటు రెండు రాష్ట్రాల్లోనూ వర్షాలు తప్పవని వాతావరణశాఖ హెచ్చరించింది. గత కొన్ని నెలలుగా ఏపీ, తెలంగాణలో వర్షాలే ప్రధాన సమస్యగా మారాయి. కాలం మారినా వానలు మాత్రం ఆగడంలేదు. కొన్నిచోట్ల కుండపోతగా కురుస్తూ జనజీవనాన్ని అస్తవ్యస్తం చేస్తున్నాయి. ఇటీవల బంగాళాఖాతంలోని వాయుగుండం కారణంగా రెండు మూడు రోజులపాటు భారీ వర్షాలు కురిశాయి. ఇప్పుడు మళ్లీ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడింది. విపత్తుల నిర్వహణ సంస్థ సమాచారం ప్రకారం, పశ్చిమమధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన ఈ అల్పపీడనం వాయువ్య దిశగా కదిలి గురువారానికి వాయుగుండంగా బలపడనుంది. శుక్రవారం ఉదయానికి ఇది దక్షిణ ఒడిశా ? ఉత్తరాంధ్ర తీరాలను తాకే అవకాశం ఉంది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో వారం రోజులపాటు వర్షాలు కురుస్తాయని అంచనా.

## మాజీమంత్రి లక్ష్మారెడ్డికి మాతృ వియోగం

- సంతాపం తెలిపిన కేటీఆర్



**హైదరాబాద్, అక్టోబర్1 (జనంసాక్షి) :** బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, మాజీ మంత్రి లక్ష్మారెడ్డి మాతృమూర్తి చర్లకోల లక్ష్మమ్మ మరణిం చడంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈ విషాద సందర్భంలో లక్ష్మారెడ్డికి, వారి కుటుంబ సభ్యులందరికీ కేటీఆర్ తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. లక్ష్మమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని, ఈ కష్ట సమ యంలో కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు కేటీఆర్ పేర్కొన్నారు.

# విజయదశమి మూలవాసుల పోరాటం

(విజయదశమి సందర్భంగా విమర్శనాత్మక వ్యాసం)

మన పండుగలు సామాజిక ఏకీకరణకు, ఐక్యతకు పెంపొందించాలి. మనిషి జీవన పోరాట ఆయుధాలు కావాలి. కానీ మనదేశంలో అవి సాంస్కృతిక ఆధిపత్యానికి నెలవుగా మారుతున్నాయి. అంతర్లీనంగా సాంస్కృతిక ఉనికి స్పష్టంగా కనబడుతుంది. భారతదేశంలో కొన్ని పండుగలు, వేడుకలు విజయానికి గుర్తుగా గొప్ప సాంస్కృతిక వైభవం కనబడుతుంది. పరాజితులైన వెనకబడిన వర్గాలు చారిత్రక సాంస్కృతిక వారసత్వం అందులో కనబడదు. విజయదశమి దసరా పండగ దీనికి ఉదాహరణ. ఈ పండుగ చెడుపై మంచి సాధించిన విజయంగా జరుపుకుంటారు. దుర్గామాత మహిషాసురుణ్ణి వధించిన సందర్భంతో పాటు, శ్రీరాముడు రావణుడిని జయించిన సందర్భంగా ఈ పండుగను నిర్వహిస్తారు. విజేతలకు, పరాధితుల కోణంలో జరిగే ఈ వైవిధ్యమైన పండగలను తార్కికంగా ఆలోచించాల్సిన అవసరం ఉంది. సాంప్రదాయ హిందూ పురాణాలలో, మహిషాసురుడు, రావణాసురుడు ఇద్దరిని అసురులుగా లేదా విరోధులుగా చిత్రీకరిస్తారు.

కానీ సమకాలీన బహుజన చరిత్ర మరియు ద్రవిడ ఉద్యమాలు వీరిని బహుజనుల రాజులుగా లేదా స్థానిక పాలకులుగా, ఆత్మగౌరవ ప్రతీకలుగా చూస్తారు. ఈ దేశ మూలవాసులుగా చెప్పబడుతున్న దళిత, ఆదివాసి, వెనుకబడిన వర్గాలను పాలించిన గొప్ప రాజులు. మహిషాసురుడు ఆదివాసీగా చెప్పబడుతున్న స్థానిక పాలకుడు. ఆర్యుల అధర్మ దండయాత్రలో ఓడిన రాజు. ఇప్పటికీ జార?ండ్‌లోని కొన్ని అసుర్ తెగలు మహిషాసురుడిని తమ పూర్వీకుడిగా, గొప్ప రాజుగా భావించి నవరాత్రి సమయంలో దుఃఖం పాటిస్తారు. కానీ దేశమంతా విజయోత్సవ పండగ జరుపుకుంటారు. రావణాసురుడు కూడా ద్రవిడ సంస్కృతికి చెందిన గొప్ప పండితుడు, శివ భక్తుడు మరియు శక్తివంతుడైన గొప్ప రాజు. సీతా అపహరణ, రామునితో యుద్ధం వంటి కారణాలతో అతనిని అసురుడిగా చిత్రీకరించారు. చరిత్రను విజేతలు రాసినందున మహిషాసురుడు, రావణాసురుడిని రాక్షసుడిగా చిత్రీకరించారు. ఇప్పుడు వీరత్వానికి, పౌరాషనీకి ప్రతీకగా నిలిచే ఈ దేవుళ్ళ అపజయంపై సబ్బండ వర్గాలు పండగలు జరుపుకుంటున్నారు. చరిత్రకారులు సైతం ఈ విషయాన్ని ధ్రువీకరించారు. నేడు మన తాతల ఓటమిని పండగ జరుపుకుంటున్నాం.

**అశోక విజయదశమి ఓ వీరుడి పరివర్తన**

చరిత్రలో మౌర్య చక్రవర్తి అశోకుడు కళింగ యుద్ధం తర్వాత పశ్చాత్తాపాన్ని అనుభవించాడు. యుద్ధంలో జరిగిన హింస, మరణాలతో పరివర్తన చెంది బౌద్ధ ధర్మాన్ని స్వీకరించాడు. ఈ సంధర్భంగా బౌద్ధ చరిత్రలో 'అశోక విజయ దశమి' పేరుతో ఈ ప్రత్యేక దినాన్ని గుర్తించారు. ఈ రోజున అశోకుడు బౌద్ధం తీసుకుని దేశవ్యాప్తంగా శాంతి, మానవీయత, కరుణను ప్రతిధ్వనించే పాలనకు శ్రీకారం చుట్టాడు. 1956 అక్టోబర్ 14న డా. బి. ఆర్. అంబేద్కర్ తన అనుచరులతో కలసి బౌద్ధదీక్ష తీసుకుంటూ 'అశోక విజయదశమి'ను పెద్దఎత్తున నిర్వహించాడు. నేటి వెనకబడిన వర్గాలకు ప్రాతినిధ్యం వహించిన రాజుల ఓటమిని విజయంగా జరిపే ఈ మనువాద హిందుత్వం వీడి బౌద్ధాన్ని స్వీకరించాడు. ఈ యేడు జరుపుకొనే విజయదశమి సందర్భంగా వాస్తవ చరిత్రను అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉంది. భారతదేశంలోని మెజార్టీ పండగలు అట్టడుగు అణగారిన వర్గాల రాజుల అపజయాన్ని విజయంగా జరుపుకొంటున్నారు. ఆ రాజులను దుష్ట శక్తులుగా చూపిస్తూ సాంస్కృతిక వేడుకలు జరుపుకునే దుస్సంస్కృతినీ ప్రోత్సహిస్తున్నారు. దీంతో బహుజన వర్గాలలో ఇప్పటికీ విప్లవ చైతన్యం రాలేకపోతోంది. దీనికి ప్రధాన కారణం సాంస్కృతిక గందరగోళం అని చెప్పక తప్పదు. ఇది ఒక ప్రణాళిక ప్రకారం జరిగిన కుట్ర. ఒక జాతిని అంతం చేయాలంటే తన చారిత్రక వారసత్వాన్ని అంతం చేస్తే సరిపోతుంది. భారత దేశంలో ఇదే జరిగింది.

**సాంస్కృతిక చైతన్యంతో రాజ్యాధికారం.**

భారతదేశ చరిత్ర అంతా గెలిచిన వారిదే. పూలే, అంబేద్కర్ సామాజిక, సాంస్కృతిక, రాజకీయ పోరాటంతో వాస్తవ చరిత్ర బయటకు వచ్చింది. ఇప్పుడు ఓడిపోయిన వారు కూడా చరిత్ర రాసుకుంటున్నారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ భారతదేశ చరిత్ర అంతా బౌద్ధానికి మనువాదానికి మధ్య జరిగిన సంఘర్షణ అని అంటారు. హిందూమతంలో ఉన్న మంచి విషయాలన్నీ మన జంబుద్వీప బౌద్ధ మతానియే అని కూడా అన్నాడు. ఒకప్పుడు భారతదేశాన్నీ జంబుద్వీపం అనేవారు. దీన్ని జాంబవంతుడు స్వేచ్ఛ, సమానత్వం, సోదరభావం వంటి గొప్ప ఘన విలువలతో పాలిచాడు. భారతీయ వాస్తవ చరిత్రను తెలుసుకోవాలంటే జంబుద్వీప జాంబవంతుని చరిత్రను తెలుసుకోవాలి. ఈ క్రమంలో ఇటీవల తెలంగాణ రాష్ట్రంలోని అట్టడుగు, అణగారిన వర్గాల సాంస్కృతిక రాజకీయ చైతన్యం కొరకై జంబుద్వీప జన జాగృతి ఏర్పడింది. ఇదీ తమ సాంస్కృతిక చైతన్యాన్ని ప్రచారం చేస్తూ రాజ్యాధికార విప్లవానికి పునాది వేస్తుంది. ఈ క్రమంలో సబ్బండ వర్గాలు ఇందులో భాగమై స్వధర్మాన్ని తెలుసుకొవాలి. అప్పుడే విముక్తి సాధ్యమవుతుంది.

**మతం పేరుతో అగ్రకుల రాజకీయాలు**

నేడు మతాన్ని ప్రజాస్వామీకరించి అగ్రకులాలు పాలిస్తున్నాయి. బీసీ ఎస్సీ ఎస్టీ సమాజం సాంస్కృతిక వేడుకల్లో భాగమై సాంస్కృతికరణ చెందినప్పటికీ...సామాజిక వివక్షత వీరి వెన్నంటే కొనసాగుతున్నది. ఇప్పటికీ అక్కడక్కడ దళిత, గిరిజన, వెనుకబడిన వర్గాలను గుడిలోకి రానివ్వడం లేదు. మరోవైపు అగ్రకుల సమాజం సాంస్కృతిక భావోద్వేగాలతో అట్టడుగు కులాలను ఓటు బ్యాంకుగా మార్చుకుంటున్నాయి. కానీ రాజకీయ భాగస్వామ్యం మాత్రం కల్పించడం లేదు. ప్రభుత్వాలు బీసీ,ఎస్సీ,ఎస్టీ సమాజాన్ని నిరంతరం వివిధ ధార్మిక కార్యక్రమాలతో కట్టిపడేస్తున్నారు. వారి బలహీనమైన మనస్తత్వమే దీనికి కారణం. దీంతో రాజకీయాలను శాసించలేకపోతున్నారు. ఇప్పుడు ఓడిన సబ్బండ కులాలు గెలవాలంటే తన చారిత్రక సాంస్కృతిక వారసత్వ జ్ఞానంతో బరి గీసి అలసిపోని యుద్ధం చేయాలి. ఒకప్పుడు ఈ దేశంలో దళితుల, గిరిజన ఇళ్లలో పెళ్లి చేయడానికి పూజారులు వచ్చేవారు కాదు. ఇటీవల తమ సాంస్కృతిక ఆధిపత్య విస్తరణలో భాగంగా కిందివర్గాలలో జరిగే క్రతుల నిర్వహణకు వస్తున్నారు. మరోవైపు అనేక తెగలు, కులాల సాధికారత పేరుతో వారి సాంస్కృతిక మూలాల్లోకి అగ్రకుల పాలకులు ప్రవేశిస్తూ తమ సంస్కృతిని దెబ్బతీస్తున్నారు. తమకు సంబంధం లేని ధర్మాన్ని చొప్పిస్తున్నారు. దీంతో దేశ మూలవాసులైన బీసీ, ఎస్సీ, ఎస్టీ సమాజం తమ స్వధర్మాన్ని మర్చిపోతున్నారు. దీంతో రాజ్యాధికారానికి దూరమవుతున్నారు. కావున ఇప్పటికైనా తమ సాంస్కృతినీ పునర్జీవింపజేసుకోని స్వధర్మంతో రాజ్యాధికారం వైపు ప్రయాణించాలి.



**సంపతి రమేష్ మహారాజ్**
**సామాజిక విశ్లేషకులు,**
**7989579428**

# ఆరెస్సెస్ స్వరూప, స్వభావాలు – ఏ.జీ నురానీ దృక్కోణం

మహాత్మా గాంధీ హత్య 1948 జనవరి 30న జరిగింది. హంతకుడు నాథూరాం గోడ్సే. అతను హిందూ మహాసభ సభ్యుడు. కానీ ఆర్ఎస్ఎస్‌తో కూడా సంబంధం కలిగి ఉండేది. ఆర్ఎస్ఎస్ అంటే రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్. ఇది 1925లో స్థాపించబడింది. కేశవ్ బలిరామ్ హెడ్గేవార్ స్థాపకుడు. ఇది హిందూ జాతీయవాద సంస్థ. హిందుత్వ భావజాలం దాని పునాది. వినాయక్ దామోదర్ సావర్కర్ హిందుత్వ రచనలు అతనిపై ప్రభావం చూపాయి. ఆర్ఎస్ఎస్ స్వయంసేవకులకు శిక్షణ ఇస్తుంది. ఇది శాఖల ద్వారా పని చేస్తుంది. ప్రతి రోజు వ్యాయామాలు, డిసిప్లిన్ నేర్పుతుంది. ఇది హిందూ ఐక్యత కోసం పని చేస్తుంది. కానీ దీని ఐడియాలజీ మొదటి నుంచీ వివాదాస్పదం. ఏ.జీ. నూరానీ ఆరెస్సెస్ పై చాలా విస్తృతంగా రాశారు. అతను ఒక రాజకీయ విశ్లేషకుడు. రచయిత. "ది ఆర్ఎస్ఎస్: ఎ మెనాస్ టు ఇండియా" అనే పుస్తకం రాశారు. ఇందులో ఆర్ఎస్ఎస్ పుట్టుక, దాని లక్ష్యాలు,ఆదర్శాలు, సిద్ధాంతాలు, వ్యవస్థీకరణ, దాని నిజ స్వరూప స్వభావాలు అన్నీ ఆ పుస్తకంలో వివరించారు. గాంధీజీ హత్యలో దాని పాత్రను కూడా చర్చించారు. బ్రిటానికా ఎన్సైక్లోపీడియా ఆర్ఎస్ఎస్ చరిత్రను వివరిస్తుంది. ఈ వ్యాసం పై ఆధారాలపై ఆధారపడి ఉంటుంది.

ఆర్ఎస్ఎస్ చరిత్ర మొదలైంది 1925 సెప్టెంబర్ 27న. దసరా రోజు. హెడ్గేవార్ మద్రాస్ కాంగ్రెస్‌లో సభ్యుడిగా ఉన్నాడు. కానీ ఖిలాఫత్ ఉద్యమంపై అసంతృప్తి చెందాడు. కాంగ్రెస్ ముస్లింలకు మద్దతు ఇవ్వటం అతనికి నచ్చలేదు. అందుకే ఆర్ఎస్ఎస్ ను స్థాపించాడు. ఇది సాంస్కృతిక సంస్థగా ప్రారంభమైంది. రాజకీయంతో సంబంధం లేదని చెప్పుకుంది. అది హిందూ ఐక్యత కోసం పనిచేస్తుంది. 1940లో హెడ్గేవార్ మరణించారు. మాధవ్ సదాశివ్ గోల్వాల్కర్ సంఘ్‌చాలక్ అయ్యారు. అతను సంస్థను విస్తరించారు. భగవ ధ్వజం దీని చిహ్నం. హనుమాన్‌ను ఆరాధిస్తుంది. ఇది పారామిలిటరీ శిక్షణ ఇస్తుంది. యువతలో ధైర్యం, శక్తిని పెంచుతుంది. బ్రిటానికా ప్రకారం ఇది హిందూ రాష్ట్రం కోసం పని చేస్తుంది. హిందుత్వం ప్రకారం భారతీయులంతా హిందూవులు. సాంస్కృతిక బంధాలు ముఖ్యం. కానీ ఇది మైనారిటీలను దూరం పెడుతుంది.

గాంధీ హత్యలో ఆర్ఎస్ఎస్ పాత్ర వివాదాస్పదం. 1948 జనవరి 30న గోడ్సే గాంధీని కాల్చి చంపాడు. అతను అంతకు మునుపు ఆర్ఎస్ఎస్ సభ్యుడు. తర్వాత హిందూ మహాసభలో చేరాడు. కానీ ఆర్ఎస్ఎస్ ప్రభావం అతనిపై ఉంది. హత్య తర్వాత ఆర్ఎస్ఎస్‌పై బ్యాన్ విధించారు. ఫిబ్రవరి 1948లో ఇది అక్రమ సంస్థ అని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. కమ్యూనలిజాన్ని ప్రోత్సహిస్తుందని అనుమానించారు. బ్రిటానికా ప్రకారం ఆర్ఎస్ఎస్ లీడర్‌షిప్‌కు దానిలో పాత్ర లేదని తేలింది. 1949లో ఆరెస్సెస్ పై బ్యాన్ ఎత్తేశారు. కానీ ఏ.జీ. నూరానీ వేరే చెప్పారు. "ది ఆర్ఎస్ఎస్: ఎ మెనాస్ టు ఇండియా"లో ఈ విషయాలను చర్చించారు. గోడ్సే ఆర్ఎస్ఎస్ నుండి విడిచి లేదని రుజువు చేశారు. చారిత్రక ఆధారాలు ఉన్నాయి. ఆర్ఎస్ఎస్ గాంధీజీ పై వ్యతిరేకతను చూపించింది. గాంధీజీ ముస్లింలకు మద్దతు ఇచ్చాడని విమర్శించింది. గోల్వాల్కర్ గాంధీని విమర్శించాడు. ఆర్ఎస్ఎస్ సభ్యులు గాంధీని దేశ ద్రోహి అని



చెప్పారు. నూరానీ ప్రకారం ఇది హత్యకు మార్గదర్శకం అయింది. ఆర్ఎస్ఎస్ హిందూ ప్రాధాన్యతను నమ్ముతుంది. గాంధీ అహింసా మార్గం దానికి వ్యతిరేకం. ఫ్రంట్‌లైన్ ఆర్టికల్‌లో నూరానీ ఇది చెప్పారు. ఆర్ఎస్ఎస్ గోడ్సేను ఖండించలేదు. బదులుగా మాట్లాడటం మానేశారు. ఇది దాని బాధ్యతను చూపిస్తుంది. విశ్లేషణాత్మకంగా చూస్తే ఆర్ఎస్ఎస్ గాంధీని హిందుత్వకు అడ్డుకట్టగా చూసింది. హత్య దాని ఐడియాలజీకి సహాయపడింది. కానీ బ్యాన్ తర్వాత దానిని మార్చుకున్నట్టు చెప్పుకుంది. రాజ్యాంగానికి విధేయులమని చెప్పింది.

ఆర్ఎస్ఎస్ నిజ స్వరూపం ఫాసిస్ట్ లా ఉంటుంది. నూరానీ "ది ఆర్ఎస్ఎస్: ఎ మెనాస్ టు ఇండియా"లో ఇలా రాశారు. ఆర్ఎస్ఎస్ హిందూ ప్రాముఖ్యతను నమ్ముతుంది. ఇది హిందూ రాష్ట్రం కోసం పని చేస్తుంది. మైనారిటీలను రెండో తరగతి చేస్తుంది. బ్రిటానికా ప్రకారం హిందుత్వం జాతి, సంస్కృతి ఆధారంగా హిందూవులను నిర్వచిస్తుంది. ఇది సావర్కర్ రచనల నుండి వచ్చింది. "హిందుత్వ: హూ ఇజ్ ఎ హిందూ?" అనే పుస్తకం. ఆర్ఎస్ఎస్ కు డెమాక్రసీతో సంబంధం అసాధారణం. ఇది సాంస్కృతిక సంస్థ అని చెప్పుకుంటుంది. కానీ రాజకీయంగా ప్రభావాన్ని చూపుతుంది. భారతీయ జనతా పార్టీ (బీజేపీ) దాని రాజకీయ శాఖ. 1951లో భారతీయ జన సంఘ్‌గా మొదలైంది. 1980లో బీజేపీ అయింది. నరేంద్ర మోదీ, అటల్ బిహారీ వాజ్‌పేయి ఆర్ఎస్ఎస్ ప్రచారకులు. సంఘ్ పరివార్ దాని భాగాలు. విశ్వ హిందూ పరిషత్, అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ వంటివి. నూరానీ ప్రకారం ఆర్ఎస్ఎస్ ఫాసిస్ట్ ఐడియాలజీని అనుసరిస్తుంది. ముస్సోలినీ, హిట్లర్ ప్రభావం దానిపై ఉంది. గోల్వాల్కర్ "ఉయి ఆర్ అవర్ నేషన్‌హుడ్ డిఫైన్డ్"లో ఇది చెప్పాడు. హిందూవులు మాత్రమే భారతదేశానికి చెందిన వారు. ముస్లింలు, క్రిస్టియన్లు రెండో తరగతి పౌరులు. ఇది భారత రాజ్యాంగానికి వ్యతిరేకం. రాజ్యాంగం సెక్యులర్. సమానత్వం చెబుతుంది. కానీ ఆర్ఎస్ఎస్ హిందూ ప్యూరిటీని కోరుకుంటుంది. విమర్శనాత్మకంగా చూస్తే ఇది భారత ఐక్యతకు ముప్పు. 1992 బాబ్రీ మసీదు కూల్చివేతలో దాని పాత్ర స్పష్టం. 1975 ఎమర్జెన్సీలో బ్యాన్. 1948 బ్యాన్ తర్వాత కూడా. ప్రతి సారి బ్యాన్ ఎత్తేశారు. కానీ వారిలో మార్పు రాలేదు. నూరానీ "ది ఆర్ఎస్ఎస్ అండ్ ది బీజేపీ"లో ఇది చర్చించారు. బీజేపీ అధికారంలోకి వచ్చింది. 2014 ఎన్నికల్లో మోదీ ప్రధాని అయ్యారు. ఆర్ఎస్ఎస్ ప్రభావం పెరిగింది. రామ్ జన్మభూమి ఉద్యమం దాని సహాయంతో. 2024లో రామ మందిర నిర్మాణం. ఇది హిందుత్వ ఎజెండాను ముందుకు తీసుకెళ్లింది.

విశ్లేషణాత్మకంగా చూస్తే ఆర్ఎస్ఎస్ మార్పును గురించి చెప్పుకుంది. 1949లో రాజ్యాంగానికి వఫాదారి అని చెప్పింది. జాతీయ జెండాను గౌరవిస్తామని. కానీ నూరానీ ప్రకారం ఇది మాయ. గోల్వాల్కర్ మరణం తర్వాత డి.ఆర్. దేవరస్ 1973లో లీడర్ అయ్యాడు. అతను సామాజిక సేవలు పెంచాడు. కానీ హిందుత్వ మారలేదు. మోహన్ భగవత్ 2009 నుండి సంఘ్‌చాలక్. శాఖలు 80,000కి పెరిగాయి. 2025 అక్టోబర్ 2న శతోత్సవం. బ్రిటానికా ప్రకారం ఇది హిందూ యువతను శక్తివంతం చేస్తుంది. కానీ కమ్యూనల్ టెన్షన్లకు కారణమవుతుంది. నూరానీ "ది వైర్" ఆర్టికల్‌లో రాశారు. ఆర్ఎస్ఎస్ గాంధీజీని దేశ ద్రోహిగా చూసింది. అతను హిందుత్వకు అడ్డుగా భావించింది. గాంధీజీ అహింసా, సామరస్యం బోధించాడు. ఆర్ఎస్ఎస్ హింసాత్మక శిక్షణ ఇస్తుంది. ఇది పరస్పరం విరుద్ధం. విమర్శనాత్మకంగా చెప్పాలంటే ఆర్ఎస్ఎస్ భారత ప్రజాస్వామ్యానికి ముప్పు. ఇది "ఎన్డ్ జస్టిఫైస్ ది మీన్స్" అని నమ్ముతుంది. బాబ్రీ కూల్చివేత ఉదాహరణ. గాంధీ హత్యలో దాని మౌనం మరో ఉదాహరణ. నూరానీ ప్రకారం ఆర్ఎస్ఎస్ యువతను మత ఆకర్షణతో మోసం చేస్తుంది. వారు రాజ్యాంగాన్ని తెలుసుకోరు. ఇది ఫాసిస్ట్ వ్యూహం. హిట్లర్ యూత్ మూవ్‌మెంట్ లాంటిది. భారత్ సెక్యులర్ దేశం. కానీ ఆర్ఎస్ఎస్ హిందూ రాష్ట్రం కోరుకుంటుంది. ఇది రాజ్యాంగాన్ని మార్చాలని చూస్తుంది. 2019లో ఆర్టికల్ 370 రద్దు దాని ప్రభావం. మైనారిటీలు భయపడుతున్నారు.

ఆర్ఎస్ఎస్ ప్రస్తుత ప్రభావం పెద్దది. బీజేపీ అధికారంలో ఉంది. మోదీ ఆర్ఎస్ఎస్ నుండి. ఇది ఇండియన్ పాలిటిక్స్‌ను మార్చింది. కానీ నూరానీ విమర్శ. ఇది డెమాక్రసీకి మెనాస్. హేట్ స్పీచ్ పెరుగుతుంది. కమ్యూనల్ రయట్స్ జరుగుతున్నాయి. గాంధీ హత్య 75 ఏళ్లకు గాంధీ హెరిటేజ్‌ను ఆర్ఎస్ఎస్ క్లెయిం చేస్తుంది. కానీ నూరానీ ప్రకారం ఇది మాయ. ఆర్ఎస్ఎస్ గాంధీని ద్వేషించింది. ఇప్పుడు ఉపయోగిస్తుంది. ఇది రాజకీయ వ్యూహం. విశ్లేషణలో ఆర్ఎస్ఎస్ మారలేదు. బ్యాన్‌లు తర్వాత మాట మార్చుకుంది. కానీ ఐడియాలజీ అదే. బ్రిటానికా ప్రకారం 2025లో శతోత్సవం. ఇది మరింత బలపడుతుంది. భారత్‌కు ముప్పు.

ఆర్ఎస్ఎస్ గాంధీ హత్యలో పరోక్ష పాత్ర పోషించింది. దాని వ్యతిరేకత హత్యకు కారణం. నిజ స్వరూపం ఫాసిస్ట్. హిందుత్వం దాని ఆధారం. నూరానీ రచనలు ఇది రుజువు చేస్తాయి. బ్రిటానికా చరిత్రను చెబుతుంది. భారత్ సెక్యులర్‌ను కాపాడాలి. ఆర్ఎస్ఎస్ ప్రభావాన్ని పరిగణించాలి. గాంధీ మార్గం అనుసరించాలి. అహింస, సామరస్యం మాత్రమే మార్గం. ఆర్ఎస్ఎస్ మెనాస్‌ను గుర్తించాలి. భవిష్యత్ జాగ్రత్తలు తీసుకోవాలి.



**డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్**
**9849328496**

## గబ్బిలం జన్మ ధన్యం!

లోకులు కాకులైతే గబ్బిలం
కవన రెక్కలు అద్దుకొని
కావ్యగంగలో మునిగి
నవయుగ కవి చక్రవర్తిగా తేలి
నిటాలాక్షుడి భస్మ సింహాసనంపై
వాలి
కావుకావన్న నోళ్లతో
అవుననిపించుకొంది
కవికోకిలై గండపెండేరం తొడిగించుకొంది
ఓ పక్క కులసర్పం బుసలు కొడుతున్నా
అక్షరపత్రాల తరువే ఆదరువుగా వేళ్ళాడుతూ
ప్రజల నాల్కలపై సుకవిలా
గూడు కట్టుకొని జీవించింది
గబ్బిలం కోకిలవటం
స్వీయ మతానికి సమ్మతంకాక
తలదాచుకొన్న నీడే క్రీనీడై
విరిగి పడేసరికి విరక్తితో
నాస్తిక నైర్మల్యతే నిఖ?మైన దైవమనుకొంది
ఐనా వేటగాళ్ళ బాణాలు తప్పలేదు
వడగాల్పుల్లో మసి చేయాలనుకొన్నా
చల్లని వెన్నెలాక్షరాలు కురిపిస్తూ
అంటరానితనం అంచులు చీల్చుకొని
నవకవితా తేజస్సుతో
విశ్వనింగికి ఎగిరిపోయింది..!


**భీమవరపు పురుషోత్తమ్**
**రాజమండ్రి**
**9949800253**

# విస్తరిస్తున్న నగరానికి – ఫ్యూచర్ సిటీ నిర్మాణం

సెప్టెంబర్ 28, 2025న తెలంగాణ ప్రభుత్వం "ఫ్యూచర్ సిటీ"కి సంబంధించిన మొదటి పనులకు శంకుస్థాపన చేసిందిమీర్‌ఖాన్‌పేట్ (కందుకూరు మండలం, రంగారెడ్డి)లో (ఎఫ్ సి డి ఎ) కార్యాలయ భవనం, అలాగే ఓ ఆర్ ఆర్ లోని టాటా ఇంటర్‌చేంజ్ (రవిర్యాల్) నుంచి ప్రతిపాదిత ఆర్ ఆర్ ఆర్ (అమంగల్) వరకు 41 కిమీ గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రోడ్%–%1కు పునాది వేసారు. రోడ్ ప్రాజెక్ట్ సుమారు రూపాయలు 4,600 కోట్లు, ఎఫ్ సి డి ఎ కార్యాలయం రూపాయలు 19 కోట్లు అంచనా. రోడ్డు పనుల వ్యవధి –30 నెలలు గా లక్ష్యంగా ఉంది. ఫ్యూచర్ సిటీ అంటే ఏమిటి: ఇది హైదరాబాద్ నగరానికి దక్షిణ%–%తూర్పు వైపున, శ్రీశైలం%–%నాగార్జునసాగర్ హైవేల మధ్య విస్తరించే "గ్రీన్‌ఫీల్డ్ నెట్–జీరో స్మార్ట్ సిటీ"గా ప్రణాళిక. కోర్ ప్రాజెక్ట్ విస్తీర్ణం సుమారు 30,000 ఎకరాలు (సుమారు 121 చ.కిమీ)గా వివరించబడింది. కొన్ని మీడియా నివేదికలు దీన్ని పెద్ద ప్లానింగ్ రీజియన్ (756 చ.కిమీ)తో కలిపి సూచిస్తున్నాయిఅంటే కోర్ సిటీకన్నా విస్తృత ప్రభావ మండలి అనే అర్థం. సస్టైనబుల్ అర్బన్ డిజైన్, డిజిటల్ , డీప్–టెక్ ఇండస్ట్రీలు, సంస్థలు, నివాస%–%వాణిజ్య మిశ్రమ అభివృద్ధి, పచ్చ మౌలిక సదుపాయాలు. నెట్–జీరో ,సస్టైనబిలిటీ: భూగర్భ విద్యుత్ లైన్లు, కాలుష్య నియంత్రణ, నదీ%–%వాటర్ రీజువినేషన్ మోడళ్లుబీ రాష్ట్రం "నెట్–జీరో సిటీ" దిశగా యాక్షన్ ప్లాన్ ప్రకటించింది. మొబిలిటీ , కనెక్టివిటీ: ఓ ఆర్ ఆర్ ? ఆర్ ఆర్ ఆర్ ను కలిపే కొత్త రేడియల్ రోడ్లుబీ భవిష్యత్‌లో మెట్రో/రైలు పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్‌కు మార్గం. విద్య నైపుణ్యం,స్కిల్ యూనివర్సిటీ,ఇన్నోవేషన్,డిజిటల్ టెక్నాలజీ సెంటర్లు. ప్రముఖ కార్పొరేట్ల ఆకర్షణ 10 ఏళ్లలో ఫార్చ్యూన్ 500 కంపెనీలు వస్తాయనే దృష్టి. ఎక్స్‌పీరియన్స్ సెంటర్ , ఆధునిక ప్లానింగ్, ఎఫ్ సి డి ఎ ఆఫీసులోనే ఫ్యూచర్ అర్బన్ డిజైన్ మోడళ్ల ప్రదర్శన. లాభం ఎవరికి!విద్యార్థులు/యువతకు: స్కిల్ యూనివర్సిటీ, ఆర్ , డి హబ్బులు వల్ల అధునాతన ఉద్యోగాలు, ఇంటర్న్‌షిప్



అవకాశాలు. స్టార్టప్‌లు , పరిశ్రమలకు: డిజిటల్, ఏ వన్, మెడ్‌టెక్, ఫార్మా వంటి రంగాలకు ప్రపంచ స్థాయి ఇండస్ట్రియల్%–%ఇన్నోవేషన్ ఎకోసిస్టం. రాష్ట్ర నాయకత్వం దీన్ని న్యూయార్క్/టోక్యోకు సరితూగే హబ్‌గా తీర్చిదిద్దుదామని చెబుతోంది. నగర నివాసితులకు ట్రాఫిక్ డీకాంజెషన్ (ఓ ఆర్ ఆర్ ?ఆర్ ఆర్ ఆర్ కనెక్టివిటీ), పర్యావరణానుకూల పరిసరాలు, పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ పెరుగుదల. హైదరాబాద్ మేట్రో ప్రాంతానికి: కోర్ నగరంలో కాలుష్యం తగ్గింపు, పరిశ్రమలను అర్బన్ కోర్ నుండి పెరిఫెరీకి ప్లాన్ చేయడం ద్వారా నగర జీవన నాణ్యత మెరుగుదల. పరిసర గ్రామాలు , రియల్ ఎస్టేట్ ఎకానమీకి, కొత్త రోడ్లు మౌలిక సదుపాయాలు వల్ల కనెక్టివిటీ, సేవల విస్తరణ. నివేశ సలహా కాదుబీ మౌలిక వసతులు సాధారణంగా ప్రాంతీయ ఆర్థిక కార్యకలాపాలు పెంచుతాయని మీడియా విశ్లేషణలు సూచిస్తాయి. సికింద్రాబాద్‌ను బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ 1806 లో నిర్మించింది.1798లో నైజాం చందూలాలుతో బ్రిటిష్ సైనిక ఒప్పందం కుదుర్చుకున్నారు. దీని ప్రకారం నైజాం భూభాగంలో బ్రిటిష్ సైన్యానికి శాశ్వత స్థావరం ఏర్పాటుచేయడానికి అనుమతి ఇచ్చారు. ఈ స్థావరం కోసం మూసీ నది ఉత్తర భాగంలో (ప్రస్తుత సికింద్రాబాద్) భూమి ఇచ్చారు. సికింద్రాబాద్ పేరు నైజాం సికిందర్ జా 1803%–%1829) గౌరవార్థం పెట్టారు.మొదట సైనిక కెంటోన్మెంట్‌గా నిర్మించబడిన ఈ ప్రాంతం తరువాత పెద్ద నగరంగా అభివృద్ధి చెందింది.అందువల్ల సికింద్రాబాద్‌ను బ్రిటిష్‌లు నైజాం సికందర్ జాహ్ పాలనలో సైనిక కెంటోన్మెంట్‌గా నిర్మించారు.ఏది ఏమైనా నిజాం నిర్మించిన హైదరాబాద్ నగరానికి, కుతుబ్షాయులు నిర్మించిన సికింద్రాబాద్ నగరానికి దక్షిణాన ఫ్యూచర్ సిటీ నిర్మాణం తెలంగాణకు తలమానికంగా ఉండాలి. భవిష్యత్తు అవసరాలను తీర్చే విధంగా నగర నిర్మాణం ఉంటే బాగుంటుందని ప్రజలు భావిస్తున్నారు.



**డాక్టర్. రక్కిరెడ్డి ఆదిరెడ్డి**
**కాకతీయ విశ్వవిద్యాలయం**

## రొమ్ములతోపాటు..


చిగురుమొగ్గై మొగ్గపువ్వై పరిమళపాటై
తేమఉట్టై ఉటబావై పొలాలబాటై
మిణుగురుతారై తారమెరుపులతోటై
పల్లవించడం పరుగుతీయడం
ఫలితమివ్వడం ప్రకృతినైజం
బుడిబుడినడకల దీపంలో
వడివడివరదల రూపంకై
నవమాసాలు మోసి జన్మనిచ్చిన తల్లిలో
తన్మయం
రొమ్ములతో పాటు నెత్తినకొమ్ములు మొలిస్తేనే
విస్మయం

**కోటం చంద్రశేఖర్ 9492043348**

# వారిని చూసి స్నేహమే సలాం చేసింది!

పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఏర్పాటు సమయంలో ఎప్పుడు.. ఎప్పుడని కండ్లల్లో వొత్తులేసుకొని సూడాల్సిన స్థితి వొచ్చింది. యెందుకంటే గతంలో కరోనా సమయంలో ముందొకసారి, ఆ తర్వాతొకసారి, మళ్లీ రెండు సమయాల్లో మా ఆత్మీయ కలయిక వాయిదా పడింది. దీంతో ఈసారి కూడా కలుస్తామా! లేదా? అనే అనుమానాల మధ్య ప్రయాణం ముందుకు సాగింది. పాలకుర్తి, బమ్మెర, లక్ష్మీనారాయణ పురం గ్రామాల మిత్రుల చొరవ, పట్టుదల సంకల్పంతో కృషి ఫలించింది.

పదిహేను రోజుల వ్యవధిలోనే కార్యక్రమ ఏర్పాట్లతో ఊహించని రీతిలో కనుల విందుగా ప్రారంభమైంది. సెప్టెంబర్ 28న పాలకుర్తిలోని భాషరత్ గార్డెన్లో 1999 – 2000 పూర్వ విద్యార్థులు కలుసుకున్నారు. 25 ఏండ్ల తర్వాత ఆత్మీయుల కలయిక అంబరాన్ని అంటింది. ఆనాటి విద్యార్థుల మనసులు నిండుతనంతో పులకించినట్లు పరవశించిపోయాయి. ఒక్కొక్కరి కండ్లల్లో వారి ముఖాల్లో కనిపించిన ఆ చిత్రాల దరువు, ఆనందపు ఛాయలు మాటల్లో చెప్పలేం కదా! ఆపాత మధురాన్ని వర్ణించడం సాధ్యం కావడం లేదు. తొలుత రాజీవ్ చౌరస్తా నుంచి ఉపాధ్యాయ బృందాన్ని భాషరత్ గార్డెన్ వరకు పూల జల్లులతో తీసుకొచ్చి ప్రత్యేకతను చాటారు. కొద్ది మంది మిత్రులు వివిధ కారణాలతో రాలేకపోయినా వారిని మరచిపోలేదు. తమ తమ జ్ఞాపకాల దొంతరల్లో నెమరేసుకున్నారు.




సభ ప్రారంభంలో ఒక్కో గురువును 10 మంది విద్యార్థులు వేదికపైకి తోలుకువచ్చి స్వాగతించారు. జ్యోతి ప్రజ్వలన అనంతరం విద్యాబోధన చేసి భౌతికంగా దూరమైన పలువురు ఉపాధ్యాయులకు నిండు మనసుతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా మరణించిన తోటి విద్యార్థులను తలుచుకొని తల్లడిల్లారు. తమకు విద్యాబుద్ధులు సెప్పిన ఉపాధ్యాయులను వారి సేవలను, కొన్ని ఘటనలను యాజ్జేసుకున్నారు. వారిని పూల బొకేలతో శాలువాలతో సన్మానించి గౌరవించుకున్నారు. స్టేజి మీద కొందరు సహచరులు మాట్లాడినప్పటికీ సారాంశం అంతా ఆనాటి స్మృతులను నెమరువేసుకోవడంతోనే సాగింది. సమయం లేక మాట్లాడక పోయినప్పటికీ, ప్రసంగించిన మిత్రుల మాటల్లో వారి తీపి గుర్తులు ప్రతిధ్వనించాయి. ఆనాటి ఉపాధ్యాయుల బోధనను, విలువలను గుర్తు చేసుకొని ఉల్లాసాన్ని, ఆనందాన్ని పొందారు.

ఆనాడు ఈ విద్యార్థుల జీవితాలకు దిశ దశా మార్గ నిర్దేశనం చేసిన ఉపాధ్యాయులు సైతం తమ అనుభవాలను చెబుతూ.. పూర్వ విద్యార్థులకు ఉత్తేజాన్ని కలిగించారు. విలువైన సూచనలను అందించారు. అందరూ ప్రయోజకులు కావడం, వివిధ స్థాయిలలో స్థిర పడటాన్ని అభినందించారు. విద్యా, వైద్యం, సంఘటిత, అసంఘటిత, వ్యవసాయ అనుబంధ రంగాల్లో నిష్ణాతులుగా ఎదిగిన ఆనాటి పూర్వ విద్యార్థులు ఒకచోట సమూహంగా కనిపించారు. స్నేహానికి సరైన నిర్వచనాన్ని అందించిన తీరు అబ్బురపరుస్తుంది. వీరి అపూర్వమైన కలయిక చరిత్రలో తప్పక నిలిచిపోతుంది అనటంలో సందేహం లేదు. అక్కడి సన్నివేశాలు, ఆనందాలతో వేసిన స్టెప్పులు మైమరిపించాయి. అందరిలో ఐక్యత మరోసారి ప్రస్ఫుటమైంది. జిలుకర తిరుమల్, వినయ్ ల పాటలు జీరబోయిన గొంతుతో వినాల్సి వొచ్చింది.


ఒకేచోట అందరూ కూర్చొని వనభోజనాలకెళ్లినట్లుగా సహపంక్తి భోజనాలు చేశారు. వంద మందికి పైగా తరలొచ్చిన స్నేహితులు తమ ఆత్మీయత అనురాగాలను పంచుకున్నారు. మహిళా మిత్రులు ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. మొత్తం ఈ సమ్మేళనానికి మహిళలు నిండుతనాన్ని తీసుకువచ్చారు. సుదూర ప్రాంతాల్లో స్థిరపడిన మిత్రులు తరలి రావడం స్నేహితుల పట్ల వారికి ఉన్న గౌరవానికి, ఆప్యాయతకు సూచిక. మనసులో మలినం లేని స్వచ్ఛత కలిసిన ఆనాటి బాల్య మిత్రులకు స్నేహమే సలాం చేసింది!



**మామిండ్ల రమేష్ రాజా**
**కవి, రచయిత**
**సెల్ : 78932 30218**

# స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి సన్నద్ధం

**సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ**



**హైదరాబాద్ (జనంసాక్షి) :** రాష్ట్రంలో తాము బలంగా ఉన్న ప్రాంతాల్లో, ప్రజా ఉద్యమాలను నిర్మించిన చోట స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి సన్నద్ధమవుతున్నామని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ చెప్పారు. బుధవారం హైదరాబాద్‌లో తనను కలిసిన విలేకర్లతో ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో సర్దుబాటు, కార్యాచరణ ఎలా ఉండాలనే దానిపై ఈనెల 4న జరగనున్న పార్టీ రాష్ట్ర కమిటీ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని వివరించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీని ఓడిరచడమే తమ రాజకీయ కర్తవ్యమని స్పష్టం చేశారు. రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు బీజేపీ అడ్డుపడిరదన్నారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధులను, యూరియాను ఇవ్వడం లేదని చెప్పారు.

**ఏజెన్సీ ప్రాంత జెడ్పీ చైర్మన్ స్థానాలు ఎస్టీలకే ఉండాలి**

స్థానికసంస్థల ఎన్నికల్లో ఐదో షెడ్యూల్ ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనేతరులకు రిజర్వేషన్ అమలు చేయొద్దంటూ నిబంధనలున్నాయని, గిరిజన జనాభా అధికంగా ఉన్న జిల్లాల్లో జిల్లా పరిషత్ చైర్మెన్ స్థానాలకు ఎస్టీ రిజర్వేషన్ ఉండేలా చూడాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన జిల్లా పరిషత్ రిజర్వేషన్‌లో గిరిజనులకు తీవ్ర అన్యాయం జరుగుతున్నదని అన్నారు. ఆదివాసీలు అధికంగా ఉన్న భద్రాద్రి కొత్తగూడెం, ఆదిలాబాద్, కొమరం భీం ఆసిఫాబాద్, మహబూబాబాద్ జెడ్పీ చైర్మెన్ స్థానాలను జనరల్ స్థానాలుగా ప్రకటించడం సరైంది కాదని చెప్పారు. ఐదో షెడ్యూల్ ప్రాంతంలో ఉన్న జెడ్పీ చైర్మెన్ స్థానాలను ఎస్టీ రిజర్వేషన్ కొనసాగించేలా ఉత్తర్వులను సవరించాలని డిమాండ్ చేశారు.


# బతుకమ్మకుంట బాధ్యత మీరే చూడాలి

**హైడ్రా కమిషనర్‌కు వీహెచ్ వినతి**

**హైదరాబాద్, అక్టోబర్ 01 (జనంసాక్షి) :** అంబర్‌పేటలోని బతుకమ్మకుంటను బాగా అభివృద్ధి చేశారు. సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. దీంతో ఈ ప్రాంత రూపురేఖలు మారిపోయాయి. బతుకమ్మ కుంట నిర్వహణ బాధ్యతను కూడా హైడ్రా తీసుకోవాలి అని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ ఎంపీ వి. హనుమంతరావు కోరారు. బుధవారం హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌ని కలిసి ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. కబ్జాల చెర నుంచి బతుకమ్మ కుంటను కాపాడడం.. చెరువుగా అభివృద్ధి చేయడం.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించడం ఇలా అన్ని కార్యక్రమాలు ఎంతో వైభవంగా జరిగాయని, ఈ విషయంలో హైడ్రా చేసిన కృషి అభినందనీయమని వీహెచ్ అన్నారు. బతుకమ్మకుంటను అభివృద్ధి చేసి వదిలేశారు అనే అపవాదు రాకుండా దీని పరిరక్షణ బాధ్యతను హైడ్రా తీసుకోవాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. లేని పక్షంలో ఇక్కడ ప్రస్తుతతం ఉన్న ఆహ్లాదకర వాతావరణం దెబ్బతింటుందని అన్నారు.

**బోటు షికారు కొనసాగించండి..**

బతుకమ్మకుంట ఇప్పుడు పర్యాటక ప్రాంతంగా మారిందని వీహెచ్ అన్నారు. ప్రారంభోత్సవం నాటి నుంచి నేటి వరకూ అక్కడ ప్రతి రోజు సాయంత్రం సందడి వాతావరణం నెలకుంటోందని.. వందలాది మంది వచ్చి బతుకమ్మ ఆడారన్నారు. వచ్చే ఏడాది మరింత వైభవంగా బతుకమ్మ ఆటలు ఆడుతారని, ఈ నేపథ్యంలో చెరువు అందాలు ఏమాత్రం దెబ్బతినకుండా చూడాలని కోరారు. ప్రస్తుతం బతుకమ్మకుంటలో ఉన్న బోటు షికారును కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. చెరువును చూడడానికి స్థానికేతరులు కూడా వస్తున్నారన్నారు. బతుకమ్మ కుంట సందర్శన, వ్యాయామ సమయాలను కూడా నిర్దేశించాలని కోరారు. ఆ సమయాలను గేటుపై పెట్టి.. నిరంతరం వాచ్‌మ్యాన్‌లు ఉండేలా చూడాలన్నారు. గతంలో ఇక్కడ చెత్త సేకరణ ఆటోలు పార్కింగ్



చేసేవారని, వారికి ప్రత్యామ్నాయ పార్కింగ్ ఏరియా చూపించాలని కోరారు. అలాగే బతుకమ్మ కుంట సందర్శనకు వచ్చిన వాహనదారులు కూడా ఇష్టానుసారం వాహనాలను పార్కింగ్ చేయకుండా నియంత్రించాలని సూచించారు. హైడ్రా కమిషనర్‌ను కలిసిన వారిలో స్థానిక కాంగ్రెస్ సీనియర్ నాయకులు నారాయణస్వామి కూడా ఉన్నారు.

# తెలంగాణ తల్లి ఫ్లైఓవర్ పేరులో మార్పు లేదు


**స్పష్టం చేసిన జిహెచ్‌ఎంసి ప్రాజెక్ట్స్ వింగ్**

**హైదరాబాద్, అక్టోబర్ 01 (జనంసాక్షి) :** తెలంగాణ తల్లి ఫ్లైఓవర్ పేరులో ఎలాంటి మార్పు లేదని జిహెచ్‌ఎంసి ప్రాజెక్ట్స్ వింగ్ తెలిపింది. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన జారీ చేసింది. జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ ఇప్పటికే ఈ ఫ్లైఓవర్ కు తెలంగాణ తల్లి ఫ్లైఓవర్ గా నామకరణం చేస్తూ ఆమోదం తెలిపింది. ఫ్లై ఓవర్ కు ఒకవైపు బోర్డ్ ఏర్పాటు పనులు పూర్తి అయ్యాయి. రెండోవైపు బోర్డు ఏర్పాటుకు ఫౌండేషన్ క్యూరింగ్ జరుగుతున్నది. క్యూరింగ్ పీరియడ్ పూర్తి కాగానే రెండు రోజుల్లో రెండో సైడ్ బోర్డు ఏర్పాటు చేస్తామని ప్రాజెక్ట్స్ వింగ్ తెలిపింది. అప్పటి వరకూ ఇప్పటికే ఏర్పాటు చేసిన బోర్డును కప్పి ఉంచామని స్పష్టతనిచ్చింది. రెండింటిని కలిపి ఒకేసారి ప్రారంభిస్తామని జీహెచ్‌ఎంసీ ప్రాజెక్ట్స్ వింగ్ ప్రకటనలో తెలిపింది.

# దుర్గం చెరువును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే పనులు త్వరగా పూర్తి చేయాలి

**జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్**

**హైదరాబాద్, అక్టోబర్ 1 (జనంసాక్షి) :** దుర్గం చెరువును తెలంగాణలో ఒక ప్రధాన పర్యాటక గమ్యస్థానంగా అభివృద్ధి చేయడానికి చేపట్టిన పనులను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ ఇంజనీరింగ్ అధికారులు, ఎస్‌ఎన్‌డిపి, లేక్స్ విభాగాలతో రహేజా ఐటీ పార్క్ (హైదరాబాద్) ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులకు సూచించారు. బుధవారం కమిషనర్ ఆర్.వి. కర్ణన్ దుర్గం చెరువును పరిశీలించి, చెరువు ప్రొటెక్షన్ పనులతో పాటు ప్రతిపాదిత అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని సూచించారు. చెరువులోకి మురుగు నీరు చేరకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. భారీ వర్షాల సమయంలో పరిసర కాలనీలు ముంపు బారిన పడకుండా ఉండేందుకు చెరువు నీటి మట్టాన్ని



ఎఫ్టీఎల్ కంటే తక్కువగా ఉంచాలని లేక్స్ విభాగానికి ఆదేశాలు ఇచ్చారు. కమిషనర్ ప్రోత్సాహంతో రహేజా ఐటీ పార్క్ సంస్థ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్‌ఆర్) పథకం కింద దుర్గం చెరువు అభివృద్ధి, సుందరీకరణ పనులకు నిధులు సమకూర్చడానికి ముందుకొచ్చింది. రెండు సంవత్సరాల పాటు చెరువును సంరక్షించడానికి ఆ సంస్థ బాధ్యత తీసుకుంది. ఇందులో భాగంగా చెరువు చుట్టూ కంచె ఏర్పాటు, నిరంతర శుభ్రపరిచే చర్యలు, నీటిమొక్కలు, తేలియాడే వ్యర్థాలను తొలగించడం, అలాగే వాకింగ్ ట్రాక్, సైక్లింగ్ ట్రాక్, ల్యాండ్‌స్కేపింగ్, పచ్చదనం ఏర్పాటుతో ప్రజలకు సౌకర్యాలు కల్పించనున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ ఆర్.వి. కర్ణన్, రహేజా ప్రతినిధులను పనులు త్వరగా పూర్తి చేయాలని కోరారు. అలాగే ఎస్‌ఎన్‌డిపి, లేక్స్ విభాగాలను కూడా లేక్ ప్రొటెక్షన్,అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. క్షేత్ర పరిశీలనలో జిహెచ్‌ఎంసి కమిషనర్ వెంట హెచ్.ఎమ్.డబ్ల్యూ.ఎస్.ఎస్.బి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మయాంక్ మిట్టల్, శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ బోర్కడే హేమంత్ సహదేవ్ రావు, జీహెచ్‌ఎంసీ ఎస్.ఇ. శంకర్ నాయక్, రహేజా గ్రూప్ నుండి బాలరాజు, జీహెచ్‌ఎంసీ ఇ.ఇ. శిరీష, సీజీఎం (ఎస్‌టిపి) పద్మజ, లేక్స్ విభాగం డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జగదీష్ లు ఉన్నారు.

# వృద్ధులను భారంగా కాకుండా బాధ్యతగా చూడాలి

**ఎమ్మెల్యే కేపీ వివేకానంద**






**కుత్బుల్లాపూర్ అక్టోబర్ 1 (జనంసాక్షి) :** వృద్ధులను తల్లిదండ్రులను భారంగా కాకుండా బాధ్యతగా చూసుకోవాలని ఎమ్మెల్యే కేపీ వివేకానంద గౌడ్ అన్నారు. బుధవారం జీడిమెట్ల డివిజన్ కుత్బుల్లాపూర్ గ్రామంలోని సీనియర్ సిటిజన్స్ కార్యాలయంలో నిర్వహించిన అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సభ్యులను ఆయన మెమొంటో లతో సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సీనియర్ సిటిజన్స్ నేటి తరానికి మార్గదర్శకులుగా ఉంటారన్నారు. వృద్ధులు వారి జీవితంలో అనుభవించిన అనుభవాలను నేటి యువత తెలుసుకొని సన్మార్గంలో నడవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు నరసింహారెడ్డి, సలహాదారులు బలవంత రెడ్డి, ప్రధాన కార్యదర్శి పెద్ది మల్లేశం, కోశాధికారి ఆర్ మురళి గౌడ్, ఉపాధ్యక్షులు లింగం గౌడ్, నరసింహ గౌడ్, ఎం నాగేష్, సంయుక్త కార్యదర్శి సత్యనారాయణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ లక్ష్మణ చారి, కమిటీ సభ్యులు బిక్షపతి గౌడ్, స్థానిక టిఆర్ఎస్ నాయకులు కుంట వేణు, ఆటో బలరాం, నార్ల కంటి శ్యామ్, నల్ల ప్రసాద్ గౌడ్, నల్ల వేణు, భూపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# విజయ దశమి విజయాలు అందించాలి

**తెలంగాణ ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి**




**తాండూరు అక్టోబర్ 1(జనంసాక్షి) :** విజయ దశమి ప్రతి ఒక్కరి జీవితాల్లో విజయాలు అందించాలని తెలంగాణ ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రజలకు విజయ దశమి దసరా శుభాకాంక్షలు తెలిపారు. చెడు మీద మంచి సాధించిన విజయ స్ఫూర్తి తో ముఖ్యంగా ఉమ్మడి రంగారెడ్డి జిల్లా, వికారాబాద్, మేడ్చల్ తో పాటు తాండూరు ప్రాంతం ప్రజలకు దుర్గామాత కృపతో ఈ విజయ దశమి విజయాలు అందించాలని కోరారు.అదేవిధంగా రైతులకు పాడి పంటలు, అష్టైశ్వర్యాలతో, సుఖం శాంతులతో తులదూగాలని ఆకాంక్షించారు. దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

# క్షేత్రస్థాయిలో పారిశుద్ధ్య కార్యక్రమాలు

**పర్యవేక్షణను బలోపేతం చేయాలి**


**జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్**

**హైదరాబాద్, అక్టోబర్ 1 (జనంసాక్షి) :** క్షేత్రస్థాయిలో పారిశుద్ధ్య కార్యక్రమాలు ప్రభావవంతంగా జరిగేలా పర్యవేక్షణను బలోపేతం చేయాలనీ జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్.వి కర్ణన్ అధికారులను ఆదేశించారు. బుదవారం కమిషనర్ జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో పారిశుద్ధ్య కార్యక్రమాలు అమలుపై కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్, ఏసీ శానిటేషన్ రఘు ప్రసాద్ , తదితరులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రైమరీ కలెక్షన్‌లో ఉన్న లోటుపాట్లు, జివిపి క్లియరెన్స్, అదనపు బిన్ల ఏర్పాటు, చెత్త సేకరణలో ఉన్న క్షేత్ర సమస్యలుపై చర్చించారు. సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్



మాట్లాడుతూ.. నగరంలో శానిటేషన్ కార్యక్రమాలు ప్రభావవంతంగా చేపట్టేందుకు అధికారులు పర్యవేక్షణ పెంచాలని చెప్పారు. చెత్త సేకరణ వాహనాలపై కూడా పర్యవేక్షణ ఉండాలన్నారు. దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి చేసిన పనులను పరిశీలించి, ప్రతిపాదిత నిర్మాణాత్మక పరిష్కారాల ను కమిషనర్ సమీక్షించారు. హైదరాబాద్ నగరంలో స్వచ్ఛత కార్యక్రమాలు మరింత మెరుగుపడాలని, జవాబుదారీతనం, సమయానుకూల చర్యలు, పర్యవేక్షణ పెంచాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు.

## మంత్రిని కలిసిన గ్రూప్ 2 అభ్యర్థులు




**హైదరాబాద్ (జనంసాక్షి) :** మినిస్టర్ క్వార్టర్స్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్‌ని ఇటీవల గ్రూప్ 2 ఫలితాల్లో ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గ్రూప్ 2లో ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులకు అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. వృత్తిలో అంకితభావంతో పనిచేస్తూ డిపార్టుమెంట్‌కు, తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలని మంత్రి పొన్నం ఆకాంక్షించారు.

## మంత్రి సీతక్క దసరా శుభాకాంక్షలు

**హైదరాబాద్ (జనంసాక్షి) :** విజయదశమి పర్వదినం సందర్భంగా రాష్ట్ర ప్రజలకు పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క శుభాకాంక్షలు తెలిపారు. దసరా పండుగ చెడుపై మంచికి, అజ్ఞానంపై జ్ఞానానికి, అన్యాయంపై న్యాయానికి సంకేతంగా నిలుస్తుందన్నారు. ఈ పర్వదినం ప్రతి ఇంట్లో సుఖ శాంతులు నింపి, ప్రజల జీవితాల్లో మరింత ఆనందం, అభివృద్ధి, ఐక్యతను ప్రసాదించాలని ఆకాంక్షించారు.

## రంగారెడ్డి జిల్లా ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు




**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి: (జనంసాక్షి)** రంగారెడ్డి జిల్లా ప్రజలకు జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి (దసరా) విజయదశమి శుభాకాంక్షలు తెలియజేశారు జిల్లా ప్రజలందరూ విజయదశమి పండుగను సుఖసంతోషాలతో జరుపుకోవాలన్నరు.

## డా.తులసి రమణాచార్యులుకు దసరా పురస్కారం



**మల్కాజిగిరి,అక్టోబర్1(జనంసాక్షి) :** సమాజంలో వివిధ రంగాల్లో కృషిచేసిన పలువురికి సాహితి కళా సేవా సమితి ఆధ్వర్యంలో దసరా పురస్కారాలు పేరిట సాహితీ సేవా సమితి వారు నగరంలోని తెలంగాణ సారస్వత పరిషత్తులో ఘనంగా కార్యక్రమంగా నిర్వహించారు. సాహిత్య రంగంలో సమాజ సేవలో భాగంగా మల్కాజిగిరి ఈస్ట్ ఆనంద్‌బాగ్ ప్రాంతానికి చెందిన కవి రచయిత డా .తులసి వెంకట రమణాచార్యులుకు దసరా పురస్కారంను అందచేశారు. ఈ కార్యక్రమంలో విసాస్ విజన్ ఓవర్సీస్ సిఇఓ డా బద్దం రఘువీర్ రెడ్డి, కేశవరాజు ప్రభాకర్ రావు, కర్ణాటక సంగీత విద్వాంసురాలు మయూరి శంభుని, గాయకుడు రాంకీ, వీణా మాధురి ,డా సూర్యవర్ధిని , విజయలక్ష్మి,డా బెల్లంకొండ నాగేశ్వర రావుపాల్గొన్నారు.

## ఉప్పల్ ఇంటి ముందు రక్తపు మరకల బస్తా




**ఉప్పల్ అక్టోబర్ 01 (జనంసాక్షి):** ఇంటి గుమ్మం వద్ద రక్తపు మరకలతో ఉన్న బస్తా చూసి కాలనీ ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. ఈ ఘటన ఉప్పల్ పరిధి గణేశ్నగర్ కాలనీలో చోటుచేసుకుంది. ఇటీవల చర్లపల్లి రైల్వే స్టేషన్ వద్ద ఓ మహిళ మృతదేహాన్ని బస్తాలో మూట కట్టిన సందర్భాన్ని గుర్తుచేసుకొని, భయపడ్డట్లు కాలనీ ప్రజలు తెలిపారు. తీరా ఓ వ్యక్తి ధైర్యం చేసి, ఓపెన్ చేసి చూడగా మాంసపు వ్యర్థాలతో కూడి ఉన్నట్లుగా గుర్తించారు.

# ఆరోగ్య దాతకు అరుదైన అవార్డు

**ప్రొఫెసర్ డాక్టర్ బంగారి స్వామిని వరించిన వైనం**


**ఆసియా టుడే వారి ఇండో యుకె గ్లోబల్ హెల్త్ కేర్ లీడర్ అవార్డ్**

**కరీంనగర్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 01 (జనంసాక్షి):** ఎంతో ప్రతిష్ఠాత్మకమైన ఆసియా టుడే వారి ఇండో – యుకె గ్లోబల్ హెల్త్ కేర్ లీడర్ అవార్డ్ 2025ను రెనే వైద్య సంస్థల అధినేత ప్రొఫెసర్ డాక్టర్ బంగారి స్వామి మంగళవారం రోజు లండన్ పార్లమెంట్‌లో జరిగిన కార్యక్రమంలో అందుకున్నారు. ప్రతి సంవత్సరం ఈ అవార్డ్ కోసం ఆసియా టుడే సంస్థ వారు ప్రపంచవ్యాప్తంగా వైద్యరంగంలో అత్యున్నత సేవలు అందించిన వారిని ఎంపిక చేసి లండన్ పార్లమెంట్‌లో ఈ అవార్డును ప్రధానం చేస్తారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ డాక్టర్ బంగారి స్వామి మాట్లాడుతూ... ఈ అవార్డ్ తో తన బాధ్యత ఇంకా పెరిగిందని వైద్యం అంటే కేవలం ఒక వృత్తి మాత్రమే కాదని ఒక సామాజిక బాధ్యత అన్నారు. తాను ఈ అవార్డ్ సాధించడం వెనుక తన డా.బంగారి రజనీ ప్రియదర్శిని సహకారం, కుటుంబ ప్రోత్సాహం, హాస్పిటల్ సిబ్బంది కృషి ఎంతో ఉందని ఈ సందర్భంగా వారందరికీ మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలుపుతున్నానని అన్నారు. గత రెండు దశాబ్దాలుగా సుమారు అరవై ఐదు వేలకు పైగా శస్త్రచికిత్సలు చేసిన అనుభవం, ఎంతో మంది ప్రాణాలు కాపాడిన తృప్తి ఉందన్నారు. రెనే హాస్పిటల్ వారు సేవా కార్యక్రమాలలో భాగంగా ప్రతి సంవత్సరం తన తల్లిగారైన కీర్తి శేషులు బంగారి లక్ష్మీ స్మారకార్థం పది మందికి పూర్తి ఉచితంగా కీలు మార్పిడి ఆపరేషన్లు నిర్వహిస్తామని అన్నారు. వచ్చే అక్టోబర్ నెలలో ఉత్తర తెలంగాణా లో మొట్టమొదటిసారిగా రోబోటిక్ ద్వారా కీలు మార్పిడి శస్త్రచికిత్సను పరిచయం చేస్తున్నామని దీని ద్వారా ఈ ప్రాంత ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలు అందించడం జరుగుతుందన్నారు. కరీంనగర్ నగరం ఇప్పుడు అత్యంత వేగంగా ప్రపంచ స్థాయి హెల్త్ కేర్ హబ్ గా ఎదుగుతున్న నగరం. హైదరాబాద్ తర్వాత టైప్ 2 నగరాల్లో సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలకు కరీంనగర్ ఇప్పుడు కేర్ ఆఫ్ అడ్రస్ గా మారిందన్నారు. ఆధునిక వైద్య సేవలకోసం హైదరాబాద్ లాంటి మెట్రో నగరాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా రాబోయే రోజుల్లో వైద్య రంగంలో వచ్చే ప్రతి అత్యాధునిక విప్లవాత్మక మార్పును రెనే హాస్పిటల్ లో తీసుకురావడంలో తాము ఎప్పుడు ముందుంటామన్నారు.



# ముఖ్యమంత్రి సహాయనిధి బీద ప్రజలకు సంజీవిని లాంటిది


**కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు యు.రవీందర్**



**మర్పల్లి అక్టోబర్ 01 (జనంసాక్షి) :** ముఖ్యమంత్రి సహాయ నిధి పేద ప్రజలకు సంజీవని లాంటిదని వికారాబాద్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఉప్పరి రవీందర్ అన్నారు. మండల పరిధిలోని బూచన్ పల్లి గ్రామానికి చెందిన సిరిపురం నరసింహారెడ్డి, ఎక్కెల్లి శివ ప్రసాద్ లకు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఆదేశాల మేరకు గ్రామంలో లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా మమ్మల్ని సంప్రదిస్తే వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా సహాయం అందించడానికి కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షులు బి వెంకటరామిరెడ్డి, మాజీ అధ్యక్షులు కందడి శ్రీనివాసరెడ్డి, నాయకులు రఘుపతి రెడ్డి, కొంచారం జగన్మోహన్ రెడ్డి, మల్లయ్య, కుంచారం గోపాల్ రెడ్డి, బక్కప్పుల జగన్మోహన్ రెడ్డి, బూచానెల్లి రవీందర్ రెడ్డి, ఎక్కిల్లి కిష్టయ్య, తదితరులు ఉన్నారు.

# తెలంగాణ ఆడపడుచులకు బతుకమ్మ చీరలు ఎక్కడ..?

**మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి**




**చేవెళ్ల, అక్టోబర్ 01 (జనంసాక్షి) :** తెలంగాణ ఆడపడుచులకు బతుకమ్మ చీరలు ఎక్కడ అని మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. చేవెళ్ల నియోజక వర్గం చేవెళ్ల మండల అధ్యక్షుడు పెద్దోళ్ల ప్రభాకర్, రంగారెడ్డి జిల్లా మాజీ డిసిఎంఎస్ చైర్మన్ పట్లోళ్ల కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ముడిమ్యాల వ్యవసాయ క్షేత్రంలో బిఆర్ఎస్ చేవెళ్ల మండల ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...బతుకమ్మ పండుగ వస్తే కేసీఆర్ పాలనలో ప్రతి ఇంటి ఆడపడుచుకు చీరలు అందేవి అని అన్నారు. ఇప్పుడున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం మాత్రం ‘ఆ చీర ఎవరు కట్టుకుంటారు దేనికి పనికొస్తుంది అని హేళన చేశారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రతి ఆడపడుచుకు రెండేసి చీరలు ఇస్తామని వాగ్దానం చేసి ఎంగిలిపువు బతుకమ్మ, సద్దుల బతుకమ్మలకైనా ఆ చీరలు ఎక్కడ అని ప్రశ్నించారు. ప్రతి ఆడపడుచుకి నాలుగు చీరలు కాంగ్రెస్ పార్టీ బాకీగా పెట్టిందని గుర్తుంచుకోవాలని అన్నారు. ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీల్లో ఒక్కటీనీ నెరవేర్చలేని అసమర్థ రేవంత్ రెడ్డి సర్కార్ ఇప్పుడు కొత్త రాగం పాడుతున్నారు. ప్రతి మహిళను కోటీశ్వరురాలు చేస్తానంటున్నారు. కానీ ఇప్పటివరకు ఎంతమంది మహిళలు కోటీశ్వరులయ్యారని, ఎంతమందిని కోటీశ్వరాళ్లను చేశారుని ప్రశ్నించారు. అబద్ధాల హామీలిచ్చి గద్దెనెక్కిన రేవంత్ రెడ్డి సర్కార్ స్థానిక సంస్థలు ఎన్నికల్లో ప్రజల్ని మభ్యపెట్టి మోసం చేసి ఓట్లు దండుకోవాలని చూస్తున్నారు. కాంగ్రెస్ చేస్తున్న మోసాలను గడప గడపకు వెళ్లి బహిర్గతం చేయాలని, కాంగ్రెస్ బాకీ కార్డు ద్వారా ప్రజలకు బాకీలు వివరించి చెప్పాలని రాబోయే స్థానిక సంస్థలు ఎన్నికల్లో కచ్చితంగా విజయ డంకా మోగించబోతున్నామని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దేశమల్ల ఆంజనేయులు, నారాయణ, కర్నె శివ ప్రసాద్, వంగా శ్రీధర్ రెడ్డి, అబ్దుల్ ఘని, హనుమంత్ రెడ్డి, శేఖర్ రెడ్డి, కరుణాకర్ రెడ్డి, శేరీ రాజు, శేరి దర్శన్, కసిరే వెంకటేష్, ప్రభాకర్ రెడ్డి, బ్యాగరి సుదర్శన్, విఘ్నేష్ గౌడ్, తోట చంద్రశేఖర్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# కాలనీల అభివృద్ధిలో సంక్షేమ సంఘాల పాత్ర కీలకం

**ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**

**కాప్రా, అక్టోబర్ 1 (జనంసాక్షి) :** కాలనీల అభివృద్ధిలో సంక్షేమ సంఘాల పాత్ర కీలకమని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. చర్లపల్లి డివిజన్ ఇందిరా నగర్ (నాగార్జున నగర్ )లో బుధవారం జరిగిన కాలనీ సంక్షేమ సంఘం కమ్యూనిటీ హాల్ భవనం ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరానగర్ కుటుంబాల భాగస్వామ్యంతో నిర్మాణం పూర్తి చేసుకున్న కమ్యూనిటీ హాలు ను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు.కాలనీ అభివృద్ధి కోసం అవసరమైన నిధులను మంజూరు అయ్యేలా చొరవ తీసుకుంటానని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి స్పష్టం




చేశారు.ఇందిరానగర్ చైతన్య వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శి వర్గం సభ్యులు బివి నరసింహారెడ్డి, శివారెడ్డి, కృష్ణారెడ్డి, భాస్కరాచారి, శ్రీనివాస్ రెడ్డి, రాంప్రసాద్, వెంకట్రావు, సారా అనిల్ ముదిరాజ్ఎ లు ఎమ్మెల్యే లక్ష్మారెడ్డికి శాలువా సత్కరించారు. ఈ కార్యక్రమంలో చర్లపల్లి కాలనీల సమాఖ్య సి సి ఎస్ అధ్యక్షులు ఎంపల్లి పద్మా రెడ్డి,నాయకులు నేమూరి మహేష్ గౌడ్, సప్పిడి శ్రీనివాస్ రెడ్డి, గంప కృష్ణ, సారా వినోద్ ముదిరాజ్, ఎస్ ఏ రహీం, మొగిలి రాఘవరెడ్డి గడ్డల పాండు మన్నే నరేష్ యావపురం రవి దాసరి కనకయ్య, శ్రీశైలం, రాధాకృష్ణ మూర్తి, నాగేశ్వరరావు బిక్షపతి గౌడ్, కృష్ణంరాజు,జి. శ్రీనివాస్, జి మురళి, రమణ నాయక్, సీఎం రెడ్డి,ఏ వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

# ఎంపీ ఎలక్షన్ మాదిరిగానే స్థానిక సంస్థల్లో బిజెపిని గెలిపించండి

**బిజెపి జిల్లా అధ్యక్షులు డాక్టర్ కొప్పుల రాజశేఖర్ రెడ్డి**

**వికారాబాద్, అక్టోబర్ 1, (జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్రంలో మోగిన ఎన్నికల నాగార నేపథ్యంలో బుధవారం భారతీయ జనతా పార్టీ సారథ్యంలో బిజెపి జిల్లా కార్యాలయం ఎన్నేపల్లిలో మీడియా సమావేశం నిర్వహించారు. వికారాబాద్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ కొప్పుల రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. భారతీయ జనతా పార్టీ అభ్యర్థులు జిల్లాలోని అన్ని సర్పంచ్, ఎంపీటీసీలు, జడ్పిటిసి



స్థానాల్లో పోటీలో ఉంటుందని, ఈ ఎన్నికలు కార్యకర్తల ఎన్నికలు కాబట్టి కార్యకర్తలు గెలిపించాలన్నారు. అనంతరం ఓబీసీ మోర్చ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ వెన్న ఈశ్వరప్ప మాట్లాడుతూ బిఆర్ఎస్, కాంగ్రెస్ లు కేవలం గెలుపు కోసం అమలు కానీ వాగ్దానాలు చేసి ప్రజలను మభ్యపెట్టి గతంలో ఓట్లు దండుకున్నారని ప్రస్తుతం ఆ మోసాన్ని గమనించిన యావత్ తెలంగాణ ప్రజలు సంస్థాగత ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీకి పట్టం కట్టడానికి సుముఖంగా ఉన్నారన్నారు.

## ప్రజల జీవితంలో దసరాను మించిన పండుగ లేదు

**జిల్లా ప్రజలందరికీ దసరా పండుగ శుభాకాంక్షలు**

**మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు**



**నంగునూరు, అక్టోబర్ 1 ( జనంసాక్షి)** విజయ దశమి ( దసరా ) పర్వదినం సందర్భంగా జిల్లా ప్రజలకు మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు గారు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ. ప్రజలందరికి అన్నింటా శుభం చే కూరాలని.. ప్రజల జీవితం లో దసరాను మించిన పండుగ లేదు. దసరా పండుగలో మన సాంప్రదాయం, సంస్కృతితో పాటూ ఆత్మీయత ఉందని ఈ పర్వదినాన్ని ప్రజలందురు సుఖ సంతోషాలతో ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. చెడు ఎంత శక్తివంతంగా కనిపిస్తున్నప్పటికీ మంచితనమే చివరికి విజయం సాధిస్తుంది ఇదే దసరా మనకి గుర్తుచేస్తుందన్నారు. చెడు మీద మంచి విజయం సాధించే రోజు విజయ దశమి అని పాలపిట్టను చూస్తే శుభం కలిగినట్టే ప్రజలకు శుభం కలగాలని. అమ్మవారి అశీసులు, ప్రజల దీవెన ఎల్లపుడు ఉండాలని ఈ దసరా పండుగ ప్రజలందరికి మరిన్ని విజయాలు అందించాలని కోరుకున్నారు.

## అందరూ కలిసిమెలిసి సోదరాభావంతో ఉత్సవం నిర్వహించుకోవాలి

- **ఆహ్లాదకరమైన వాతావరణంలో సంతోషంగా పండుగను జరుపుకోవాలి**
- **జిల్లా ఎస్పీ టి. శ్రీనివాస రావు**



**గద్వాల నడిగడ్డ,అక్టోబర్ 1 (జనంసాక్షి):** దుష్ట శక్తులపై విజయానికి సంకేతముగా జరుపుకునే దసరా వండుగను స్ఫూర్తిగా తీసుకొని ప్రజలందరు ఐక్యత,సమగ్రతల కోసం కృషి చేయాలని దసరా పర్వదినం సందర్భంగా జిల్లా పోలీసుశాఖ తరపున జిల్లా ప్రజలకు, పోలీసు అధికారులకు, సిబ్బందికి జిల్లా ఎస్పీ టి. శ్రీనివాస రావు విజయదశమి దసరా పండుగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ విజయదశమి ప్రజల జీవితాల్లో తేజస్సు, విజయాన్ని తేవాలని ఆకాంక్షిస్తూ, పండుగా ఉత్సవాలు నిర్వహించు కునేవారు సంతోషకరమైన వాతావరణంలో, ఆరోగ్యకరంగా అందరూ కలిసిమెలిసి సోదరాభావంతో ఉత్సవం నిర్వహించుకోవాలని కోరారు. పోలీసుశాఖలో ప్రతి అధికారి ప్రజా రక్షణలో అగ్రగామిగా ఉండి,శాఖ గౌరవాన్ని మరింత పెంచే విధంగా పనిచేయాలని సూచించారు. పండుగలను అందరూ ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని, ముఖ్యంగా నవరాత్రుల అనంతరం జరిగే దుర్గామాత విగ్రహాల నిమజ్జన కార్యక్రమాలను కూడా శాంతియుతంగా నిర్వహించుకోవాలని జిల్లా ఎస్పీ కోరారు.

## ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలి

**జిల్లా ప్రజలందరికీ విజయ దశమి పర్వదిన శుభాకాంక్షలు**

**జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్**



**మెదక్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 1 (జనంసాక్షి ):** అక్టోబర్ 2 విజయదశమి పర్వదినాన్ని పురస్కరించు కుని దసరా సందర్భంగా కలెక్టర్లు ప్రజలకు శు భాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చెడుపై మంచి సాధించిన విజయాన్ని గుర్తుచేస్తూ, ప్రజలు పండుగను ఆనందోత్సవాలతో జరుపుకోవాలని ఆకాంక్షిస్తాయి. ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, జిల్లా సుభిక్షంగా ఉండాలని పేర్కొన్నారు. ప్రజలందరూ సుఖశాంతులతో, సిరిసంపదలతో ఆనందంగా ఉండాలని ఆకాంక్షించారు. పండుగను ఆనందోత్సాహా లతో జరుపుకోవాలని, ఈ దసరా జిల్లా ప్రజల జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని కలెక్టర్ అన్నారు. జగన్మాత ఆశీస్సులతో జిల్లా పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని వివరించారు.

## విజయదశమి ప్రతి ఒక్కరికి విజయాలు చేకూర్చాలి

**జిల్లా ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు**

**జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య**



**సంగారెడ్డి, అక్టోబర్ 1(జనంసాక్షి)** విజయదశమి పర్వదినం సందర్భంగా జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య ,జిల్లా ప్రజలకు పండగ శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే ఈ పండుగ ప్రతి ఇంటిలో ఆనందోత్సాహాలను నింపాలని, చేపట్టిన కార్యక్రమాలు విజయవంతం కావాలని ఆమె ఆకాంక్షించారు. మాత దుర్గాదేవి కృపతో అందరూ ఆరోగ్యవంతంగా, సుఖసంతోషాలతో, సిరి సంపదలతో జీవించాలని కలెక్టర్ కోరారు. ఈ విజయదశమి ప్రతి ఒక్కరికి విజయాలు చేకూర్చాలని అభిలాషించారు. అందరూ శాంతియుత, ఆనందోత్సాహాల మధ్య దసరా పండుగను జరుపుకోవాలని ఆమె సూచించారు.

## ఒక్క యూరియా బస్తా కోసం ఇన్ని తిప్పలా

- **ప్రభుత్వ వైఫల్యాలే స్థానిక సంస్థల ఎన్నికల్లో మన గెలుపుకు బాట**
- **ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే మెచ్చా**



**చంద్రుగొండ, అక్టోబర్ 1( జనంసాక్షి):** రాష్ట్రంలో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉందని ఒక్క యూరియా బస్తా కోసం రాత్రింబవల్లు సొసైటీల వద్ద పడి గాపులు పడాల్సిన పరిస్థితి ఏర్పడిందని అశ్వరావుపేట మాజీ ఎమ్మెల్యే మెచ్చ నాగేశ్వరావు విమర్శించారు. బుధవారం చంద్రుగొండ మండలం, దామరచర్ల ఎస్ ఆర్ గార్డెన్స్ లో ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అశ్వరావుపేట నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ సత్తా చాటాలని రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలు ప్రజల చెంతకు తీసుకువెళ్లాలని సూచించారు. ప్రధానంగా రైతులు పడుతున్న అవస్థలను అలవగాని హామీలను ఇచ్చి ప్రజలను మోసం చేసిన విషయాన్ని ప్రజలకు తెలియజేయాలని ఆయన కార్యకర్తలకు సూచించారు. మహిళలు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలను నమ్మి తమకు రు 2500 నెల నెల అందుతాయిని, పింఛన్లు రూ నాలుగు వేలకు వికలాంగులకు 6000 రూపాయలు వస్తాయని ఆశపడి భంగపడి ఇప్పుడు స్థానిక సంస్థలు ఎన్నికల్లో తమ సత్తా చాటాలని చూస్తున్నారని ఆయన తెలిపారు. రాష్ట్రంలో బిఆర్ఎస్ పార్టీ పాలనలో జనారంజక పాలన కొనసాగితే నేడు అలవి గాని హామీలను ఇచ్చి ప్రజలను మభ్యపెట్టి అధికారకంలోకి కాంగ్రెస్ పార్టీ వచ్చిందని ఈ విషయం ప్రజలకు ఇప్పుడు అర్థమైందని ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ ఓటునే ఆయుధంగా మలిచి బీఆర్ఎస్ పార్టీకి విజయం చేకూర్చాలని కోరారు. ముఖ్య కార్యకర్తలు తగు నిర్ణయాన్ని తీసుకొని అభ్యర్థులను నిలబెట్టి వారి గెలుపు కోసం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ధారా బాబు ప్రధాన కార్యదర్శి రాఘవులు గుంపెన సొసైటీ వైస్ చైర్మన్ నల్లమోతు వెంకటనారాయణ నాయకులు భూపతి రమేష్ సొసైటీ డైరెక్టర్ రామిశెట్టి సరళ సత్య నాగేశ్వరరావు నాగరాజు సురా వెంకటేశ్వర్లు భూపతి శ్రీను గాది లింగయ్య కేలోతు శ్రీను అంజన్ రావు తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఓట్ల లెక్కింపుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి

**జిల్లా ఎన్నికల అథారిటీ, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**



**వనపర్తి బ్యూరో అక్టోబర్1 జనంసాక్షి** స్థానిక సంస్థల ఎన్నికలు ఎంపీటీసీ/జడ్పీటీసీ ఓట్ల లెక్కింపుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎన్నికల అథారిటీ, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. బుధవారం ఉదయం జిల్లా ఎస్పీ రావుల గిరిధర్, అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎన్. ఖీమ్యా నాయక్, అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ యాదయ్య, ఆర్డీఓ సుబ్రమణ్యం తో కలిసి అనువైన కౌంటింగ్ కేంద్రాల బిల్డింగ్ లను పరిశీలించారు. నర్సింగాయ పల్లి శివారులోని డిగ్రీ కళాశాల, జె.ఎన్.టి.యు పి.జి కళాశాల భవనాలను పరిశీలించిన కలెక్టర్ కౌంటింగ్ కొరకు అవసరమైన గదులు, పార్కింగ్, స్ట్రాంగ్ రూమ్ తదితర అవసరాలకు అనుగుణంగా భవనాన్ని పరిశీలించారు. డిగ్రీ కళాశాలలో వనపర్తి, పానగల్, కొత్తకోట, పెబ్బేరు, గోపాల్ పేట, ఘనపూర్, పెద్దమందడి, శ్రీరంగాపూర్, ఎదుల, రేవల్లి మండలాలకు సంబంధించిన స్ట్రాంగ్ రూమ్, లెక్కింపు కేంద్రం డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేయాలని, మిగిలిన ఆత్మకూరు, అమర్చింత, మదనపూర్, చిన్నంబావి, వీపనగండ్ల జె.ఎన్.టి.యు. పోస్ట్ గ్రాడ్యూట్ కళాశాలలో ఏర్పాటు చేసేందుకు అనువుగా ఉందని సూచించారు. స్ట్రాంగ్ రూమ్, లెక్కింపు ప్రక్రియకు అవసరమైన ఏర్పాట్లు సి.సి. కెమెరాలు, బారి కెడింగ్ తదితర ఏర్పాట్లు ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా ఏర్పాటు చేసుకోవాలని అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ యాదయ్య ను ఆదేశించారు. జిల్లా ఎస్పీ రావుల గిరిధర్, అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎన్. ఖీమ్యా నాయక్, అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ యాదయ్య, ఆర్డీఓ సుబ్రమణ్యం, డీఎస్పీ వెంకటేశ్వర రావు, తహసిల్దార్ రమేష్ రెడ్డి కళాశాల ప్రిన్సిపాల్ తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

## మాజీ మంత్రి లక్ష్మారెడ్డికి మాతృ వియోగం



**జడ్చర్ల, అక్టోబర్ 1 (జనంసాక్షి):** మాజీ మంత్రి, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ సి. లక్ష్మారెడ్డి ఇంట్లో విషాదం నెలకొంది. హైదరాబాద్ లోని లక్ష్మారెడ్డి నివాసంలో బుధవారం ఉదయం ఆయన మాతృమూర్తి చర్లకోల లక్ష్మమ్మ (95) కన్నుమూశారు. బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్, జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డి, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి, లతోపాటు పలువురు నాయకులు తదితరులు లక్ష్మారెడ్డి నివాసానికి చేరుకుని లక్ష్మమ్మ పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డిని వారి కుటుంబ సభ్యులను ఓదార్చి, ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. లక్ష్మారెడ్డి స్వగ్రామం నాగర్ కర్నూల్ జిల్లా తిమ్మాజీపేట మండలం ఆవంచ గ్రామంలో శుక్రవారం లక్ష్మమ్మ అంతక్రియలను నిర్వహిస్తున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.

## ప్రయాస్-25 ఫైనల్‌oడ్ కు చేరిన ఆకునూరు విద్యార్థులు




**చేర్యాల (జనంసాక్షి) అక్టోబర్ 01 :** ఢిల్లీకి చెందిన ఎన్సీఈఆర్టీ ఆధ్వర్యంలో దేశం మొత్తం ఆన్ లైన్ లో నిర్వహిస్తున్న ప్రయాస్-2025 జాతీయస్థాయి సైన్స్ ప్రాజెక్ట్ పోటీల్లో చేర్యాల మండలంలోని ఆకునూరు గ్రామ జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు ఫైనల్ రౌండ్ కు ఎంపికవడంతో గ్రామ ప్రజలు, పాఠశాల ఉపాధ్యాయ బృందం హర్షం వ్యక్తం చేశారు. పాఠశాలకు చెందిన బండమీది యశ్వంత్, ఉడుత వర్షిత్ స్థానిక పాఠశాల భౌతికశాస్త్ర ఉపాధ్యాయులు రవీందర్ ఆధ్వర్యంలో ఎగ్జిబిట్స్ లో వారి ప్రదర్శనతో నిర్వాహకులను, సందర్శనకారులను ఆకట్టుకున్నారు. దీంతో నిర్వాహకులు ఇరువురిని ఫైనల్ రౌండ్ కు ఎంపిక చేశారు.

## కాంగ్రెస్ పార్టీ చేసిన మోసలను ప్రజలకు వివరిస్తాం



**మహబూబ్ నగర్ బ్యూరో సెప్టెంబర్ 01(జనం సాక్షి ):** అధికారంలోకి వచ్చేందుకు అమలుకు సాధ్యంకాని హామీలు ఇచ్చి కాంగ్రెస్ ప్రజలను మోసం చేసిందని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. బుధవారం మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో ని క్యాంపు కార్యాలయంలో బాకీ కార్డు లను ఆయన విడుదల చేసారు. కాంగ్రెస్ మోసాలను ఎండగట్టేందుకు బీఆర్ఎస్ బాకీ కార్డు ఉద్యమం ప్రారంభించిందని చెప్పారు. అభయహస్తం పేరిట కాంగ్రెస్ ఇచ్చిన హామీలను ప్రజలు మరచిపోయారన్న భ్రమలో కాంగ్రెస్ నేతలు ఉన్నారని, వారి అబద్ధపు హామీలను అందరికీ గుర్తు చేసేందుకే బాకీ కార్డు ఉద్యమాన్ని చేపట్టామన్నారు. ఎన్నికలు ఏవైనా విజయం బీఆర్ఎస్ పార్టీదేనని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయ బావుల వద్ద మీటర్లు పెట్టేందుకు సిద్ధం ఐతుంది.. కరెంటు చార్జీలు కూడా పెంచాబోతున్నారు. రైతులకు యూరియా ఇవ్వని కాంగ్రెస్ ప్రభుత్వం పండించిన పంట కొనుగోలు చేసేందుకు కూడా అవసరమైనా ఏర్పాట్లు చేయడం లేదు. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయడం కారణంగా ఎవరికి లాభం కలిగిందో ప్రజలు ఆలోచన చేయాలి. రానున్న ఏ ఎన్నికలు అయినా ప్రజలు కాంగ్రెస్ పార్టీకి తగిన రీతిలో బుద్ది చెప్పాలి. ప్రతి మహిళకు గృహలక్ష్మి కింద 2500 రూపాయలు ఇస్తామని హామీ ఇచ్చారని, ఆ లెక్కన చూసుకుంటే ఇప్పటివరకు రాష్ట్రంలోని ప్రతి మహిళకు 55వేల రూపాయలు ప్రభుత్వం బాకీ పడిందన్నారు. వృద్ధాప్య పింఛన్ ను నాలుగు వేలకు పెంచుతామని హామీ ఇచ్చిన ప్రభుత్వం 22 నెలల కాలంలో ప్రతి వృద్ధుడికి 44 వేల రూపాయలు బాకీ పడిందన్నారు. దివంగుల పెన్షన్ ను 6000 కు పెంచుతామన్న ప్రభుత్వం ఇప్పటివరకు 44 వేల రూపాయలు ప్రతి దివ్యాంగుడికి బాకీ పడిందన్నారు. షాదీ ముబారక్ కళ్యాణ లక్ష్మి పథకానికి తులం బంగారం అదనంగా ఇస్తామన్న ప్రభుత్వం ఇప్పటికీ లక్షలాదిమంది ఆడపడుచులకు బంగారం బాకీ పడిందన్నారు. రైతు భరోసా కింద ప్రతి రైతుకు 76 వేల రూపాయల బాకీ పడిందన్నారు. అధికారంలోకి రాగానే నిరుద్యోగ భృతి ఇస్తామన్న ప్రభుత్వం ప్రతి గ్రాడ్యుయేట్ నిరుద్యోగికి 88 వేల రూపాయల బాకీ పడిందన్నారు. దీంతోపాటు విద్యార్థులను స్కూటీ, విద్య భరోసా కార్డు కింద 50 వేల రూపాయలు బాకీ పడిందన్నారు. ఎన్నికల్లో ఓట్లు అడిగేందుకు వచ్చే నాయకులకు ఈ విషయాలపై నిలదీయాలని కోరారు. కార్యక్రమం లో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రాజేశ్వర్ గౌడ్, ముడా మాజీ చైర్మన్ గంజి వెంకన్న, హన్వాడ మాజీ ఎంపీపీ బాలరాజు, మాజీ జడ్పీటీసీ నరేందర్, పార్టీ మహబూబ్ నగర్ మండల అధ్యక్షులు దేవేందర్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు శివరాజ్, సీనియర్ నాయకులు మల్లు నర్సింహా రెడ్డి, కొండ లక్ష్మయ్య, శ్రీకాంత్ గౌడ్, నవకాంత్, వెదవత్, చెన్నయ్య, జంబులయ్య తదితరులు పాల్గొన్నారు.



## అప్రమత్తంగా ఉండండి..

**పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేస్తాం**

**న్యాల్ కల్, అక్టోబర్ 01, (జనం సాక్షి) :** సింగూరు ప్రాజెక్టు బ్యాక్ వాటర్ తగ్గుముఖం పడుతోందని, ఐన సమీప గ్రామాల్లోని కుటుంబాలు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైతే ప్రత్యేకంగా పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేస్తామని ఇన్చార్జి తహసిల్దార్ రాజిరెడ్డి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి గూడెం శ్రీనివాస్ లు అన్నారు. బుధవారం మండలంలోని చీకూర్తి గ్రామంలోని బ్యాక్ వాటర్ తో ఇబ్బందులు పడుతున్న మన కుటుంబాలను పరిశీలించారు. కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను పరిశీలించారు. కార్యక్రమంలో అధికారులు, అధికార, విపక్ష పార్టీలకు చెందిన శ్రేణులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## మహిళకు లైంగిక వేధింపులు వ్యక్తిపై కేసు నమోదు

**రేవల్లి, అక్టోబర్ 01 (జనంసాక్షి)** రేవల్లి మండలంలోని తల్పునూర్ గ్రామానికి చెందిన సకీన ఫాతిమా భర్త మహమ్మద్ షఫీ తన భర్తకు అదే గ్రామానికి చెందిన సయ్యద్ అఫ్రోజ్ తండ్రి సాజిద్ వెంటపడుతూ, మెసేజ్ చేస్తూ వేధిస్తున్నాడని, తన భర్తను కూడా ఫోన్ చేసి బెదిరిస్తున్నాడని ఫాతిమా బుధవారం రేవల్లి మండల పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రేవల్లి మండల ఎస్సై రజిత తెలిపారు.

### స్థానిక సంస్థల ఎన్నికల్లో ముస్త్యాల గ్రామాన్ని

## ఎస్సీ రిజర్వుడ్ గా మార్చాలి

**రాజకీయ పరంగా తమకు అవకాశం ఇవ్వండి : దళితులు**



**చేర్యాల (జనంసాక్షి) అక్టోబర్ 01 :** చేర్యాల మండలం ముస్త్యాల గ్రామం జాతీయ రహదారికి ఆనుకొని ఉండి అభివృద్ధి పరంగా ముందు ఉన్నా స్వాతంత్రం వచ్చిన నాటి నుంచి ఇప్పటివరకు ఈ గ్రామంలో దళితులు సర్పంచులుగా పోటీ చేసే అవకాశం రాలేదు అనే ఆవేదన ఆ వర్గాన్ని కలవరపెడున్నా ప్రధాన సమస్యగా మారింది అని అంటున్నారు. ఒకప్పుడు ముస్త్యాల, వీరన్నపేట గ్రామలకు కలిపి ఒకే సర్పంచ్,ఒకే ఎంపీటీసీ ఉండేవారు, కాలక్రమం జనాభా పెరగడంతో రెండు గ్రామాలు విడిపోయి సర్పంచ్, ఎంపీటీసీ విడివిడిగా జరుగుతున్నాయి. స్వాతంత్ర అనంతరం జరిగిన ఎన్నికల సమయం నుండి ఇప్పటి వరకు ఉన్నత వర్గాలు, బీసీ లకు అవకాశం వచ్చిందే తప్ప దళిత వర్గానికి ఒక్కసారి కూడా రాలేదు. ఈ గ్రామంలో సుమారు 80 వరకు కుటుంబాలు, 500 వందలకు పైగా ఓట్లు ఉన్నప్పటికీ రిజర్వేషన్లు అనుకూలించక రాజకీయ పరంగా ఇప్పటికీ ప్రజాప్రతినిధులు కాలేక ఓటర్లుగానే మిగిలిపోతున్నారు. ముస్త్యాల గ్రామ సర్పంచులుగా ఇప్పటి వరకు పోటీ చేసిన వారి వివరాల ప్రకారం నర్ర వెంకటకృష్ణారెడ్డి (చిన్న దొర)1977- 1982, ఎర్రం పుల్లయ్య సేటు(వీరన్నపేట) 1982-1987, నర్రా మధుసూదన్ రెడ్డి 1987-1992, కల్వ రెడ్డి1992-1997, చెరుకు నాగేశ్వర్ ముదిరాజ్ నరసింహారెడ్డి -1997-2002, నరసింహారెడ్డి 2002- 2007, కొంగరి వెంకటస్వామి2007- 2012 పద్మశాలి, పెడుతల ఎల్లారెడ్డి (2014-2024) సర్పంచులుగా కొనసాగారు. తాజాగా ప్రకటించిన రిజర్వేషన్ల ప్రకారం సర్పంచ్ పదవి బీసీ మహిళకు కేటాయించారు.

## జాతీయస్థాయిలో విద్యాపర్తిగా వెలుగొందనున్న వనపర్తి

- **వనపర్తికి కేంద్రీయ విద్యాలయం మంజూరు చేస్తూ కేంద్ర క్యాబినెట్ ఆమోదం**
- **ఫలించిన వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి కృషి**



**వనపర్తి బ్యూరో అక్టోబర్1 జనంసాక్షి** వనపర్తికి కేంద్రీయ విద్యాలయం మంజూరు చేస్తూ కేంద్ర క్యాబినెట్ ఆమోదం, తెలపడంతో స్పందించిన కేంద్ర ప్రభుత్వానికి, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఆది నుంచి విద్యాప్రతిగా పేరుందిన వనపర్తి నేడు జాతీయస్థాయిలోనూ గుర్తింపు పొందనుంది. వనపర్తి శాసనసభ్యులు అభ్యర్థనకు స్పందించిన కేంద్ర ప్రభుత్వం వనపర్తి జిల్లా కేంద్రానికి కేంద్రీయ విద్యాలయాన్ని మంజూరు చేస్తూ, నేడు క్యాబినెట్ ఆమోదం తెలపడం గర్వించదగిన విషయమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ సందర్భంగా కేంద్రీయ విద్యాలయం మంజూరికి సహకరించిన ఇన్చార్జి మంత్రి దామోదర రాజనర్సింహ , జిల్లా మంత్రి వాకిటి శ్రీహరి , జూపల్లి కృష్ణారావు నాగర్కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లురవి , జిల్లా కలెక్టర్ ఆదర్శసురభి కి ఎమ్మెల్యే ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# స్థానిక సంస్థల ఎన్నికలకు సహకరించాలి

- ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్
- రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశం




**ములుగు ప్రతినిధి, అక్టోబర్ 01(జనంసాక్షి) :** స్థానిక సంస్థల ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు తమ వంతు సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ కోరారు. బుధవారం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తన ఛాంబర్లో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ అంశాలపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను తూచా తప్పక పాటిస్తూ స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకున్నట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలతో పాటు, గ్రామ పంచాయతీ ఎన్నికలను రెండు విడతలలో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఎన్నికల షెడ్యూల్ వెలువడినందున రాజకీయ పార్టీలకు సంబంధించిన వాల్ రైటింగ్, ఫ్లెక్సీలు, హోర్డింగులు, ఫోటోలను ప్రభుత్వ కార్యాలయాల్లో 24 గంటల వ్యవధిలో, బస్ స్టాండ్, రైల్వే స్టేషన్, పెట్రోల్ బంక్ తదితర ప్రదేశాలలో 48 గంటల వ్యవధిలో, అనుమతి లేని ప్రైవేట్ స్థలాలలో 72 గంటల వ్యవధిలో పూర్తి స్థాయిలో తొలగించాలన్నారు. అక్టోబర్ 9 న నోటిఫికేషన్ వస్తుందని, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఫేజ్ - 1 ఎన్నికలకు సంబంధించి అక్టోబర్ 9 వ తేదీ నుండి 11 వ తేదీ వరకు ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్ల స్వీకరించడం జరుగుతుందని, అక్టోబర్ 23న మొదటి విడత పోలింగ్ జరుగుతుందని తెలిపారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఫేజ్ - 2 ఎన్నికలకు సంబంధించి అక్టోబర్ 13వ తేదీ నుండి 15వ తేదీ వరకు ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్ల స్వీకరించడం జరుగుతుందని, అక్టోబర్ 27 న రెండవ విడత పోలింగ్ జరుగుతుందని తెలిపారు. నవంబర్ 11న ఓట్ల లెక్కింపు నిర్వహించబడుతుందని అన్నారు. ములుగు జిల్లా నందు గ్రామ పంచాయతీ ఫేజ్-2 ఎన్నికలకు సంబంధించి అక్టోబర్ 21వ తేదీ నుండి 23వ తేదీ వరకు ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లు స్వీకరించడం జరుగుతుందని, నవంబర్ 4న మొదటి పోలింగ్ జరుగుతుందని తెలిపారు. గ్రామ పంచాయతీ ఫేజ్-3 ఎన్నికలకు సంబంధించి అక్టోబర్ 25వ తేదీ నుండి 27వ తేదీ వరకు ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్ల స్వీకరించడం జరుగుతుందని వివరించారు. నవంబర్ 8న రెండవ విడత పోలింగ్ జరుగుతుందని తెలిపారు. మొదటి, రెండవ విడతలలోనూ ఉదయం 7.00 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంట వరకు పోలింగ్ జరుగుతుందని, అనంతరం పోలింగ్ రోజునే మధ్యాహ్నం 2.00 గంటల నుండి కౌంటింగ్ జరిపి ఫలితాలు వెల్లడించడం జరుగుతుందని వివరించారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు పూర్తి సహకారం అందించాలని కోరారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, డిఎస్పీ రవీందర్, డీపీఓ దేవ్ రాజ్, రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# 20వ రోజు ఖాళీ ప్లేట్లతో నిరసన

- కొనసాగుతున్న డైలీవేజ్ వర్కర్ల సమ్మె
- దసరా పండుగకు పస్తుల్లో కార్మిక కుటుంబాలు
- హాస్టల్ వర్కర్స్ యూనియన్ తో వెంటనే చర్చలు జరపాలి : సీఐటీయూ

**ఏటూరునాగారం, అక్టోబర్ 01(జనంసాక్షి) :** గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని హాస్టల్స్, ఆశ్రమ పాఠశాల లో డైలీ వైజ్ వర్కర్లుగా పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని చేస్తున్న నిరవధిక సమ్మె 20 వ రోజు ఖాళీ ప్లేట్లతో ఐటిడిఏ ముందు నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శిలు ఎండీ దావూద్, రత్నం రాజేందర్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో పనిచేస్తున్న వర్కర్లు గత 20 రోజులుగా సమ్మె చేస్తుంటే సమస్య పరిష్కారం చేయకుండా నిర్లక్ష్యం చేయడం తగదని వెంటనే వారి యొక్క ప్రధానమైన డిమాండ్ల పరిష్కారం కోసం ప్రభుత్వం యూనియన్ నాయకులతో చర్చలు జరపాలి అని అన్నారు. ఒకపక్క గత ఎనిమిది నెలల నుంచి జీతాలు లేక కుటుంబం గడవలేక తీవ్రమైన ఇబ్బంది పడతా ఉంటే మరోపక్క వస్తున్న వేతనాలను తగ్గిస్తూ జీవో నెంబర్ 64ను తీసుకురావడం దుర్మార్గం అని ఆ జీవో వలన గత సంవత్సరం నుంచి ఇప్పటివరకు ఒక్కొక్కరికి 45 వేల రూపాయలు వేతనాలు తక్కువ అయ్యాయని, తగ్గించిన జీతాలు తెచ్చిన జీవోను రద్దు చేస్తూ పాత పద్ధతిలో వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అర్హులైన అందరికీ టైం స్కేల్ అమలు అయ్యేటట్టుగా ప్రత్యేక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఔట్ సోర్సింగ్ చేసే ఆలోచన విరమించుకోవాలని అన్నారు. ప్రస్తుతం పేరుగుతున్న ధరలకు అనుగుణంగా జీతాలు పెరగాలే తప్ప వస్తున్న వేతనాలని తగ్గిస్తూ జీవోలు తీసుకురావడం దుర్మార్గమని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఎనిమిది నెలల నుండి వేతనాలు లేక దసరా పండుగలో కుటుం బం ఆనందంగా ఉండాల్సిన సందర్భంలో దుఃఖంతో కుటుంబం అంతా బాధతో పండగ చేయలేని పరిస్థితిలో ఉందని వారి ఆవేదనలను అర్థం చేసుకోవాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిటమట రమేష్, వర్కర్ల ఎం నాగలక్ష్మి, భాగ్యలక్ష్మి, జయలక్ష్మి, సమ్మక్క, విజయ లక్ష్మి, రాజు, నందం, సమ్మయ్య, సూర్యతేజ, ఇందిరా, సుమలత, సాంబయ్య, శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ సత్తా చాటాలి

- మోసకారి కాంగ్రెస్ ప్రభుత్వానికి ఈ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలి
- కలిసికట్టుగా పనిచేస్తే విజయం తథ్యం
- జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు



**ఏటూరునాగారం, అక్టోబర్ 01(జనంసాక్షి) :** బిఆర్ఎస్ మండల పార్టీ ఆధ్వర్యంలో స్థానిక ఎన్నికల సన్నాహక సమావేశంలో ముఖ్య అతిధిగా హాజరైన బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు. ఈ సందర్బంగా మాట్లాడుతూ స్థానిక ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ సత్తా చాటాలని అన్నారు. ఆరు గ్యారంటీలతో, 420 హామీలతో ప్రజలను నట్టేట ముంచింది ఈ కాంగ్రెస్, అమలు కాని హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను, మహిళలను, నిరుద్యోగులను, సబ్బండ వర్గాలను మోసం చేసింది. స్థానిక ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు ఐకమత్యంగా పని చేసి ఏకాభిప్రాయంతో అభ్యర్థులను ఎన్నుకోవాలని అన్నారు. ప్రజలకు రేవంత్ చేస్తున్న మోసలను అమలుగాని హామీలను ఇచ్చి మోసగించిన విధానాన్ని అర్థమయ్యేలా వివరించాలని అన్నారు. అధికారం సాధించాలని గ్రామాల్లో కులమతాల మధ్య చిచ్చు పెడుతూ అభ్యర్థులను భయపెడుతూ బెదిరింపులకు పాల్పడుతున్నారని వారి బెదిరింపులకు భయపడొద్దని అండగా ఉంటానని ఎంతకైనా వెనుకాడభోమని పార్టీ శ్రేణులు ధైర్యంగా ముందడుగు వేయాలని ప్రజలు అన్నీ గమనిస్తున్నారు. ప్రజలు కెసిఆర్ పాలనను కోరుకుంటున్నారని రాభోయే రోజుల్లో కెసిఆర్ పాలన రావాలంటే స్థానిక ఎన్నికలే అందుకు పునాదులు వేయాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ పట్ల ప్రజలు తీవ్ర వ్యతిరేకంగా ఉన్నారని ఎన్నికలు ఏవైనా బిఆర్ఎస్ పార్టీకి బ్రహ్మరథం పట్టడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మలుగు జిల్లా మండల పార్టీ అధ్యక్షులు, మాజీ ప్రజా ప్రతినిధులు, మహిళలు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మెరుగైన వైద్య సేవలు అందించాలి

- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల ప్రతినిధి, అక్టోబర్ 1 (జనంసాక్షి) :** వైద్య రంగాన్ని బలోపేతం చేస్తూ ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ప్రజా సంక్షేమం కొరకు పూర్తిస్థాయి ఏర్పాట్లు చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం మంచిర్యాల జిల్లాలోని భీమారం మండల కేంద్రంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి వార్డులు, రిజిస్టర్లు, మందుల నిల్వలు, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని తెలిపారు. వైద్య రంగాన్ని బలోపేతం చేస్తూ ప్రభుత్వం అన్ని ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో అన్ని సదుపాయాలు కల్పించి మెరుగైన వైద్య సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు. సీజనల్ వ్యాధుల వ్యాప్తిని నియంత్రించే విధంగా పాటించవలసిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. వైద్యులు, సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటిస్తూ ఎల్లవేళలా అందుబాటులో ఉండి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని తెలిపారు. అనంతరం మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి కొనసాగుతున్న అదనపు గదుల నిర్మాణ పనులను పరిశీలించారు. విద్యారంగ అభివృద్ధి దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, అన్ని ప్రభుత్వ పాఠశాలలో త్రాగునీరు, విద్యుత్, మూత్రశాలలు, ప్రహరీ గోడ ఇతర సదుపాయాలను కల్పించి నాణ్యమైన విద్యను అందించడం జరుగుతుందని తెలిపారు. అదనపు గదుల నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రధాన కాలువలో పడి వ్యక్తి గల్లంతు



**దస్తూరాబాద్, అక్టోబరు 1 (జనంసాక్షి) :** కడెం ప్రధాన కాలువలో పడి వ్యక్తి గల్లంతైన ఘటన మండల కేంద్రంలోని రేవోజీపేట్ గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై సాయి కుమార్ తెలిపిన వివరాలు ప్రకారం గ్రామానికి చెందిన మైదం సురేందర్ (45) బుధవారం ఉదయం సుమారు 10 గంటల సమయంలో కడం ఎడమ ప్రధాన కాలువలో ప్రమాదవశాత్తు నీటిలో మునిగి తప్పిపోయాడు. సురేందర్ మునిగిపోతున్నదాన్ని గమనించిన గ్రామస్తులు వెంటనే కాలువలోకి దూకి రక్షించేందుకు ప్రయత్నించినా విఫలమయ్యారు. ఈ ఘటనతో గ్రామంలో కలకలం రేగింది. తప్పిపోయిన సురేందర్ భార్య కళావతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. స్థానికులు సహా రెస్క్యూ సిబ్బంది కెనాల్‌లో అన్వేషణ కొనసాగిస్తున్నారు.

# ఓటు చోర్‌కు వ్యతిరేకంగా మంచిర్యాలలో లక్షా 50 వేల సంతకాల సేకరణ

- డీసీసీ అధ్యక్షురాలు సురేఖ ప్రేమ సాగర్ రావు



**మంచిర్యాల ప్రతినిధి అక్టోబర్ 1 (జనంసాక్షి) :** కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ చేపట్టిన ఓటు చోర్ కార్యక్రమంలో భాగంగా మంచిర్యాల నియోజకవర్గంలో దాదాపు 1.5 లక్షల సంతకాల సేకరణ చేస్తామని డిసిసి అధ్యక్షురాలు సురేఖ ప్రేమ సాగర్ రావు చెప్పారు. మంచిర్యాల పట్టణంలోని ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు నివాసంలో ఏర్పాటుచేసిన ప్రాతికేయుల సమావేశంలో డిసిసి అధ్యక్షురాలు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం కీ,,శే కొక్కిరాల రఘుపతి రావు చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు మంచిర్యాల నియోజకవర్గంలో ఉన్న ఆడపడుచులందరికీ బతుకమ్మ పండుగకు చీరాలు ఇవ్వడం జరిగిందని, కానీ ఈ సంవత్సరం ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు అనారోగ్యానికి గురి కావడంతో బతుకమ్మ పండుగకు ఇచ్చే చీరాలు నవంబర్ నెలలో 27తేదీ తర్వాత ఇస్తామని చెప్పారు.. కావున మంచిర్యాల నియోజకవర్గం ఆడపడుచులందరూ సహకరించాలని కోరారు. అనంతరం మంచిర్యాల జిల్లా ప్రజలందరికీ విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు.. ఈ కార్యక్రమంలో తాజా మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, మహిళా నాయకురాలు, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




# శ్రీరాంపూర్ ఏరియా సింగరేణి గనుల బొగ్గు ఉత్పత్తి 65శాతం

**శ్రీరాంపూర్ (జనంసాక్షి) :** ఏరియా బొగ్గు గనులు సెప్టెంబర్ నెలలో 65శాతం ఉత్పత్తి సాధించాయని ఏరియా సింగరేణి జిఎం శ్రీనివాస్ తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలియజేశారు. ఈ సందర్భంగా జిఎం మాట్లాడుతూ సెప్టెంబర్ నెలలో భూగర్భ గనుల బొగ్గు ఉత్పత్తి లక్ష్య 22వేల టన్నులకు గాను లక్ష్య 12వేల టన్నుల ఉత్పత్తితో 92శాతం, ఉపరితల గనులు 3లక్ష్యల 55వేల టన్నులకు లక్ష్య 97వేల టన్నులతో 56శాతం ఉత్పత్తి సాధించాయన్నారు. ఏరియా ఉపరితల గనులలో 18శాతం ఓబీ వెలికితీయడం జరిగిందని, రోడ్, రైలు ద్వారా 3లక్ష్యల 19వేల టన్నుల బొగ్గు రవాణా జరిగిందని తెలిపారు. అధిక వర్షపాతం వల్ల సెప్టెంబర్ నెలలో ఉపరితల గనులలో అనుకున్నదానికంటే ఉత్పత్తి శాతం తగ్గిందన్నారు. ఈ కార్యక్రమంలో డీజీఎం పర్సనల్ అనిల్ కుమార్, డివై పిఎం దేవేందర్ రెడ్డి ,సీనియర్ పిఓ పి.కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

# నవరాత్రి నిమజ్జన ఉత్సవాలకు పటిష్ట బందోబస్తు

- 9 సెక్టార్లు,4 క్లస్టర్లతో పోలీసు నిఘా
- ఉత్సవాలలో డీజేలకు అనుమతులు లేవు
- ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్




**ఆదిలాబాద్ ప్రతినిధి (జనంసాక్షి) :** నవరాత్రి నిమజ్జన ఉత్సవాలకు పటిష్ఠ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అనారు. శనివారం స్థానిక ఆదిలాబాద్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల లో ఏర్పాటు చేసిన బ్రీఫింగ్ కార్యక్రమంలో పాల్గొని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ పోలీసు సిబ్బందికి పలు సూచనలు చేశారు. మొదటగా జిల్లా ప్రజలందరికీ పోలీసు సిబ్బందికి రేపటి దసరా శుభాకాంక్షలు తెలియజేస్తూ, దసరా ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో శాంతిభద్రతలకు భంగం కలగకుండా భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని సూచించారు. శనివారం నిర్వహించే దుర్గా నవరాత్రి నిమర్జన ఉత్సవాలలో పటిష్టమైన పోలీసు బందోబస్తును ఏర్పాటు చేయడం జరిగిందని. ఆదిలాబాద్ వన్ టౌన్, టూ టౌన్, మావల పోలీస్ స్టేషన్లో పరిధిలో దాదాపు 80 దుర్గా దేవి నిమజ్జన కార్యక్రమాలు జరగనున్నట్లు, 200 మంది సిబ్బందితో జిల్లా పోలీస్ యంత్రాంగం 9 సెక్టార్లు, నాలుగు క్లస్టర్ విభజించి సిఐ స్థాయి అధికారి పర్యవేక్షణలో పటిష్టమైన బందోబస్తు ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ముఖ్యంగా మహిళలకు సంబంధించిన ఉత్సవాలలో 30 మంది మహిళా పోలీసు సిబ్బందిచే, పటిష్టమైన షీ టీం బృందం చే బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగింది. మహిళలు ఎలాంటి అత్యవసర సమయంలోనైనా డయల్ 100 ద్వారా పోలీసు సహాయాన్ని పొందవచ్చును అని సూచించారు. ముఖ్యంగా నవరాత్రి నిమర్జనం ఉత్సవాలలో డీజే లకు అనుమతులు లేవని తెలిపారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ డిఎస్పి ఎల్ జీవన్ రెడ్డి,పోతారం శ్రీనివాస్, పట్టణ సిఐలు బి సునీల్ కుమార్, కె నాగరాజు, కె ఫణిదర్, ప్రేమ్ కుమార్, ప్రణయ్, కర్ర స్వామి, అంజమ్మ, పద్మ ఎస్ఐలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కాగజ్ నగర్‌లో ట్రాఫిక్ ఉల్లంఘనలు

- పట్టించుకోని అధికారులు



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా బ్యూరో అక్టోబర్ 1 (జనంసాక్షి) :** ట్రాఫిక్ ఇబ్బందులతో ప్రజలు ఇబ్బందుల పాలవుతున్నారు. రోడ్లు గుంతలుగా మారడం, మరమ్మతులకు నిధులు లేకపోవడం ప్రజల పాలిట శాపంగా మారింది. కొమరం భీం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ పట్టణంలో ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు తప్పడం లేదు. ఆదివారం కాగజ్ నగర్ మార్కెట్ (సంత) కావడంతో ఇబ్బందులు మరింత అధికమ య్యాయి. ఆరోజు మధ్యాహ్నం 12 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు ప్రజలు ఎక్కువ అంగడి (సంత) కు వస్తువులు, కూరగాయలు ఇలా అనేక అవసరాల కోసం కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలోని పలు మండలాలకు చెందిన గ్రామాల నుంచి ప్రజలు కాగజ్ నగర్ కు వస్తుంటారు. కాగజ్ నగర్ పట్టణంలో రోడ్లు వెడల్పుగా లేకపోవడం, మధ్యలో మహా నాయకుల అంబేద్కర్, రాజీవ్ గాంధీ, పొట్టి శ్రీరాములు, తెలంగాణ తల్లి విగ్రహాలు ఉండడంతో భారీ వాహనాలు లారీలు, ట్రక్కులు, బస్సులు తిరుగలేని పరిస్థితి దాపురించింది. ప్రజా పాలకులు, అధికారులు ప్రజల కష్టాలు తీర్చడంలో విఫలం అవుతున్నారనే బహిరంగ విమర్శలు వ్యక్తం అవు తున్నాయి. ప్రభుత్వం నుంచి నిధులు రాకపోవడం వల్ల కనీసం రోడ్లకు మరమ్మ తులు చేయడం లేదని మున్సిపల్ అధికారులు పేర్కొంటున్నారు. ఈ విషయంలో గత శాసనసభ సమావేశంలో సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు నిధులు రాక సిర్పూర్ నియోజక వర్గంలో అభివృద్ధి పూర్తిగా కుంటు పడిందని శాసనసభ సాక్షిగా ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా కాగజ్ నగర్ పట్టణంలో పోలీస్ అధికారులు సైతం ట్రాఫిక్ ను క్రమబద్ధీకరించడంలో విఫలం చెందుతున్నారనే విమర్శలు వ్యక్తమవు తున్నాయి. తూతు మంత్రంగా ట్రాఫిక్ పోలీసులు విధులు నిర్వహిస్తున్నారని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఉన్న తాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో తమకేంటి అన్న చందంగా కిందిస్థాయి పోలీస్ సిబ్బంది వ్యవహరిస్తున్నారు. ఆటోలు, ద్విచక్ర వాహదారులు ఇష్ట రాజ్యాంగ రోడ్లపైనే పార్కింగ్ చేస్తూ ట్రాఫిక్ నిబంధనలను యధేచ్ఛగా ఉల్లంఘిస్తున్నారని పలువురు బాహాటం గానే ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఆదివారం సంత కావడంతో రోడ్లపైనే కూరగాయల వ్యాపారులు, అల్లం వెల్లుల్లి , పండ్ల వ్యాపారులు తోపుడు బండ్లను రోడ్లపైనే పెట్టుకొని విక్రయాలు చేస్తుండడంతో ట్రాఫిక్ సమస్య మరింత ఇబ్బంది మారింది. కొన్నిసార్లు వాహనాలు ఎదురెదురుగా రావడంతో ప్రమాదాల సైతం జరుగుతున్నాయి. ఒక్కోసారి వాహనాలకు వెళ్లేందుకు దారి లేకపోవడంతో గొడవలు సైతం చోటు చేసుకుం టున్నాయి. మరి ఇప్పటికైనా ప్రజా పాలకులు, పోలీస్, మున్సిపల్ అధికారులు సంయుక్తంగా చర్యలు తీసుకొని ప్రజల ట్రాఫిక్ కష్టాలను తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.



# ఎన్నికలపై దృష్టి సారించాలి

**కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశం**

**హాజరైన పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు**

**ఆళ్లపల్లి మండల అక్టోబర్ 1 (జనంసాక్షి)**
కాంగ్రెస్ పార్టీ స్థానిక సంస్థల ఎన్నికల కోసం జడ్పిటిసి ఎంపిటిసి సర్పంచి వార్డు నెంబర్ విషయాలపై హాజరై ఈ సందర్భంగా పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ముఖ్య కార్యకర్త సమావేశం చేసి కార్యక్రమాన్ని కాంగ్రెస్ మండల అధ్యక్షులు పాయం రామ నర్సయ్య ప్రారంభించడం జరిగిందన్నారు జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎంత అధిక సంఖ్యలో స్థానాలు కైవసం చేసుకోవాలని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అమలు చేసిన పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు మండల నాయకులు కార్యకర్తలు జరగబోయే ఎన్నికలపై దృష్టి సారించాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమానికి మాజీ ఎంపీపీ సమ్మయ్య పాపారావు,ప్రచార కమిటీ శ్రీకాంత్ నరేడ్ల వెంకన్న%ం% శ్రీనివాస్,ఎండి హాతార్,బుర్ర వెంకన్న,ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు శ్రీనివాస్,యూత్ అధ్యక్షులు వాసం శ్రీనాథ్, వసంతరావు,భాస్కర్,ఎస్టీ సెల్ మోకాల శేఖర్,గలిగ సమ్మక్క, ముఖ్య నాయకులు,అనుబంధాల సంఘం నాయకులు,పాల్గొనడం జరిగింది.

# దసరా సందర్భంగా ఏర్పాట్లు పూర్తి

**హాలియా మున్సిపాలిటీ ప్రజలకు దసరా శుభాకాంక్షలు**

**కమిషనర్ ఎం.రామదుర్గారెడ్డి**



**హాలియా, అక్టోబర్ 1 జనంసాక్షి :**
హాలియా మున్సిపాలిటీ ప్రజలకు కమిషనర్ ఎం.రామదుర్గారెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. స్థానికంగా బుధవారం ఆయన మాట్లాడుతూ దసరా పండుగ సందర్భంగా భక్తుల సౌలభ్యం కొరకు ప్రత్యేక ఏర్పాట్లు చేశామని.. ముఖ్యంగా జమ్మి చెట్టు దర్శనం కోసం రెండు ప్రదేశాలలో ప్రత్యేక వేదికలు ఏర్పాటు చేయబడ్డాయని.. అనుముల గ్రామంలోని ఆంజనేయస్వామి గుడి దగ్గర, హాలియాలోని ఆదిత్య హాస్పిటల్ వద్ద ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. భక్తులు సౌకర్యవంతంగా దర్శనం చేసుకోగలిగే విధంగా మున్సిపాలిటీ అధికారులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారని... శుభ్రత, తాగునీరు, విద్యుత్ వెలుగులు, పార్కింగ్ సదుపాయాలు వంటి ఏర్పాట్లను పూర్తి చేసినట్లు తెలిపారు. హాలియా మున్సిపాలిటీ ప్రజలందరూ ఈ దసరా పండుగను ఆనందంగా, ఉత్సాహంగా జరుపుకోవాలని, జమ్మి చెట్టు దర్శనం చేసుకొని సౌభాగ్యం, ఆయురారోగ్యాలు, అభివృద్ధి కలగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని తెలిపారు.

# విజయానికి ప్రతీకగా విజయదశమి

**గుర్రంపోడు మండల ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు**

**బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు పాశం గోపాల్ రెడ్డి**



**గుర్రంపోడు:అక్టోబర్ 01(జనంసాక్షి )**
గుర్రంపోడు మండల ప్రజలకు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు పాశం గోపాల్ రెడ్డి విజయదశమి పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా విజయదశమి పర్వదినాన్ని ప్రజలందరూ జరుపుకుంటారని అన్నారు.గత సంవత్సరం అంతా జరిగిన అవరోధాలు ఏవైనా ఉంటే ఈ విజయదశమి పర్వదినం నుండి వాటిని అధిగమించి వారు ప్రారంభించిన పనులలో అన్ని విజయాలే ఉండే విధంగా ప్రజలందరూ నడుచుకోవాలని, గుర్రంపోడు మండల వ్యాప్తంగా ఉన్న రైతులు,వ్యాపారులు, ప్రజలు అందరూ ఈ విజయదశమి పర్వదినం నుండి సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో విరాజిల్లి గ్రామాలు పాడిపంటలతో తులతూగాలని పేర్కొన్నారు.

# ప్రజలకు దసరా పండుగ శుభాకాంక్షలు

**నాగార్జున సాగర్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్**



**హాలియా, అక్టోబర్ 1 జనంసాక్షి :** విజయదశమి సందర్భంగా నియోజకవర్గ ప్రజలకు నాగార్జున సాగర్ మాజీ శాసన సభ్యులు నోముల భగత్ శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి సాధించిన విజయానికి చిహ్నంగా దసరా పండుగను విజయదశమి పేరుతో దేశవ్యాప్తంగా జరుపుకుంటు న్నామని.. శమిపూజ చేసి జమ్మి ఆకును బంగారంగా భావించి అలాయ్ బలాయ్ తీసుకోవడం, పెద్దల ఆశీర్వాదం తీసుకోవడం, శుభసూచకంగా భావించే పాలపిట్టను దర్శించుకోవడం తెలంగాణకు ప్రత్యేకమని భగత్ వివరించారు. సుఖసంతోషాలతో ప్రజలందరు ప్రజలందరు దసరా పండుగ ఘనంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.

## నియోజకవర్గ ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు

**నాగార్జున సాగర్ శాసన సభ్యులు కుందూరు జయవీర్ రెడ్డి**



**హాలియా, అక్టోబర్ 1 జనంసాక్షి**
నాగార్జున సాగర్ నియోజకవర్గ ప్రజలకు శాసన సభ్యులు కుందూరు జయవీర్ రెడ్డి విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. స్థానికంగా బుధవారం ఆయన మాట్లాడుతూ కష్టాల కడలి నుంచి విజయానికి నాంది పలికే పండగే విజయదశమి అని అన్నారు. మనం పూజించే ప్రతి దేవుడు విజయం సాధించిన రోజు విజయదశమని అన్నారు. మనందరి జీవితాల్లో విజయాలు రావాలని, ప్రతి ఇల్లు సుఖసంతోషాలతో ఉండాలని ఆయన కోరారు.

# గంజాయి మత్తుకు బానిసైన ఇద్దరు యువకుల అరెస్ట్

**110 గ్రాముల గంజాయి ఒక స్కూటీ రెండు సెల్ ఫోన్లు స్వాధీనం**



**మిర్యాలగూడ అక్టోబర్ 1 ( జనంసాక్షి)**
అక్రమ నిషేధిత గంజాయికి బానిసైన ఇద్దరు యువకులను పట్టుకొని అరెస్టు చేసి రిమాండ్కు పంపినట్లు మిర్యాలగూడ టూ టౌన్ సిఐ సోమ నరసయ్య తెలిపారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏలూరుకు చెందిన దివాకర్ని శ్రీనివాస్ పవన్ కుమార్ మిర్యాలగూడలో ప్రైవేట్ ఆసుపత్రిలో వైద్యుడిగా పని చేస్తున్నాడు. మరొక నిందితుడు కనకదండి హరిత భరద్వాజులు మిర్యాలగూడలోని ఓ ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలో పనిచేస్తున్నాడు. వీరిద్దరూ అక్రమంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి గంజాయిని కొనుగోలు చేసి మిర్యాలగూడ నిర్మానుష ప్రాంతంలో గంజాయిని గత కొంతకాలంగా సేవిస్తున్నారని సమాచారం తమకు అందినదన్నారు. ఈ క్రమంలో వారిపై నిఘా ఉంచి తమ పోలీస్ సిబ్బంది ద్వారా చాకచక్యంగా గంజాయిని సేవిస్తున్న సమయంలో పట్టుబడి చేసినట్లుగా తెలిపారు. బస్టాండు సమీపంలో తమ పోలీస్ సిబ్బంది వాహన తనిఖీలు చేస్తుండగా అదే సమయంలో శ్రీనివాస్ పవన్ కుమార్, భరద్వాజలు గంజాయిని సేవించడం కోసం బస్టాండ్ సమీపం నుండి హనుమాన్ పేట బైపాస్ రోడ్డు వైపుకు స్కూటీ పై వెళుతుండగా అనుమానాస్పదంతో వారిని ఆపి తనిఖీ చేయగా అసలు విషయాన్ని తెలియజేశారన్నారు. వారి వద్ద నుండి 110 గ్రాముల గంజాయితోపాటు ఒక స్కూటీ, రెండు సెల్ఫోన్లను స్వాధీనం చేసుకొని రిమాండ్కు పంపినట్లు తెలిపారు. జిల్లా ఎస్పీ శరత్చంద్ర పవర్ ఆదేశాల మేరకు డిఎస్పి రాజశేఖర్ రాజు పర్యవేక్షణలో ఈ కేసును చేదించినట్లు ఆయన తెలిపారు. ఇది కేసును చేదించిన ఎస్సై రాంబాబు, ఏఎస్ఐ చంద్రయ్య%ఓ% అక్బర్ బాషా, రామకృష్ణ, లక్ష్మయ్య, రాజశేఖర్, రాంజీలను డిఎస్పి రాజశేఖర్ రాజు అభినందించినట్లుగా ఆయన తెలిపారు.

# చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక దసరా

**మాజీ మంత్రి సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి**



**సూర్యాపేట ప్రతినిధి (జనంసాక్షి):**
చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక దసరా పండుగ అని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి అన్నారు.అందరిలో చెడు తొలిగి మంచి ఆలోచనలతో ముందుకు సాగాలన్నారు.శమిపూజ చేసి జమ్మి ఆకును బంగారంగా స్వీకరించే గొప్ప సంస్కృతి మనదన్నారు. పాలపిట్ట, జమ్మి చెట్టును రాష్ట్ర చిహ్నాలుగా గుర్తించిన ఘనత కేసీఆర్ దే అని పేర్కొన్నారు.దసరా వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలని కోరారు.ఈ విజయదశమి అందరికీ విజయాలు చేకూర్చాలని ఆకాంక్షించారు. ప్రజలందరికీ దసరా శుభాకాంక్షలు తెలిపారు.

# ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు సహకరించాలి

**కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**



**సూర్యాపేట ప్రతినిధి (జనంసాక్షి):**
రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లాలో జడ్పిటిసి, ఎంపిటిసి, సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు.బుధవారం కలెక్టరేట్ లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు.ఎన్నికల షెడ్యూల్, అభ్యర్థులు ఎన్నికలలో ఉపయోగించే వాహనాలు,మైక్ లు, భోజనాలు, ఫ్లెక్సీ, లేబర్ చార్జీలు, కరపత్రాలు, పోస్టర్లు,ఎల్ఈడి స్క్రీన్ లు తదితర అంశాలకు చెందిన వస్తువుల ధరల వివరాలు రాజకీయ పార్టీ నాయకులకు వివరించారు.జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన వెంటనే ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులోకి వచ్చిందని తెలిపారు.మున్సిపాలిటీలలో ఎన్నికల కోడ్ అమలులో లేదని తెలిపారు.ఎన్నికలు జరిగే ప్రాంతాలలో కొత్తగా ఎటువంటి పథకాల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు, గ్రౌండింగ్ వంటివి ఉండవని తెలిపారు. సోషల్ మీడియాలో ఎన్నికల ప్రచారాన్ని, అసత్య ప్రచారాన్ని ప్రసారం చేస్తే తగు చర్యలు తీసుకోబడుతుందని తెలిపారు.గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా శాంతి భద్రతల విషయంలో అందరు సహకరించి ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించేలా చూడాలని తెలిపారు.ఎన్నికలు జరిగే ప్రాంతాలలో రాజకీయ పార్టీల మీటింగులు,ర్యాలీల కొరకు అనుమతులు తీసుకోవాలని, ర్యాలీలను ఎఫ్ఎస్టి, ఎస్ఎస్టి బృందాలు వీడియో రికార్డులు చేస్తారని,అభ్యర్థులు తమ ఖర్చులను ఎన్నికల కమిషన్ కు సమర్పించాలని తెలిపారు.సభలలో రెచ్చగొట్టే ప్రసంగాలు చేయరాదని, సోషల్ మీడియాలో అసత్య వార్తలు ప్రసారం చేయరాదని సంబంధిత రాజకీయ పార్టీ నాయకులకు తెలిపారు.ఎవరికైనా ఎలక్షన్ పై సందేహాలున్న, పిర్యాదు చేయాలనుకున్న కలెక్టర్ లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తామని,అక్కడ పిర్యాదు చేస్తే విచారించి సమస్యను పరిష్కరించటం జరుగుతుందని అన్నారు. ఈ సమావేశంలోఅదనపు కలెక్టర్ సీతారామారావు,జడ్పీ సీఈఓ వివి అప్పారావు, జిల్లా పంచాయతీ అధికారి యాదగిరి, వివిధ పార్టీల నాయకులు రాజేశ్వరరావు, బడుగుల లింగయ్య యాదవ్, నిమ్మల శ్రీనివాస్ గౌడ్,ఎండి అబీద్,కోట గోపి, స్టాలిన్,బెజవాడ వెంకటేశ్వర్లు, బూర వెంకటేశ్వర్లు,జడ్పీ డిప్యూటీ సిఈఓ శిరీష, డిఎల్పిఓ నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# కోటమైసమ్మ జాతరకు ట్రాఫిక్ మళ్లింపు

**నిబంధనలు అతిక్రమిస్తే జరిమానా**

**- రూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి**

**కారేపల్లి, అక్టోబర్01(జనంసాక్షి) :**
దసరా సందర్భంగా ఉసిరికాయలపల్లి కోటమైసమ్మ తల్లి ఆలయం వద్ద పెద్ద ఎత్తున జరిగే జాతర కు వెళ్ళే వారికి ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా ట్రాఫిక్‌ను మళ్లిస్తున్నట్లు ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖమ్మరా ఇల్లందు వెళ్లే సాదారణ ప్రజల వాహనాలు కారేపల్లి క్రాస్ రోడ్, గాంధీనగర్, సీతారాంపురం మీదుగా వెళ్ళాలని, ఇల్లందు ఖమ్మం వెళ్ళు ప్రయాణికులు లలితాపురం, గాంధీనగర్, కారేపల్లి క్రాస్, కామేపల్లి మీదుగా ఖమ్మం వెళ్లాలని సూచించారు. కారేపల్లి, ఇల్లందు నుంచి జాతరకు వచ్చే వాహనదారులు పోలంపల్లి క్రాస్ రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన సోలార్ ప్లాంట్ పార్కింగ్ వద్ద లారీలు, ట్రాక్టర్లు, బస్సులు, కార్లను పార్కింగ్ చేసుకోవాలన్నారు. గాదెపాడు, గాంధీనగర్, సీతారాంపురం నుండి వచ్చే భక్తులు ఇల్లందు మీదుగా పోలంపల్లి పార్కింగ్ స్థలానికి చేరుకొని వాహనాలను పార్కింగ్ చేసుకోవాలన్నారు. ఆటోల పార్కింగ్ కోసం పోలంపల్లి క్రాస్ రోడ్డు వద్ద పార్కింగ్ ను కేటాయించడం జరిగింది. ఉసిరికాయలపల్లి ప్రవేశద్వారం వద్ద ద్విచక్రవాహనాలకు పార్కింగ్ స్థలం కేటాయించబడిందన్నారు. భక్తులు పార్కింగ్ ప్రాంతం నుంచి తిరుగు ప్రయాణంలో పోలంపల్లి(దుబ్బాతండా) మట్టి రోడ్డు మీదిగా ఇల్లందు చుట్టుప్రక్కల గ్రామాలకు, పోలంపల్లి మీదుగా భాగ్యనగర్ తండా, పేరుపల్లి, గుంపెళ్లగూడెం, మాదారం, గార్ల తదితర గ్రామాలకు చేరుకోవచ్చాన్నారు. జాతరకు వచ్చు భక్తులు తమ వాహనాలను నిర్ధేశించి పార్కింగ్ ప్రదేశాలలో మాత్రమే ఉంచాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే రూ1000 జరిమాన విధించటం జరుగుతుందని తెలిపారు. జాతరకు వచ్చే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకోని ట్రాఫిక్ అంతరాయం లేకుండా సజావుగా కొనసాగేందుకు ప్రతిఒక్కరూ పోలీసులకు సహకారించాలని కోరారు.

# ఘనంగా ఏలూరి శ్రీనివాసరావు జన్మదిన వేడుకలు

- **సేవాభావంతో ఆసుపత్రి పేషెంట్లకు బ్రెడ్, పండ్ల పంపిణీ**





**ఖమ్మం, (జనం సాక్షి):**
టీజీవో రాష్ట్ర అధ్యక్షులు, టిజీఈజేఏసీ రాష్ట్ర (జాయింట్ యాక్షన్ కమిటీ) సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు జన్మదిన వేడుకలు ఖమ్మం జిల్లా టీఎన్‌జీవోస్ కమిటీ, ఖమ్మం గవర్నమెంట్ జనరల్ ఆసుపత్రి టిఎన్జీవోస్ కమిటీ ఆధ్వర్యంలో అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఖమ్మం ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న రోగులకు టీఎన్‌జీవో జిల్లా కమిటీ, హాస్పిటల్ కమిటీ సభ్యులు ఏలూరి శ్రీనివాసరావు చేతుల మీదుగా బ్రెడ్, తాజా పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం ఏలూరి సమాజ సేవా స్ఫూర్తిని, ఉద్యోగుల సంక్షేమం పట్ల ఆయన అంకితభావాన్ని మరోసారి ప్రతిబింబించింది.

**సేవలో అంకితం, పోరాటంలో అగ్రగామి**

ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తూ, ఉద్యోగుల హక్కుల కోసం అవిశ్రాంతంగా పోరాడుతున్న ఏలూరి శ్రీనివాసరావుని ఉద్యోగ సంఘాల నాయకులు హృదయపూర్వకంగా అభినందించారు. ఆయన నాయకత్వంలో టీజీజేఏసీ మరింత బలోపేతమై, ఉద్యోగుల సంక్షేమం కోసం అనేక విజయాలను సాధిస్తోందని పేర్కొన్నారు. ఏలూరి మరెన్నో ఉన్నత శిఖరాలను అధిరోహిం చి, ఉద్యోగుల సేవలో మరింత శ్రేష్ఠమైన కృషి చేయాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ ఆసుపత్రి లో కేక్ కట్ చేసి నిత్యం పేద ప్రజలకు అత్యుత్తమ సేవలు అందిస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది మధ్య ఆనందో త్సాలతో జన్మదినోత్సవ వేడుకలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీఓస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు గుంటుపల్లి శ్రీనివాసరావు, కార్యదర్శి కొణిదెన శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి జైపాల్, దుర్గా ప్రసాద్,లలిత కుమారి,పెద్దినేని రాధాకృష్ణ, ప్రభాకర చారి, ఆంజనేయులు, కోనార్, కోటపాటి రుక్మారావు, సుబ్బమ్మ, ముఖిద్, టీఎన్‌జీవో సభ్యులు, ఉద్యోగ సంఘాల నాయకులు, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా జరుగుతున్న శ్రీదేవి శరన్నవరాత్రి వేడుకలు

**కల్లూరు లో దేవీ నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొని అన్నదాన కార్యక్రమం ప్రారంభించిన మంత్రి తుమ్మల**



**కల్లూరు అక్టోబర్ 01(జనంసాక్షి)**
కల్లూరు పట్టణం లోశ్రీ వాసవి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దేవి నవరాత్రి వేడుకల మండపాన్ని,,పుల్లయ్య బంజారా రహదారి ప్రాంతంలో కులమతాలకు అతీతంగా దాతలు భక్తులు భారీగా అందించిన విరాళాలతో అంగరంగ వైభవంగా జరుగుతున్న శ్రీదేవి శరన్నవరాత్రి వేడుకల మండపాన్ని బుధవారం ముఖ్య అతిథిగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్, , కల్లూరు ఏఎంసీ చైర్మన్ భాగం నీరజాదేవి లతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద లకు ఉత్సవ నిర్వాహ కమిటీ చిత్తులూరి నరేష్ ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోత్సవములతో, మహిళలు పూలు చల్లుతూ సాంప్రదాయబద్ధంగా ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల ఎమ్మెల్యే రాగమయి, ఏఎంసీ చైర్మన్ నీరజ దేవి, పలువురు రాజకీయ ప్రముఖులు మహిషాసుర మర్ధిని అలంకరణలో కొలువై ఉన్న అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తీర్థ ప్రసాదములు స్వీకరించి పండితుల ఆశీర్వాదం తీసుకున్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే మట్టా రాగమయి శరన్నవరాత్రి ఉత్సవాల నిర్వాహకులకు భక్త బృందానికి ప్రజలందరికీ విజయదశమి, బతుకమ్మ పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. ఇదే తరుణంలో దేవినవరాత్రిఉత్సవ నిర్వాహక కమిటీ ఆధ్వర్యంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో పాటు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ ఏఎంసి చైర్మన్ భాగం నీ రజా దేవి లను పూలమాలలు శాలువాలతో ఘనంగా సత్కరించారు .అనంతరం వేలాదిమంది భక్తులు ప్రజల కోసం ఏర్పాటుచేసిన మహా అన్నదానకార్యక్రమాన్ని వ్యవసాయ మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కల్లూరు మున్సిపాలిటీ మేనేజర్ నంది శెట్టి నాగేశ్వరరావు, సీఐ ముత్తులింగయ్య, స్థానిక ఎస్సై దిద్దుకూరి హరిత శ్రీదేవి నవరాత్రి ఉత్సవాల నిర్వాహక కమిటీ సభ్యులు చిత్తులూరి నరేష్, వేముల శ్రీనివాస్, సముద్రాల పుల్లారావు, చారు గుండ్ల శ్రీలక్ష్మి, గౌరవరపు కనకదుర్గ, చారు గుండ్ల నాగశ్రీ, చారు గుండ్ల నగేష్ , గౌరవరపు పుల్లారావు, మామిడాల వెంకటేశ్వరరావు, రామకృష్ణ, శ్రీ వాసవి ఆర్యవైశ్య సంఘం దేవీ నవరాత్రి ఉత్సవాల నిర్వాహకులు చలువాది నగేష్ దోసపాటి శ్రీనివాసరావు, పసుమర్తి రాంబాబు, గంధం వీరబాబు, కాంగ్రెస్ పార్టీ నాయకులు దిరిశాల నరసింహారావు, తల్లపురెడ్డి అనిమిరెడ్డి. పైడి వెంకటేశ్వరరావు, పోట్రు సత్యం, లక్కినేని కృష్ణ, ఏనుగు సత్యంబాబు బొల్లం రామారావు, బొల్లం శంకర్ గౌడ్, బొల్లం వెంకటేశ్వరరావు, బొల్లం మీసాల కృష్ణ, బొల్లం శ్రీనివాసరావు, బొల్లం ఉపేంద్ర గౌడ్, , మాచ్చా వెంకటేశ్వరరావు, దేవరపల్లి వెంకటేశ్వరరావు, తూము వీరభద్రరావు, గణేషుల రవి, కళ్యాణపు వెంకటేశ్వరరావు, లక్కినేని రమేష్ పలువురుకాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు అభిమానులు పాల్గొన్నారు.




# లాభాల కళ..

## దేశపు తొలి ఏఐ కాల్ అసిస్టెంట్..




**న్యూఢిల్లీ:**గుర్తు తెలియని నంబర్ల నుంచి వచ్చే ఫోన్ కాల్స్‌కి సమాధానమిచ్చేలా భారతదేశపు తొలి ఏఐ కాల్ అసిస్టెంట్‌ను రూపొందించినట్లు హైదరాబాదీ అంకుర సంస్థ ఈక్వల్ వ్యవస్థాపకుడు, పారిశ్రామిక దిగ్గజం జీవీకే వారసుడు కేశవ రెడ్డి తెలిపారు. ఈక్వల్ ఏఐ అక్టోబర్ 2 నుంచి ఢిల్లీ-ఎన్‌సీఆర్ (నేషనల్ క్యాపిటల్ రీజియన్)లో అందుబాటులోకి వస్తుందని, దశలవారీగా దేశవ్యాప్తంగా ప్రవేశపెడతామని యన తెలిపారు. 2026 మధ్య నాటికి రోజుకు 10 లక్షల యాక్టివ్ యూజర్లను లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. గుర్తు తెలియని నంబర్లు, టెలీమార్కెటింగ్, డెలివరీ ఏజెంట్ల కాల్స్ మొదలైన వాటికి ఇది ఇంగ్లీష్, హిందీ, హింగ్లీష్ భాషల్లో సమాధానమివ్వగలదు. అవసరమైతే యూజర్ మధ్యలో కాల్‌ను టేకోవర్ చేయొచ్చు.

## స్టాక్ మార్కెట్లకు వీడిన వరుస నష్టాలు

**జనంసాక్షి:**దేశీయ స్టాక్‌మార్కెట్లను వరుస నష్టాలు వీడాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ద్రవ్య విధాన కమిటీ (ఎంపిసి) రెపో రేటును 5.5 శాతం వద్ద ఉంచుతూ 'తటస్థ' వైఖరిని కొనసాగించడంతో భారత ఈక్విటీలు ఎనిమిది రోజుల నష్టాల పరంపరను విచ్ఛిన్నం చేశాయి. బీఎస్‌ఈ సెన్సెక్స్ 715.7 పాయింట్లు లేదా 0.9 శాతం పెరిగి 80,983.21 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 0.92 శాతం లేదా 225.2 పాయింట్లు పెరిగి 24,836.3 స్థాయిలకు చేరుకుంది. విస్తృత మార్కెట్లలో నిఫ్టీ స్మాల్ క్యాప్ 100 ఇండెక్స్ 1.1 శాతం, నిఫ్టీ మిడ్ క్యాప్ 100 ఇండెక్స్ 0.89 శాతం పెరిగాయి. నిఫ్టీ బ్యాంక్, ఆటో, రియల్టీ రంగాలు వరుసగా 1.3 శాతం, 0.85 శాతం, 1.1 శాతం



పెరిగాయి. నిఫ్టీ పీఎస్‌యూ బ్యాంక్ 0.37 శాతం నష్టపోయింది. నిఫ్టీ ఫైనాన్షియల్ సర్వీసెస్, ఎనర్జీ, ఎఫ్‌ఎంసీజీ, ఐటీ, మీడియా, మెటల్, ఫార్మా, కన్స్యూమర్ డ్యూరబుల్స్, ఆయిల్ అండ్ గ్యాస్ 4 శాతం వరకు పెరిగాయి. సెన్సెక్స్ లో టాటా మోటార్స్, కొటక్ మహీంద్రా బ్యాంక్, ట్రెంట్, సన్ ఫార్మా, యాక్సిస్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్ టాప్ గెయినర్స్‌గా ఉండగా, బజాజ్ ఫైనాన్స్, అల్ట్రాటెక్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టాటా స్టీల్, ఏషియన్ పెయింట్స్ అధికంగా నష్టోయిన వాటిలో ఉన్నాయి.

## దేశపు అత్యంత యువ బిలియనీర్.. ఈ చెన్నై కుర్రాడు

**న్యూఢిల్లీ:** పెర్‌ప్లెక్సిటీ ఏఐ సహ వ్యవస్థాపకుడు అరవింద్ శ్రీనివాస్ ఎం3ఎం హురున్ ఇండియా రిచ్ లిస్ట్ 2025లో అతి పిన్న వయస్కుడైన బిలియనీర్‌గా చరిత్ర సృష్టించారు. చెన్నైకి చెందిన 31 ఏళ్ల అరవింద్ శ్రీనివాస్ 21,190 కోట్ల వ్యక్తిగత సంపదతో రిచ్ లిస్ట్‌లో అరంగేట్రం చేశారు. డీప్-టెక్, ఏఐ ఆధారిత ఆవిష్కరణలలో భారతదేశం ఎంత వేగంగా ఎదుగుతోందన్న దానికి ఇది ప్రతిబింబం. ప్రపంచ దిగ్గజాలకు పోటీగా ఉన్న ఏఐ-ఆధారిత సెర్చ్ ఇంజిన్ అయిన పెర్‌ప్లెక్సిటీ అరవింద్ శ్రీనివాస్‌కు ప్రపంచస్థాయి ప్రాముఖ్యతను తెచ్చిపెట్టింది. ఆయన్ను దేశపు అత్యంత ఉత్తేజకరమైన కొత్త-యుగ పారిశ్రామికవేత్తలలో ఒకరిగా చేసింది. జెప్టోకు చెందిన కైవల్యా వోహ్రా (22), ఆదిత్ పాలిచా (23) సహా ఇతర యువ పారిశ్రామికవేత్తలతో పాటు ఆయన ఈ జాబితాలో ఉన్నారు. భారతదేశంలో ఇప్పుడు 358 మంది బిలియనీర్లు ఉన్నారని నివేదిక చూపిస్తుంది. ఇందులో రికార్డు స్థాయిలో 1,687 మంది 1,000 కోట్ల రూపాయల సంపదను దాటినవారు ఉన్నారు. ఆ 358 మంది బిలియనీర్ల మొత్తం సంపద 167 లక్షల కోట్ల రూపాయలు. ఇది భారతదేశ జీడీపీలో దాదాపు సగం. గడిచిన రెండేళ్లలో దేశంలోని ధనవంతులు సగటున రోజుకు 1,991 కోట్ల రూపాయల సంపదను పెంచుకున్నారు. దేశంలో ప్రతి వారం ఒక కొత్త బిలియనీర్ తయారవుతున్నారు.



# బిలియనీర్లు.. కళ్లు చెదిరే విషయాలు

**ముంబై:**2025లో భారతదేశంలో బిలియనీర్ల సంఖ్య 358కి పెరిగింది. హురున్ ఇండియా రిచ్ లిస్ట్ 2025 తాజా నివేదిక ప్రకారం గత సంవత్సరంతో పోలిస్తే 24మంది కొత్త బిలియనీర్లు జాబితాలో చేరారు. 13 ఏళ్ల క్రితం హురున్‌లిస్ట్ మొదలైనప్పటి నుండి భారతదేశ బిలియనీర్ల సంఖ్య ఆరు రెట్లు పెరిగి 350కి చేరుకుంది. ఈ జాబితాలోని మరికొన్ని ముఖ్యమైన అంశాలు హురున్ ఇండియా రిచ్ లిస్ట్ 2025 లిస్టలో చోటు సంపాదించుకున్న వారు ధనవంతులు రోజుకు 1,991 కోట్ల సంపదను ఆర్జించారు. 2025లో టాప్ 10 మంది మొత్తం సంపద జాబితాలోని మిగిలిన జాబితాలో 28 శాతానికి సమానం. ఒక్క ముఖేష్ అంబానీ , గౌతమ్ అదానీ సంపదే మొత్తం సంపదలో 12శాతం ఉందని ఈ నివేదిక ద్వారా తెలుస్తోంది. హురున్ ఇండియా రిచ్ లిస్ట్ 2025లో తిరిగి అగ్రస్థానాన్ని దక్కించుకున్నారు. రూ. 9.55 లక్షల కోట్ల సంపదతో, ముఖేష్ అంబానీ %ూ% కుటుంబం అత్యంత ధనవంతులైన భారతీయుడిగా నిలిచారు. గౌతమ్ అదానీ కుటుంబం రూ. 8.15 లక్షల కోట్ల సంపదతో రెండో స్థానంలో ఉంది. హురున్ ఇండియా రిచ్ లిస్ట్ 2025 సంచిత సంపద 167 లక్షల కోట్లు. ఇది వార్షిక ప్రాతికపదికన ఇది 5 శాతం పెరుగుదల. ఇది స్పెయిన్



కంటే ఎక్కువ . భారతదేశంలో దాదాపు సగానికి సమానం. సుంకాల ఎదురుదెబ్బ, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల నేపథ్యంలో హురున్ ఇండియా రిచ్ లిస్టర్ల సగటు సంపద 10,320 కోట్ల 9,850 కోట్లకు తగ్గింది. నీరాజ్ బజాజ్ కుటుంబం సంపద రూ. 2.33 లక్షల కోట్లు పెరిగి, నాలుగు స్థానాలు ఎగబాకి 6వ స్థానానికి చేరుకుంది. మరో విధంగా చెప్పాలంటే, బజాజ్ గ్రూప్‌కు చెందిన నీరాజ్ బజాజ్ కుటుంబం ఈ జాబితాలో అగ్రస్థానంలో ఉన్నారు, 69,875 కోట్లు పెరిగి వారి సంపద 2.33 లక్షల కోట్లకు చేరుకుంది. చెన్నైలో జన్మించిన పెర్ప్లెక్సిటీ వ్యవస్థాపకుడు అరవింద్ శ్రీనివాస్, 21,190 కోట్ల సంపదతో 2025 హురున్ ఇండియా రిచ్ లిస్ట్‌లో బిలియనీర్‌గా అరంగేట్రం చేశారు. జాబితాలో అతి పిన్న వయస్కుడైన బిలియనీర్ కూడా ఆయనే. రోష్నీ నాడార్ మల్హోత్రా కుటుంబం రూ. 2.84 లక్షల కోట్ల సంపదతో టాప్ 3లో అడుగుపెట్టారు, భారతదేశంలో అత్యంత ధనవంతురాలైన మహిళగా నిలిచారు. రోష్నీ నాడార్ టాప్ 10లో అతి పిన్న వయస్కురాలు కూడా. జాబితాలో ఉన్న పద్దెనిమిది మంది లక్ష కోట్లకు పైగా ఆస్తులను కలిగి ఉన్నారు. గత సంవత్సరం కంటే ఆరుగురు ఎక్కువ. పదేళ్ల క్రితం దశాబ్దం ఇద్దరు మాత్రమే ఉన్నారు. హురున్ ఇండియా యునికార్న్ ఫ్యూచర్ యునికార్న్ లిస్ట్ 2025 నుండి అరవై ఐదు మంది యునికార్న్ వ్యవస్థాపకులు-13 మంది గజెల్ వ్యవస్థాపకులు , 5 మంది చీతా వ్యవస్థాప కులు వీ3 హురున్ ఇండియా రిచ్ లిస్ట్ చోటు దక్కింది

### గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.40 | ₹ 5.42 |

### బంగారం ధరలు (10 గ్రాములు)
హైదరాబాద్

| ₹ 1,08,750 | ₹ 1,18,640 |
|---|---|
| (22 క్యారెట్లు) | (24 క్యారెట్లు) |


### వెండి ధరలు (కేజీ)
హైదరాబాద్

₹ 1,60,000

# గాజాలో దుర్భిక్షం

## ఆహారానికి బదులుగా లైంగిక దోపిడీ.. భయానక స్థితిలో మహిళలు

**గాజా:** యుద్ధంతో అట్టుడికిపోతున్న గాజాలో దుర్భర పరిస్థితులు తాండవిస్తున్నాయి. అక్కడి ప్రజలు సహాయం కోసం నిరంతరం ఎదురు చూస్తున్నారు. ఆహార కొరత, ఉద్యోగాలు కనుమరుగు కావడం లాంటివి ఇక్కడి జనాభాను తీవ్రంగా కుంగదీశాయి. దీనిని అనువుగా మలచుకున్న కొందరు పురుషులు సహాయం మాటున లైంగిక దోపిడీకి పాల్పడుతున్నారని స్థానిక మహిళలు చెబుతున్నారు. దక్షిణ గాజా స్ట్రిప్‌లోని ఖాన్ యునిస్‌లోని ఛారిటీ కిచెన్ నుండి ఆహారాన్ని అందుకునేందుకు ఎదురుచూస్తున్న మహిళలు తమ దుర్భర స్థితిని 'అసోసియేటెడ్ ప్రెస్' ముందు వెళ్లగక్కారు. తన ఆరుగురు పిల్లలకు ఆహారం అందించేందుకు వారాల తరబడి ఎదురు చూశానని 38 ఏళ్ల ఒక తల్లి తనకు ఎదురైన చేదు అనుభవాన్ని వివరించింది. ఒక వ్యక్తి తనకు సేవా సంస్థలో ఉద్యోగం ఇస్తానని హామీ ఇచ్చాడని, తరువాత అతను ఒక ఖాళీ అపార్ట్‌మెంట్‌కు తీసుకెళ్లాడని తెలిపింది. దీంతో తాను అక్కడి నుంచి వెంటనే వెళ్లిపోవాలని అనుకున్నానని, అయితే తాను ఆహారం కోసం అతను చెప్పినట్లు చేయల్సి వచ్చిందని తెలిపారు. తరువాత అతను కొంత నగదు, ఆహారం ఇచ్చాడని, దీంతో పిల్లల ఆకలి తీర్చానని ఆమె వివరించింది. అయితే అతను చెప్పినట్లు ఉద్యోగం ఇవ్వలేదని పేర్కొంది. ఆహారానికి బదులుగా కొందరు పురుషులు లైంగిక దోపిడీకి ఎలా పాల్పడుతున్నారనే దానికి ఈ ఘటన ఉదాహరణగా నిలిచింది. గాజాలో సహాయం అందిస్తున్న సంఘాలు మానవ హక్కుల న్యాయవాదులు ఇటువంటి ఘటనలు ఇక్కడ సర్వసాధారణంగా మారిపోయాయన్నారు. దక్షిణ సూడాన్ నుండి హైతీ వరకు యుద్ధ భూముల్లో ఇలాంటివి నిత్యం కనిపిస్తున్నాయన్నారు. మానవతా సంక్షోభాలు ప్రజలను అనేక విధాలుగా దుర్బలంగా మారుస్తాయనేది భయంకరమైన



వాస్తవమని హ్యూమన్ రైట్స్ వాచ్‌లోని మహిళా హక్కుల విభాగం అసోసియేట్ డైరెక్టర్ హీథర్ బార్ పేర్కొన్నారు. గాజాలో మహిళలు, బాలికలు దుర్భర పరిస్థితులను ఎదుర్కొంటున్నారన్నారు. సహాయం అందుకునే నేపథ్యంలో లైంగిక దోపిడీకి గురైన కొందరు మహిళలకు చికిత్స చేసినట్లు పాలస్తీనియన్ మనస్తత్వవేత్తలు తెలిపారు. లైంగిక దోపిడీకి గురైన మహిళల్లో కొందరు గర్భవతులయ్యారన్నారు. 35 ఏళ్ల ఒక వితంతువు ఒకరు మీడియాతో మాట్లాడుతూ సహాయక స్థలంలో యూనిఫాంలో ఉన్న ఒక వ్యక్తి తనకు ఒక నంబర్ ఇచ్చి, అర్ధరాత్రి ఫోన్ చేశాడని తెలిపారు. దీనిపై తాను ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయగా, వారు కాల్ రికార్డింగ్స్ అవసరమని చెప్పారని, తాను వాటిని అందించలేకపోయానని ఆమె తెలిపింది. కాగా గత ఏడాది గాజాలో 18 లైంగిక వేధింపుల ఆరోపణలను నమోదు చేసినట్లు పీఎస్‌ఈఏ నెట్‌వర్క్ తెలిపింది. మరో ఉదంతంలో 29 ఏళ్ల ఒక తల్లి తన నలుగురు పిల్లలకు ఆహారం అందించేందుకు బదులుగా ఒక సహాయ కార్యకర్త తనను వివాహం చేసుకోవాలని వేధించాడని ఆరోపించింది. తాను అందుకు నిరాకరించానని పేర్కొంది.

## మూడేళ్లలో పది రెట్లు టర్నోవర్‌పై దృష్టి

**జనంసాక్షి:**ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాల సంస్థ రివర్, 2028 మార్చి నాటికి టర్నోవరును పది రెట్లు పెంచుకోవాలని నిర్దేశించుకుంది. ఇందులో భాగంగా ఉత్పత్తుల సంఖ్యను పెంచుకోవడంతో పాటు దేశవ్యాప్తంగా సేల్స్ నెట్‌వర్క్‌ను కూడా పటిష్టం చేసుకుంటున్నట్లు సంస్థ సహ వ్యవస్థాపకుడు అరవింద్ మణి తెలిపారు. ఒక్క ఎలక్ట్రిక్ స్కూటర్ మోడల్ (ఇండీ), 30 సేల్స్ ఔట్‌లెట్స్‌తో కంపెనీ రూ. 100 కోట్ల ఆదాయ మార్కును దాటింది. ఔట్‌లెట్స్ సంఖ్యను 2028 మార్చి నాటికి 350కి పెంచుకోనున్నట్లు మణి చెప్పారు. దీనితో నెలవారీగా అమ్మకాలు సుమారు 20,000 యూనిట్లకు, వార్షిక టర్నోవరు దాదాపు రూ. 1,200 కోట్లకు చేరగలదని అంచనా వేస్తున్నట్లు ఆయన వివరించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ. 500 కోట్లు లక్ష్యంగా పెట్టుకున్నట్లు, 2027 మార్చి నాటికి రెండు కొత్త ఉత్పత్తులను ప్రవేశపెట్టనున్నట్లు మణి పేర్కొన్నారు. కంపెనీ ప్రస్తుతం బెంగళూరులో ఉన్న ప్లాంటులో నెలకు 3,000 యూనిట్లను ఉత్పత్తి చేస్తోంది. తదుపరి దశ వృద్ధికి సంబంధించి వచ్చే 3-4 ఏళ్లలో 120-130 మిలియన్ డాలర్ల పెట్టుబడులు అవసరమవుతాయని ఆయన తెలిపారు. రివర్‌లో జపాన్‌కి చెందిన యమహా మోటర్ కార్పొరేషన్, మిత్సుయి అండ్ కో, మరుబెని కార్పొరేషన్ మొదలైనవి 70 మిలియన్ డాలర్ల వరకు ఇన్వెస్ట్ చేశాయి.

## అమెరికాకు భారీ నష్టం తప్పదా?

వాషింగ్టన్: కీలకమైన బిల్లులకు ఆమోదం లభించకపోవడంతో అమెరికా ప్రభుత్వం షట్‌డౌన్‌ను ఎదుర్కొంటోంది. మంగళవారం అర్ధరాత్రి దాకా కీలకమైన నిధుల బిల్లు విషయంలో సెనేట్‌లో హైడ్రామా నడిచింది. రిపబ్లికన్, డెమోక్రటిక్ పార్టీల మధ్య ఎంతకీ పొంతన కుదరలేదు. దీంతో, అమెరికా ప్రభుత్వం షట్‌డౌన్‌లోకి వెళ్లింది. అమెరికా కాలమానం ప్రకారం బుధవారం మొదలుకాగానే (భారత కాలమానం ప్రకారం బుధవారం ఉదయం 9.30కి) ఈ ప్రక్రియ ప్రారంభమైంది. అయితే, అమెరికాలో షట్‌డౌన్ మొదలైతే ఎంతకాలం కొనసాగుతుందో చెప్పలేము. 2018-19 మధ్య దాదాపు 35 రోజుల పాటు మూతపడింది. నాడు ట్రంప్ అధ్యక్షుడిగా ఉన్నారు. అమెరికా చరిత్రలోనే అది సుదీర్ఘమైన షట్‌డౌన్‌గా నిలిచింది. ఇక, ఈసారి షట్‌డౌన్ ఎన్ని రోజులు కొనసాగనుంది అనే విషయం ప్రశ్నార్థకంగా మారింది. ఈ షట్‌డౌన్ కారణంగా అమెరికా తీవ్రంగా ప్రభావితం అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. 35 రోజుల పాటు కొనసాగిన ఈ షట్‌డౌన్ అమెరికా చరిత్రలోనే అత్యంత దీర్ఘమైనది. అంచనా ప్రకారం.. 11 బిలియన్ డాలర్ల మేరకు అమెరికా ఆర్థిక వ్యవస్థకు తాత్కాలిక నష్టం వాటిల్లింది. ఇందులో 3 బిలియన్ డాలర్ల మేరకు జీడీపీ స్థిరంగా కోల్పోయింది. అంటే తిరిగి పొందలేని నష్టం ఇది.

## ఢిల్లీ బాబా గదిలో.. అశ్లీల చిత్రాల సీడీలు..
### ప్రముఖులతో ఫేక్ ఫొటోలు!

**న్యూఢిల్లీ:**లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న దిల్లీ బాబా (స్వామి చైతన్యానంద సరస్వతి) కేసు దర్యాప్తులో విస్తుపోయే విషయాలు బయట పడుతున్నాయి. దర్యాప్తు అధికారులు ఇటీవల ఆశ్రమంలో అతడి గదిని తనిఖీ చేయగా.. ఊహించని వస్తువులు లభ్యమయ్యాయి. శృంగార బొమ్మతో పాటు అశ్లీల చిత్రాలకు సంబంధించిన సీడీలు లభ్యమైనట్లు తెలిసింది. వీటితోపాటు ప్రధాని మోదీ, అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా, బ్రిటన్ నేతలతో దిగినట్లుగా ఉన్న నకిలీ ఫొటోలు లభ్యమైనట్లు సమాచారం. దిల్లీలో ఓ కళాశాల నిర్వహణ కమిటీలో సభ్యుడిగా ఉన్న స్వామి చైతన్యానంద.. ఆ కాలేజీ విద్యార్థుల నుంచి లైంగిక ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. కేసు నమోదైన తర్వాత కొన్ని రోజులు తప్పించుకు తిరిగిన అతడిని ఇటీవల ఆగ్రాలో పోలీసులు అరెస్టు చేసి దర్యాప్తు ముమ్మరం చేశారు. అతడి ఫోన్ డేటాను విశ్లేషిస్తున్నారు. మహిళా సిబ్బంది ఫొటోలు తీయడం, విద్యార్థినులతో అసభ్యంగా చాట్ చేయడం, వారి కదలికలను సీసీ కెమెరా యాప్ ద్వారా పర్యవేక్షించడం వంటి చర్యలకు పాల్పడినట్లు గుర్తించారు. ఓ విద్యార్థినితో అసభ్యకరంగా చాట్ చేసిన చైతన్యానంద.. ఓ దుబాయ్ షేక్‌కు శృంగార భాగస్వామి అవసరం ఉందని, ఎవరైనా తెలుసా? అని అడిగినట్లు వెల్లడైంది. అయితే, ఎవరి కోసం అతడు అలా అడిగాడనే విషయంపై ఇంకా స్పష్టత రాలేదు. ఇతడి చర్యల్లో అక్కడి మహిళా సిబ్బంది పాత్రపైనా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## పాక్ దళాల కాల్పుల్లో ఎనిమిది మంది నిరసనకారులు మృతి

**న్యూఢిల్లీ:** పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లో పాక్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా వరుసగా మూడవ రోజు జరిగిన హింసాత్మక నిరసనల్లో బుధవారం ఎనిమిది మంది పౌరులు మరణించారు. బాగ్ జిల్లాలోని ధిర్‌కోట్‌లో నలుగురు మృతిచెందారని, ముజఫరాబాద్‌లో ఇద్దరు, మీర్‌పూర్‌లో ఇద్దరు మృతిచెందారని ఎన్‌డీటీవీ తెలిపింది. మరణించిన నిరసనకారుల సంఖ్య 10కి చేరుకుందని అధికారవర్గాలు తెలిపాయి. 'ప్రాథమిక హక్కుల ఉల్లంఘన'పై అవామీ యాక్షన్ కమిటీ నేతృత్వంలో గత 72 గంటలుగా భారీ నిరసనలు జరగడంతోపాటు మార్కెట్లు, దుకాణాలను పూర్తిగా మూసివేశారు. రవాణా సేవలను కూడా నిలిపివేశారు. దీంతో జనజీవనం అతలాకుతలయ్యింది. బుధవారం ఉదయం నిరసనకారులు ముజఫరాబాద్‌లో షిప్పింగ్ కంటైనర్‌లపై రాళ్ల దాడికి పాల్పడ్డారు. ఈ సందర్భంగా పాక్ దళాలు జరిపిన కాల్పుల్లో పలువులు నిరసరకారులు మృతి చెందారు. పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్‌లోని జనం అటు పాకిస్తాన్ ప్రభుత్వం, ఆ దేశ ఆర్మీకి వ్యతిరేకంగా తీవ్ర స్థాయిలో నిరసన వ్యక్తం చేస్తున్నారు. సంవత్సరాల తరబడి కొనసాగుతున్న దోపిడీ, పేదరికానికి వ్యతిరేకంగా అక్కడి జనం తిరగబడుతున్నారు. అయితే పాకిస్తాన్ ప్రభుత్వం, ఆర్మీ ఈ ఉద్యమాలను అణిచివేస్తోంది. అయితే ప్రజలు మరింతగా తిరగబడుతున్నారు. ఆర్మీ, పోలీసులపై దాడులు చేస్తున్నారు. ఆర్మీ వాహనాలను నదుల్లోకి విసిరేస్తున్నారు. గత రెండు రోజులుగా ప్రజలు సైన్యం-పోలీసులకు ఎదురుతిరుగుతున్నారు.

## బీహార్‌లో ఎన్నికల జోష్

పాట్నా: బిహార్‌లో అసెంబ్లీ ఎన్నికలకు దాదాపు నెల రోజుల సమయం మాత్రమే ఉండడంతో ప్రధాన రాజకీయ పార్టీలు కసరత్తు ముమ్మరం చేశాయి. గెలుపే లక్ష్యంగా వ్యూహ ప్రతివ్యూహాల్లో మునిగి తేలుతున్నాయి. బీజేపీ నాయకత్వంలోని ఎన్డీఏ, కాంగ్రెస్ నేతృత్వంలోని మహాఘట్‌బంధన్ మధ్య ప్రధాన పోరు ఉంటుందని సర్వేలు వెల్లడిస్తున్నాయి. ప్రశాంత్ కిశోర్ కొత్త పార్టీ జన సురాజ్ ప్రభావం పెద్దగా ఉండకపోవచ్చని సర్వే ఫలితాలు చెబుతున్నాయి. ఇక సీఎం అభ్యర్థిగా ఆర్జేడీ యువనేత తేజస్వీ యాదవ్ అగ్రస్థానంలో ఉన్నట్టు సీ- ఓటర్ సర్వే వెల్లడించింది. ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ ఆశ్చర్యకరంగా మూడో స్థానానికి పరిమితం కాగా, ప్రశాంత్ కిశోర్ రెండో స్థానంలో నిలిచారు. ఫిబ్రవరి నుంచి సెప్టెంబర్ వరకు సేకరించిన డేటా ఆధారంగా సర్వే ఫలితాలను సీ- ఓటర్ ప్రకటించింది. సెప్టెంబర్ ఫలితాలను తీసుకుంటే.. 35.5 శాతం మంది తేజస్వి యాదవ్‌ను ముఖ్యమంత్రి అభ్యర్థిగా కోరుకున్నారు. ప్రశాంత్ కిశోర్ కావాలని 23.1 శాతం మంది ఆకాంక్షించారు. నితీశ్ కుమార్‌ను కేవలం 16 శాతం మంది మాత్రమే కోరుకున్నారు. ఎల్జేపీ నేత చిరాగ్ పాశ్వాన్‌కు 9.5, బీజేపీ నాయకుడు సామ్రాట్ చౌదరి 6.8 శాతం మంది మద్దతు ప్రకటించారు. అయితే ఫిబ్రవరి నుంచి చూసుకుంటే తేజస్వి, నితీశ్ కుమార్‌లకు మద్దతు తగ్గుతూ వస్తోంది. ఫిబ్రవరిలో తేజస్వికి 40.6 శాతం మంది, నితీశ్‌కు 18.4 శాతం మంది మద్దతు దక్కింది. మరోవైపు సీఎం అభ్యర్థిగా ప్రశాంత్ కిశోర్‌కు ఆదరణ పెరుగుతోంది. ఫిబ్రవరిలో ఆయనకు మద్దతు ఇచ్చిన వారు 14.9 శాతం మాత్రమే. 8 నెలల్లో ఆయనకు ఆదరణ 8.2 శాతం వరకు పెరిగినట్టు సీ ఓటర్ డేటా వెల్లడించింది. కాగా, మహాఘట్‌బంధన్ సీఎం అభ్యర్థి తానేనని తేజస్వీ యాదవ్ (%ువయిుంస్త్రఖఱ ˜ఖుఱజ%) ఇప్పటికే ప్రకటించుకున్నారు. దీనిపై కాంగ్రెస్ ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీఏ, మహాఘట్‌బంధన్ మధ్య హోరాహోరీ పోరు తప్పదని సర్వే ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి. సెప్టెంబర్‌లో నిర్వహించిన స్టేట్ వైబ్ సర్వే ప్రకారం.. మహాఘట్‌బంధన్ కూటమికి 34.9 శాతం, ఎన్డీఏ 34.8 శాతం ఓట్లు వచ్చే అవకాశం ఉంది. నిరుద్యోగం, వలసలు గురించి బిహార్ ప్రజలు ఎక్కువగా ఆందోళన చెందుతున్నారని సర్వే వెల్లడించింది. ముస్లింలలో మూడింట ఒక వంతు (38.4%) ఓటు చోరీపై ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల



జాబితాల స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కు వ్యతిరేకంగా కాంగ్రెస్ ముఖ్యనేత రాహుల్ గాంధీ చేసిన ప్రచారం ఓటర్లపై కొంతమేర ప్రభావం చూపించినట్టుగా కనబడుతోంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తల్లిపై ఏఐ- వీడియో వివాదాన్ని ఓటర్లు పెద్దగా పట్టించుకోలేదు. దాదాపు సగం మంది ఓటర్లు (49.8%) దీన్ని ఎన్నికల ప్రచారంలో భాగంగానే పరిగణించారు.

**తేజస్వీ యాత్రతో జోష్**

తేజస్వీ చేపట్టిన యాత్రతో ఆర్జేడీ కార్యకర్తలను ఉత్తేజపరిచిందని 43.8 శాతం మంది అభిప్రాయపడ్డారు. యాదవుల నుంచి మంచి స్పందన వస్తోందని 76.7 శాతం మంది సర్వేలో పేర్కొన్నారు. లాలూ ప్రసాద్ యాదవ్ ) కుటుంబంలోని అంతర్గత వివాదాలు ఎన్నికల ఫలితాలపై ఎటువంటి ప్రభావం చూపబోవని 45.8 శాతం మంది అభిప్రాయపడ్డారు. లాలూ కుటుంబ కలహాలు పార్టీపై ఎటువంటి వ్యతిరేక ప్రభావాన్ని కలిగించబోవని యాదవుల్లో 70.6 శాతం మంది విశ్వాసం వ్యక్తం చేశారు. అగ్రవర్ణ హిందువులలో 46.6% మంది ప్రతికూల ప్రభావం ఉంటుందని పేర్కొన్నారు.

మహాఘట్‌బంధన్‌లో లుకలుకలు..!

ఎవరికి ఓటు వేయాలో ఇప్పటికే నిర్ణయించుకున్నామని 56.3 శాతం మంది సర్వేలో చెప్పారు. ఇంకా నిర్ణయం తీసుకోలేదని 43.7% మంది తెలిపారు. తమ ఓటు ఎవరికి వేయాలనే విషయంలో గ్రామీణ ఓటర్ల కంటే (51.8%) పట్టణ ఓటర్లు (66.9%) ఇప్పటికే నిర్ణయానికి వచ్చినట్టు సర్వే వెల్లడించింది.

## మెట్రో రైలుపై ఎమ్మెల్యే నియోజకవర్గ ప్రజలకు సమాధానం చెప్పాలి

**రాజేంద్రనగర్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జి పట్లోళ్ల కార్తిక్ రెడ్డి**

**బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయిస్తే ఊరుకోం**



**రాజేంద్రనగర్,అక్టోబర్1(జనం సాక్షి)**
గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో మెట్రో రైలు అమలను కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేయడంతో రాజేంద్రనగర్ నియోజకవర్గం ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర ద్రోహం చేసిందని రాజేంద్రనగర్ నియోజకవర్గం టిఆర్ఎస్ పార్టీ ఇన్చార్జి పట్లోళ్ల కార్తిక్ రెడ్డి పేర్కొన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో గచ్చిబౌలి మైండ్ స్పేస్ నుండి రాజేంద్రనగర్ శంషాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టును ఈ కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేయడంతో రాజేంద్రనగర్ నియోజకవర్గం ప్రజలకు తీవ్ర ద్రోహం చేసిందని రాజేంద్రనగర్ నియోజకవర్గం టిఆర్ఎస్ ఇంచార్జ్ పట్లలో కార్తీక్ రెడ్డి ఆరోపించారు. బుధవారం శ్రీ వెంకటేశ్వర కాలనీ అధ్యక్షుడు బొమ్ము ఉపేంద్రనాథ్ రెడ్డి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కార్తీక్ రెడ్డి మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కారంలో భాగమైన మెట్రో రైల్ విషయంలో అధికార పార్టీని ప్రశ్నిస్తే మాపై ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ కుట్రపూరితమైన కేసులు నమోదు చేస్తారా అని ప్రశ్నించారు? కాంగ్రెస్ ప్రభుత్వం సహకరిస్తే మెట్రో రైలు ఇంకో సంవత్సరానికి పూర్తయి ఇక్కడి ప్రజలు లబ్ధి పొందే వారని ఆయన గుర్తు చేశారు. నియోజకవర్గ ప్రజల అభివృద్ధి కోసం పార్టీ మారానని చెప్పుకొస్తున్న ఎమ్మెల్యే ప్రభుత్వం మెట్రో రైల్ రద్దు చేస్తే ఎందుకు ప్రశ్నించడం లేదని, దీనిపై ఎమ్మెల్యే ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ మధ్య వెంకటేశ్వర కాలనీ సంక్షేమ సమావేశంలో తోపులాటలో తమ కార్యకర్తలకు సంబంధం లేకుండా అక్రమ కేసులు బనాయించడం మానుకోవాలని హితవు పలికారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఎమ్మెల్యే విజయంలో ఇక్కడి సీతారాం ధూళిపాళ, ఉపేంద్ర నాథ్ రెడ్డిలు ఆయన గెలుపులో ప్రధాన భాగ్యస్వాములను మరచి బీఆర్ఎస్ నాయకులపై కేసులు బనాయించడం నీతి మాలిన చర్య అని ధ్వజమెత్తారు. అక్రమ కేసులు పెట్టినంతమాత్రాన మా నాయకులు కార్యకర్తలు బెదరబోరని సమయం వచ్చినప్పుడు ప్రజలు తగిన బుద్ధి చెబుతారని అన్నారు.

**సమస్యలపై ప్రశ్నిస్తే అవినీతి అంటగడతారా?**

వెంకటేశ్వర కాలనీ అధ్యక్షుడు ఉపేంద్ర నాథ్ రెడ్డి మాట్లాడుతూ 1993-94 సమాచారాలలో కాలనీ ఏర్పడినా, 2018 వరకు కూడా కాలనీలో ఎలాంటి మౌలిక వసతులు లేవని అప్పటి ఆల్ ఫెడరేషన్ అధ్యక్షుడు సీతారాం దూళిపాల, కౌన్సిలర్ పద్మారావు ల సహకారంతో కాలనీని అభివృద్ధి పరుచుకున్నామని ఇప్పటికీ 75 శాతం కాలనీ అభివృద్ధి చెందిందని మిగతా 25 శాతం కాలనీ అభివృద్ధి జరగాల్సి ఉందని ప్రజా సమస్యలపై అప్పటినుంచి మున్సిపాలిటీలోని అన్ని కాలనీలతో సహా, అల్కాపూర్ కాలనీ సమస్యలపై ప్రశ్నిస్తే అధికారులకు, ప్రజా ప్రతినిధులకు మింగుడు పడలేదని దాని మూలంగానే మాపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడ్డారని ఆయన అన్నారు. గత నెల 13న జనరల్ బాడీ మీటింగ్ లో పద్మారావుకు, కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు చేసిన సొసైటీ కాలనీ వాసులను మేము పిలువలేదని మేం నిర్వహించుకున్న జనరల్ బాడీ మీటింగ్ లో వాళు వచ్చి గొడవ చేసి మాపై కేసులు బనాయించడం ఇదంతా అధికార పార్టీ కుట్రేనని, కాలనీ అసోసియేషన్ సభ్యత్వంలో 100 రూపాయలు కూడా తీసుకోకుండా సభ్యత్వం ఇచ్చామని, వారు చేసిన అవినీతి లో , మేము ప్రశ్నిస్తే ఊరుకోవాలా తిరిగి మాపైనే అవినీతి ఆరోపణలు చేశారా అని ప్రశ్నించారు. కాలనీ సంక్షేమం కోసం అత్యవసర సమయంలో తన సొంత నిధులతో కాలనీని అభివృద్ధి పరిచానని ఉపేంద్రనాథ్ రెడ్డి చెప్పుకొచ్చారు. ఈ కార్యక్రమంలో కుంభకళ్ళ ధనరాజ్, మాల్యాద్రి నాయుడు, షేక్ ఖరీఫ్, గుట్ట మీద నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

## వార్డు మెంబర్ నుండి జడ్పీటీసీ దాకా అన్ని స్థానాల్లో పోటీ

**బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు వెల్లడి : అత్యధిక స్థానాలను సాధిస్తామని ధీమా**



**కరీంనగర్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 01 (జనంసాక్షి) :** స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా అభ్యర్థుల ఎంపిక కార్యక్రమం మొదలైంది. ముందు జడ్పీటీసీ అభ్యర్థులను డిక్లేర్ చేయాలి. ఏకగ్రీవంగా ఉన్న చోట బి.ఫాం ఇవ్వాలి. వార్డు మెంబర్ నుండి జడ్పీటీసీ దాకా అన్ని స్థానాల్లో బీజేపీ పోటీ చేస్తుంది. అత్యధిక స్థానాలను సాధిస్తాం. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు ఓట్లు అడిగే అర్హత లేదు. స్థానిక సంస్థలను నిర్వీర్యం చేసిన పార్టీ బీఆర్ఎస్. కేంద్ర నిధులను దారి మళ్లించి గ్రామాలను దెబ్బతీశారు. నాడు సర్పంచులు ఆత్మహత్యలు చేసుకునే దుస్థితి కల్పించారు. తాజామాజీ సర్పంచులు పడిన యాతన వర్ణణాతీతం అని పంచాయతీలకు కరెంట్ బిల్లులు కూడా కట్టలేని దుస్థితి తెచ్చారన్నారు. కాంగ్రెస్ అనేక వాగ్దానాలు చేసింది. రైతు భరోసా ఇయ్యడం లేదు, పీఎం కిసాన్ సమ్మాన్ నిధి కింద కేంద్రం క్రమం తప్పకుండా రైతుల అకౌంట్లో నిధులు జమ చెందుతుందని, ఉచితంగా బియ్యం అందిస్తోంది, గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి అంతా కేంద్ర నిధులతోనే, రోడ్లు, నర్సరీలు, ఇంటింటికీ నీళ్లు సహా గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులన్నీ కేంద్ర నిధులతో జరుగుతున్నవే అన్నారు. బీఆర్ఎస్ రాష్ట్రాన్ని దోపిడీ చేస్తే, కాంగ్రెస్ పార్టీ మోసాలు చేస్తోందని, బీజేపీ మాత్రం అభివృద్ధిపైనే మాట్లాడుతోందని బీజేపీని ఆదరించాలని కోరుతున్నామని, గ్రామాలకు రూ.40 వేల కోట్లు ఎరువుల పేరుతో సబ్సిడీ ఇస్తోందన్నారు. ఎరువుల పంపిణీ చేతగాక క్రుత్రిమ కొరతకు పూర్తి బాధ్యులు కాంగ్రెస్ దే అని మొన్ననే లక్ష మెట్రిక్ టన్నుల యూరియా వచ్చింది. ఖరీఫ్ సీజన్ లో పూర్తిస్థాయిలో ఎరువులను పంపిణీ చేస్తున్నామన్నారు. బీజేపీని గెలిపిస్తే కేంద్ర నిధులు తీసుకొస్తామని, గ్రామాలు బాగుపడాలంటే బీజేపీని గెలిపించండి. 42 శాతం రిజర్వేషన్ల సవరణ అప్పుడే చేస్తే ఈ సమస్య వచ్చేది కాదు. స్థానిక ఎన్నికలు నిర్వహించాలనే చిత్తశుద్ధి లేదు కాబట్టే రెండేళ్ల జాప్యం చేశారు. హైకోర్టు ఆదేశించినందునే తప్పనిసరై ఇష్టం లేకపోయినా ఎన్నికలు నిర్వహిస్తున్నారని, కేంద్ర నిధుల కోసమే నిర్వహిస్తున్నారని తెలిపారు. బీజేపీ బీసీ రిజర్వేషన్లకు కట్టుబడి ఉందని ఎన్నికలు జరగాలన్నదే బీజేపీ అభిమతం అని కోర్టుకు కాంగ్రెస్ నేతలే వెళ్లినట్లున్నారు. రాజ్యాంగ బాధ్యతను కాంగ్రెస్ తీసుకోవాలి. ఎన్నికలు జరిపి తీరాలని కోరుతున్నామన్నారు. దేశంలో రిజర్వేషన్లకు సంబంధించి వివిధ రాష్ట్రాల్లో అనేక సామాజిక సమస్యలుంటాయి. రిజర్వేషన్లను అమలు చేయాల్సిన బాధ్యత రాష్ట్రానిదే. రాష్ట్రంలో బీసీఈ ముస్లింలకు సంబంధించినదే. ఎడ్యుకేషన్, ఎంప్లాయిమెంట్‌కు మాత్రమే ఆనాడు పరిమితం చేశారు. కానీ ఈనాడు వాళ్లకు రాజకీయ రిజర్వేషన్లు కల్పిస్తున్నారు. దీనికి బీజేపీ అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. స్థానిక ఎన్నికలపై కోర్టు ఏ విధంగా స్పందిస్తోందో వేచి చూడాలి. కోర్టు తీర్పును ముందుగా ప్రిడిక్ట్ చేయలేమన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో బీఆర్ఎస్ అవినీతి పాల్పడింది. ఈ ప్రాజెక్టు మొత్తం విచారణ చేయాలని కానీ మేడిగడ్డ, సుందిళ్లకే పరిమితం చేయడం సరికాదు. ఎన్డీఎస్ఏ ఇచ్చిన నివేదిక ప్రకారం వాటిని రిపేర్ చేయాలని, పార్టీ ఫిరాయింపులకు బీజేపీ వ్యతిరేకం అని పార్టీని వీడేటప్పుడు రాజీనామా చేయాలన్నదే మా అభిమతం బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రామచంద్రరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఆంజి రెడ్డి, జిల్లా అధ్యక్షుడు క్రిష్ణా రెడ్డి, మాజీ మేయర్ సునీల్ రావు,బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

## జూనియర్ అసిస్టెంట్ నుండి గ్రూప్ 1 ఆఫీసర్‌గా కోలా అక్షయ్ కుమార్



**హయత్ నగర్, అక్టోబర్ 01 (జనంసాక్షి) :** హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని తిరుమల హౌసింగ్ కాలనీ వాస్తవ్యులు కోలా శ్రీనివాస్ ప్రభుత్వ ఉద్యోగి కుమారుడైన కోలా అక్షయ్ కుమార్ కీసర ఆర్డీవో ఆఫీసులో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తుండగా, గ్రూప్ 1లో 784 ర్యాంకుతో ఎంపిడిఓగా, గ్రూప్ 2లో 1190 ర్యాంకుతో కమర్షియల్ టాక్స్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగాన్ని సంపాదించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర రవాణా, బీసీ వెల్ఫేర్ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ అక్షయ్ కుమార్‌ను అభినందించారు.

## కవితను కలిసిన కప్పాటి పాండురంగారెడ్డి



**మహేశ్వరం, అక్టోబర్1 (జనంసాక్షి) :** తెలంగాణ సంస్కృతిని ప్రపంచానికి చాటి చెప్పిన ఘనత తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవితకే దక్కుతుందని మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కప్పాటి పాండురంగారెడ్డి,జాగృతి నాయకుడు అందుగుల సత్యనారాయణ అన్నారు.బుధవారం హైదరాబాద్ లోని జాగృతి కార్యాలయంలో కవితను కలిశారు.ఈ సందర్భంగా కప్పాటి పాండురంగారెడ్డి,అందుగుల సత్యనారాయణ మాట్లాడుతూ... జాగృతి అధ్యక్షురాలు కవిత ప్రపంచ దేశాలకు బతుకమ్మ పండుగను తెలంగాణ సాంప్రదాయాలను పరిచయం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో జాగృతి నాయకులు కోలా శ్రీనివాస్, ఉండేలా బాబురావు, సభావాత్ గణేష్ నాయక్, పలువురు జాగృతి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## దుర్గ మాత ఆశీస్సులు అందరిపై ఉండాలి

**మంత్రి శ్రీధర్ బాబు**

**మంథని, (జనంసాక్షి) :** దుర్గామాత అమ్మవారి దీవెనలు, ఆశీస్సులు అందరిపై ఉండాలని రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు వేడుకున్నారు. దేవి శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా బుధవారం మంథని నియోజక వర్గం పరిధిలోని కమాన్ పూర్ మండల కేంద్రం లోని సుభాష్ నగర్ లో ఏర్పాటుచేసిన దుర్గామాతను, చత్రపతి శివాజీ యువసేన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాత తో పాటు, వేణుగోపాల స్వామి గుడి ఆవరణలో ఏర్పాటు చేసిన దుర్గామాతను, జూలపల్లి ఆదర్శ నగర్ లో జెమినీ గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాతను మంత్రి శ్రీధర్ బాబు దర్శించుకున్నారు. మంథని నియోజకవర్గ ప్రజలతో పాటు తెలంగాణ రాష్ట్ర ప్రజలు అమ్మవారి దీవెనలతో సంతోషంగా సుభిక్షంగా ఉండాలని వేడుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయా మండపాల నిర్వాహకులు మంత్రి శ్రీధర్ బాబును శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఆయన వెంట మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తోట్ల తిరుపతి యాదవ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సయ్యద్ అన్వర్, సింగల్ విండో చైర్మన్ ఇనగంటి భాస్కరరావు, మాజీ ఎంపీపీ కోలేటి మారుతి, ఇనగంటి రామారావు, ఫీట్ల గోపాల్, అంబీరు శ్రీనివాస్, కిషన్ రెడ్డి, రంగు సత్యం, బొల్లపల్లి శంకర్ గౌడ్, తీగల రాజయ్య, బొల్లపల్లి లక్ష్మయ్య గౌడ్, రంగు శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు రెబల్ రాజ్ కుమార్ తో పాటు అధిక సంఖ్యలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కష్టే ఫలిని నిరూపించిన లావణ్య

**కామారెడ్డి జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర**



**కామారెడ్డి ప్రతినిధి (జనంసాక్షి) :** కామారెడ్డి జిల్లా రామారెడ్డి ఎస్సై లావణ్య కష్టే ఫలిని నిరూపించారని కామారెడ్డి జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర పేర్కొన్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ లావణ్య గ్రూప్-1 ద్వారా బీసీ వెల్ఫేర్ అధికారిణిగా ఎంపిక కావడం అభినందనీయమని అన్నారు. ఎస్సై లావణ్య ఎస్పీని కలవగా ఆమెను ఎస్పీ సత్కరించి అభినందనలు తెలిపారు. ఎస్సై లావణ్య ఎక్సైజ్ కానిస్టేబుల్ నుంచి గ్రూప్-1 జిల్లా అధికారిణిగా నియామకం కావడం హర్షించదగ్గ విషయమన్నారు. కష్టపడితే ఖచ్చితంగా ఫలితం దక్కుతుందడానికి ఆమె నిదర్శనమన్నారు. రామారెడ్డి ఎస్సై లావణ్య 2018లో ఎక్సైజ్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యారని, 2020లో సివిల్ ఎస్సైగా, 2025లో గ్రూప్-1లో జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారిణిగా పోస్టును సాధించడం ద్వారా అసాధారణ ప్రతిభను చాటుకున్నారని తెలిపారు. సిద్దిపేట జిల్లా చేబర్తి ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలలో ప్రాథమిక విద్యను పూర్తిచేసి ట్రిపుల్ ఐటీ బాసరలో సీటు సాధించి ఆసక్తితో విద్యను అభ్యసించారన్నారు. పోలీస్ ఉద్యోగంలో ఎదురయ్యే సమస్యలు, ఆటుపోట్లు, సమయ పరిమితులను అధిగమిస్తూ, లభించిన ఖాళీ సమయాన్ని సద్వినియోగం చేసుకొని గ్రూప్-1 ఉద్యోగాన్ని సాధించడం గొప్ప విషయమన్నారు. జిల్లాలో ప్రొబెషనరీ పూర్తి చేసిన అనంతరం నస్రుల్లాబాద్, రామారెడ్డి ఎస్సైగా విధులు నిర్వహించారని తెలిపారు. పోలీసు విధులలో ఎలాంటి రిమార్కులు లేకుండా అనేక అవార్డులు, రివార్డులు అందుకున్నారన్నారు. భవిష్యత్తులో కూడా తన ప్రతిభతో మంచి పేరు సంపాదించి, ప్రజలకు సేవ చేస్తూ తనదైన ముద్ర వేసుకోవాలని అయన ఆకాంక్షించారు.



**మినిస్టర్ క్వార్టర్స్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్‌ని మర్యాదపూర్వకంగా కలిసిన ఆర్టీసీ నూతన ఎండీ నాగిరెడ్డి. నూతనంగా ఆర్టీసీ ఎండీగా బాధ్యతలు స్వీకరించిన నాగిరెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన మంత్రి పొన్నం ప్రభాకర్**

హైదరాబాద్, అక్టోబర్ 1 (జనంసాక్షి) :



## తెలంగాణ ప్రజలకు ఎంపీ వద్దిరాజు దసరా శుభాకాంక్షలు



**హైదరాబాద్, అక్టోబర్ 1 (జనంసాక్షి) :** దసరా పండుగ (విజయదశమి)సందర్భంగా బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర తెలంగాణ వారందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణలో ముఖ్యమైన పండుగగా జరుపుకునే దసరా విశిష్టతను ప్రపంచానికి చాటి చెబుతూ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు జమ్మిచెట్టును రాష్ట్ర వృక్షంగా, పాలపిట్టను రాష్ట్ర పక్షిగా ప్రకటించిన విషయాన్ని తన సందేశంలో ఎంపీ రవిచంద్ర గుర్తుచేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ నాయకత్వాన జరిగిన మహోద్యమంలో బతుకమ్మ,దసరా పండుగలు కూడా ప్రజలకు మరింత స్ఫూర్తినిచ్చాయని ఎంపీ రవిచంద్ర పేర్కొన్నారు. విజయదశమి పర్వదినం సందర్భంగా తెలంగాణవాసులు, దేశం నలుమూలల, పలు దేశాలలో నివసిస్తున్న, స్థిరపడిన తెలంగాణ బిడ్డలందరికీ వద్దిరాజు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. దుర్గామాత కరుణా కటాక్షాలతో తెలంగాణ బిడ్డలందరికి మంచి జరగాలని,సుఖ సంతోషాలతో వర్థిల్లాలని ఎంపీ వద్దిరాజు అభిలషించారు.




## దయాకరుడిగా ఉంటే కంటగింపా..?

- సామాన్యుల కంటతడి తుడిస్తే నచ్చడం లేదా..?
- క్యాంపు ఆఫీసులో ప్రజల కోసం అందుబాటులో ఉంటే గిట్టడం లేదా..?
- తగ్గి ఉంటున్నాడని అవమానిస్తారా..?
- రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని డ్యామేజ్ చేసే కుట్ర


***ఖమ్మం జిల్లాలోని కొందరు రాజకీయ నేతలు దిగజారి వ్యవహరిస్తున్నారు. ప్రతి అంశంలో రాజకీయం అనే ఎజెండాను పెట్టుకుంటున్నారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డిలా హుందాగా వ్యవహరించడం లేదు. సున్నితమైన అంశాలను, అనవసరమైన వివాదాలుగా సృష్టించి వ్యక్తిత్వ హననానికి పాల్పడి రాజకీయ క్రీడను కాస్తా రాక్షస క్రీడగా మార్చేసుతున్నారు. దాంతో ఖమ్మం జిల్లా రాజకీయం పూర్వ వైభవాన్ని కోల్పోతుంది. కేంద్రంలో బిజేపి, రాష్ట్రంలో బిఆర్ఎస్ పాలన ప్రారంభమైన నాటి నుంచి అసహ్యించుకునే కుట్ర రాజకీయాలు ఎక్కువైయ్యాయి.***

**ఖమ్మం (జనంసాక్షి) :** సుదీర్ఘకాలం పరిపాలించిన కాంగ్రెస్ రాజకీయ ప్రత్యర్థులుగా ఉన్న కమ్యునిస్టులు ఏరోజూ నీతి తప్పిన రాజకీయాలకు పాల్పడలేదు. అందుకే ఆ ఇరు పార్టీలకు ప్రజల్లో బలమైన క్యాడర్‌తో పాటుగా భారీ స్థాయిలో అభిమానులున్నారు. కమ్యూనిస్టు పార్టీలకు ఓట్లు తగ్గినప్పటికి సానుభూతిపరులు లక్షల్లో ఉన్నారనేది అప్రస్తుతం. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత పార్టీ ఇచ్చే చనువుని కొందరు బలహీనతగా, చేతకానితనంగా భావిస్తున్నారనేది స్పష్టంగా అర్థమవుతుంది. నియంత్రణ లేని సోషన్, మీడియా ద్వారా కాంగ్రెస్ నాయకులపై బురదజల్లుతూ, నిరాధార ఆరోపణలు చేస్తూ నోటికొచ్చిన విమర్శలు చేస్తున్నారు. ఖమ్మం జిల్లాలో రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని డ్యామేజ్ చేసేందుకు అనేక ప్రతి పక్ష పార్టీలు కుట్రలు పూనుతున్నాయి. పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని బలహీనపరిచే విధంగా కుట్ర రాజకీయాలకు తెరదీశారు. మంత్రితో పాటు అతనితో సన్నిహితంగా ఉండే వారిని ఒక్కొక్కరిని బలహీనం చేసే దిశగా కుటిల ప్రయత్నాలు చేస్తున్నారు.

**మంత్రి హస్తాన్ని బలహీనపర్చాలనే కుట్ర**



ఖమ్మం జిల్లాతో పాటుగా రాష్ట్రంలో కీలక నాయకుడిగా ఉన్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి నోట్లో నాలుక లాగా, చేదోడు వాదోడుగా ఉంటూ అన్ని అంశాలను దగ్గరుండి చూసుకుంటున్న తుంబూరు దయాకర్ రెడ్డిని బలహీన పర్చేందుకు కుట్ర మొదలైంది. ప్రతిపక్ష పార్టీలతో పాటుగా, కొందరు వ్యక్తులకు అనుబంధంగా ఉండే ఓ వర్గం మీడియాతో కలిసి కొందరు రాజకీయ నాయకులు దయాకర్ రెడ్డిని బలహీనపరిచేందుకు కుట్రలు చేస్తున్నట్లుగా తెలుస్తుంది. పొంగులేటి రాష్ట్ర రాజకీయాల్లో నిమగ్నమై తన రాజకీయాన్ని కొనసాగిస్తూ సొంత నియోజక వర్గంలో ప్రత్యేక సమయం కేటాయిస్తున్నారు. అనేక అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేస్తూ స్థానిక ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటున్నారు. రాష్ట్రానికి మంత్రి కాబట్టి రాష్ట్రంలోని 33 జిల్లాలో పర్యటిస్తూ తన శాఖ పరిధిలోని సమస్యలను పరిష్కారం చూపే ప్రయత్నం చేస్తున్నారు. రాజకీయంగా ఉన్న బిజీ షెడ్యూల్‌లో తనను నమ్ముకున్న ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా తుంబూరు దయాకరె రెడ్డిని నియమించారు. దయాకర్ రెడ్డిని బలహీన పరిచి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని అస్థిర పరిచేందుకు కుట్ర పన్నుతున్నట్లుగా తెలుస్తుంది. పొంగులేటి రాష్ట్ర రాజకీయాల్లో బిజిగా ఉన్న సమయంలో జిల్లా ప్రజల కోసం సమయాన్ని కేటాయించలేకపోతే ప్రజల్లో అసహనం, వ్యతిరేకత పెరిగి ఎంతో ఉజ్వల భవిష్యత్తు ఉన్న పొంగులేటి రాజకీయ ప్రస్థానం అర్ధాంతరంగా ముగిసిపోవాలని ఓ వర్గం బలంగా కోరుకుంటుంది. రాష్ట్ర రాజకీయాలు ఖమ్మం కేంద్రంగా మలుపు తిరిగాయి. కాబట్టి ఖమ్మం జిల్లాలో మంత్రి పొంగులేటికి ఉన్న క్రేజ్ ని దెబ్బకొట్టాలనే కుట్ర జరుగుతుందని చెప్పడానికి ఓ వర్గం మీడియా చేస్తున్న విష ప్రచారంతో పాటు ఓ వర్గపు ప్రతిపక్ష నాయకులు చేస్తున్న నిరాధార ఆరోపణలు సాక్ష్యం చెబుతున్నాయి.



**ఆత్మహత్య యత్నానికి పాల్పడిన వ్యక్తి ఎవరికి ఫోన్ చేస్తాడు?**

సుద్దవాగులో జరిగిన ఓ సంఘటనలో స్థానికంగా ఉన్న బిఆర్ఎస్ పార్టీ నాయకులే మద్దతు తెలపడంలేదు. ఒకవేళ అన్యాయంగా కేసులు నమోదైతే బిఆర్ఎస్ నాయకులు క్వాష్ లేదా ముందస్తు బెయిల్ మంజూరు చేయించే అవకాశం ఉంది. అన్యాయంగా అయిన కేసుల పై మీడియా ముందు ప్రత్యేక్ష ప్రసారంలో చూపించవచ్చు. కాని అలా చేయకుండా మౌనంగా ఉన్నారంటే అక్కడ అన్ని ఆధారాలు ఉండగానే కేసులు నమోదైయ్యాయనేది యదార్ధంగా కనిపిస్తుంది. ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలిసులు కేసులు నమోదు చేస్తారు. గతంలో అధికార పార్టీలో ఉన్నప్పుడు భయపడి ఫిర్యాదు ఇవ్వని వాళ్లు నేడు తమని వేధించిన వారికి అధికారం లేకపోవడంతో తమకు న్యాయం జరుగుతుందని భావించి ఫిర్యాదు చేసే అవకాశం లేకపోలేదు. బీఆర్ఎస్ ఖమ్మం జిల్లాలోని నాయకులు సుద్దవాగు సంఘటన జరిగిన వ్యక్తిపై ప్రేమ కంటే పొంగులేటితో పాటుగా ఉన్న ముఖ్య నాయకులను, కార్యకర్తలను బద్నాం చేయాలనే కుట్ర కోణం స్పష్టంగా కనిపిస్తుంది. ఆత్మహత్యయత్నానికి పాల్పడిన వ్యక్తి చివరి ఘడియల్లో కుటుంబ సభ్యులకు ఫోన్ చేయకుండా మీడియాకు ఫోన్ చేయడం పై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వీడియోలో తెలిపిన మాటలు వాస్తవ రూపంలో లేవనేది స్పష్టంగా కనిపిస్తుంది. సైపర్ మిత్రిన్ పురుగుల మందు తాగితే మీడియా ముందుకు.. ముందే.. సైంటిస్టుల్లాగా వైద్య నిపుణుల వివరణ అడగకుండా సొంత బాణీని వినిపించడంపై అనేక అనుమానాలు ఉన్నాయి. అసలు సంఘటన జరగడం కంటే ముందు హైడ్రామా నడిచిందనే ప్రచారం నడుస్తుంది. ఓ నాయకుడి దర్శకత్వంలో కొందరు మీడియా ప్రతినిధులు పని చేసారనే ప్రచారం నడుస్తుంది. అవకాశం కోసం, అవసరం కోసం చేతులు చాచి, అందరితో నాకు పెద్ద పెద్ద పరిచయాలు ఉన్నాయని చెప్పుకోవడంతో పాటుగా రాష్ట్రం నుంచి కేంద్రం వరకు నాయకులతో పరిచయాలు ఉన్నాయని అనేక మంది సామాన్య , అమాయక ప్రజలను, నాయకులను బురిడి కొట్టించే మీడియా ప్రతినిధులు ఖమ్మం జిల్లాలో ఉండటం గమనార్హం.

**టార్గెట్ దయాకర్ రెడ్డి..!**

ఉదయం 9 గంటలకు వచ్చి మధ్యాహ్న భోజనానికి ఇంటికి వెళ్లకుండా మంత్రి క్యాంపు కార్యాలయంలోనే ఉంటూ వచ్చిన అధికారులకు, సామాన్య ప్రజలకు, కార్యకర్తలకు, నాయకులకు అందుబాటులో ఉండి, మంత్రి ఆదేశాల మేరకు ఎవ్వరిని కాదనకుండా సేవలు అందిస్తున్న వ్యక్తి గా దయాకర్ రెడ్డికి జిల్లాతో పాటుగా పరిసర జిల్లాల్లో పేరుంది. ప్రతి చిన్న విషయాన్ని నిశితంగా పరిశీలించి ప్రభుత్వానికి, మంత్రి పొంగులేటికి చెడ్డ పేరు రాకుండా అన్ని అంశాలకు పరిష్కార మార్గాలను చూపుతున్న దయాకర్ రెడ్డిని వ్యక్తిత్వ హననం చేయాలని కొందరు వ్యూహాలు పన్నుతున్నారు. స్థిరంగా , సౌమ్యంగా వచ్చిన ప్రతి ఒక్కరిని అన్నగారు అని పలకరిస్తూ, టీ అందించి, భోజనం పెట్టి, కొందరికైతే చార్జీలకు డబ్బులు ఇచ్చి పంపే దయాకర్ రెడ్డి ఆత్మస్థైర్యాన్ని నీరుగార్చే కుట్ర జరుగుతుంది. దయాకర్ రెడ్డికి అధికార హోదా కల్పిస్తే అన్ని అంశాలను అధికారికంగా చక్కపెట్టే అవకాశం ఉన్నందున, ప్రతిపక్షాల కుట్రలను తిప్పి కొట్టాలంటే దయాకర్ రెడ్డికి అధికారికంగా పదవి దక్కేలా చూడాల్సిన బాధ్యత రెవిన్యూ శాఖ మంత్రిపై ఉంది.

# ఆయాం సారీ

- భారత్‌కు క్షమాపణలు చెప్పిన పీసీబీ చీఫ్



**ఇస్లామాబాద్ :** పాకిస్తాన్ క్రికెట్ బోర్డు చీఫ్ మొహ్సిన్ నఖ్వీ భారత్‌కు క్షమాపణలు చెప్పారు. ఆసియా క్రికెట్ కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతూ ఇకపై కొత్తగా మొదలుపెట్టాలని అన్నారు. నఖ్వీ ఆసియా కప్ 2025 ఫైనల్ మ్యాచ్ తర్వాత ట్రోఫీని తనతో తీసుకెళ్లారు. ఈ మ్యాచ్‌లో భారత్ పాకిస్థాన్‌ను ఓడించిం. నఖ్వీ ఇంతకాలం మొండిగా ఉన్నారు, కానీ ఇప్పుడు దిగివచ్చారు. ట్రోఫీని తిరిగి ఇవ్వడంపై కూడా స్పందించారు.నఖ్వీ మాట్లాడుతూ.. ఏసీసీ సమావేశంలో, "ఏం జరిగిందో జరగకూడదు, కానీ ఇప్పుడు మనం కొత్తగా ప్రారంభించాలి. సూర్యకుమార్ యాదవ్ స్వయంగా వచ్చి ట్రోఫీని తీసుకెళ్లవచ్చు." దుబాయ్‌లో మంగళవారం (సెప్టెంబర్ 30)న ఏసీసీ సమావేశం జరిగిం. ఇందులో బీసీసీఐ ఆసియా కప్ ట్రోఫీ అంశాన్ని లేవనెత్తిం. ఆ తర్వాత నఖ్వీ క్షమాపణలు చెప్పారు. ఫైనల్‌లో పాకిస్థాన్ ఓడిపోయిన తర్వాత నఖ్వీ చేతుల మీదుగా ట్రోఫీని తీసుకోవడానికి భారత కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ నిరాకరించారు. నఖ్వీ చాలాసేపు ఎదురుచూశారు, కానీ టీమ్ ఇండియా ఆటగాళ్లు అంగీకరించలేదు. ఆ తర్వాత నఖ్వీ ట్రోఫీ, మెడల్ రెండింటినీ తీసుకుని వెళ్లిపోయారు. పాకిస్థాన్ నుంచి కూడా నఖ్వీకి కష్టాలు పెరుగుతున్నాయి. మాజీ క్రికెటర్ షాహిద్ అఫ్రిది నఖ్వీని వ్యతిరేకిస్తూ.. ఆయన ఒక పదవికి రాజీనామా చేయాలని అన్నారు. నఖ్వీ పీసీబీ చీఫ్‌గా ఉండటంతోపాటు పాకిస్తాన్ హెూంమంత్రిగా కూడా ఉన్నారు. అఫ్రిది టెలికాం ఆసియా స్పోర్ట్‌తో మాట్లాడుతూ.. నఖ్వీ ఒక పదవికి రాజీనామా చేయాలి. ప్రస్తుతం పాకిస్థాన్ క్రికెట్‌పై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉం.మాజీ క్రికెటర్ కీర్తి ఆజాద్ మాట్లాడుతూ.. క్షమాపణలు చెబుతున్నారా లేదా అనే వేరే విషయం. ట్రోఫీ అతని వ్యక్తిగత ఆస్తి కాదు, అతను ఎలా తీసుకెళ్లారు. ఔట్ అయితే బ్యాట్, బాల్ తీసుకుని వెళ్లినట్లుగా ఉంది ఇది.

# శ్రీలంకపై భారత్ సూపర్ విక్టరీ




**కొలంబో (జనంసాక్షి) :** 2025 మహిళల వరల్డ్‌కప్ టోర్నమెంట్‌లో భారత్ శుభారంభం చేసిం. శ్రీలంకతో జరిగిన తొలి మ్యాచ్‌లోనే భారత్ ఘన విజయం సాధించిం. గువాహటి వేదికగా మంగళవారం జరిగిన మ్యాచ్‌లో శ్రీలంకపై టీమ్‌ఇండియా 59 పరుగుల తేడాతో నెగ్గిం. డక్ వర్త్ లూయిస్ ప్రకారం 47 ఓవర్లలో 271 పరుగుల ఛేదనలో దిగిన లంక 45.4 ఓవర్లలో 211 పరుగులకు ఆలౌట్ అయ్యిం. భారత్ బౌలర్లలో దీప్తి శర్మ 3, స్నేహ్ రానా, శ్రీ చరణి చెరో 2, క్రాంతి గౌడ్, ప్రతీకా రావల్, అమన్‌జోత్ కౌర్ తలో 1 వికెట్ పడగొట్టారు. వర్షం కారణంగా మ్యాచ్‌ను ఇరుజట్లకు 47 ఓవర్లకు కుంచారు. భారత్ 269-8 పరుగులు చేసిం. ఇక డక్‌వర్త్ లూయిస్ ప్రకారం శ్రీలంక టార్గెట్‌ను 271గా నిర్ణయించారు. ఈ ఛేదనలో లంక 30 పరుగులకు తొలి వికెట్ కోల్పోయిం. ఓపెనర్ హాసిని పెరీర (14 పరుగులు)ను క్రాంతి గౌడ్ క్లీన్ బౌల్డ్ చేసిం. ఆ తర్వాత వన్‌డౌన్‌లో వచ్చిన సమరవిక్రమ (29 పరుగులు)తో కెప్టెన్ ఆటపట్టు (43 పరుగులు) మంచి భాగస్వామ్యం నిర్మించిం. రెండో వికెట్ కు ఈ ఇద్దరూ 52 పరుగులు జోడించారు.ఈ జోడీని జట్టు స్కోర్ 82 వద్ద దీప్తి శర్మ విడగొట్టిం. అటపట్టు 43 పరుగులకు ఔట్ అయ్యిం. ఆ తర్వాత లంక వికెట్లు త్వరత్వరగా కూలాయి. సమరవిక్రమ (29), వింశీ గుణరత్నే (11), కవిశ దిల్హారీ (15), అనుష్క సంజీవని (6) స్వల్ప స్కోర్లకే ఔట్ అయ్యారు. దీంతో 140 రన్స్‌కు లంక 6 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడిం. అంతకుముందు తొలుత బ్యాటింగ్ చేసిన టీమ్‌ఇండియా 47 ఓవర్లలో 8 వికెట్లు నష్టానికి 269 పరుగులు చేసిం. అమన్ జోత్ కౌర్ (57 పరుగులు), ఆల్‌రౌండర్ దీప్తి శర్మ (53 పరుగులు) హాఫ్ సెంచరీలతో అదరగొట్టారు. చివర్లో స్నేహ్ రానా (28 పరుగులు, 15 బంతుల్లో) రఫ్ఫాడించిం. వీళ్లతోపాటు ప్రతీకా రావల్ (37 పరుగులు), హర్లీన్ డియోల్ (48 పరుగులు), హర్మన్ ప్రీత్ కౌర్ (21 పరుగులు) ఆకట్టుకున్నారు. లంక బౌలర్లలో ఇనోకా రనవీర 4 వికెట్లు దక్కించుకుంది. ఉదేశిక ప్రబోధిని 2, కులసూరియా, చమరి ఆటపట్టు తలో 1 వికెట్ పడగొట్టారు.

## నేపాల్ బౌలర్ల ధాటికి కుప్పకూలిన వెస్టిండీస్

- కేవలం 83 పరుగులకే ఆలౌట్..




**భూటాన్ :** నేపాల్ నిర్ణీత ఓవర్లలో 173 పరుగుల గౌరవప్రదమైన స్కోరు చేసింది. ఆరంభంలో అకీల్ హెూసేన్, కైల్ మేయర్స్ దెబ్బకు తడబడినప్పటికీ, ఆసిఫ్ షేక్, సందీప్ జోరా చెరో హాఫ్ సెంచరీ సాధించి జట్టును ఆదుకున్నారు. అనంతరం 174 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన వెస్టిండీస్, నేపాల్ బౌలర్ల ధాటికి చేతులెత్తేసింది. కేవలం 83 పరుగులకే ఆలౌట్ అయి ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది. నేపాల్ బౌలర్ మహమ్మద్ ఆదిల్ ఆలం నాలుగు వికెట్లతో విండీస్ పతనాన్ని శాసించాడు. ఇది టీ20 క్రికెట్‌లో ఒక అసోసియేట్ జట్టు చేతిలో పూర్తిస్థాయి సభ్యత్వ జట్టు నమోదు చేసిన అత్యల్ప స్కోరు కావడం గమనార్హం. గతంలో 2014లో నెదర్లాండ్స్‌పై ఇంగ్లండ్ 88 పరుగులకు ఆలౌట్ అయిన రికార్డును ఇది బద్దలు కొట్టింది. మ్యాచ్ అనంతరం నేపాల్ ఆటగాడు ఆసిఫ్ షేక్ మాట్లాడుతూ, "ఈ పిచ్‌పై 160 పరుగులు మంచి స్కోరని భావించాం. నెమ్మదిగా ఆడి భాగస్వామ్యం నిర్మించాలనుకున్నాం, అదే చేశాం. మా దేశంలో క్రికెట్ ఒక పండుగలాంటిది. మాకు మద్దతు ఇచ్చే అభిమానులకు కృతజ్ఞతలు. సిరీస్‌ను 3-0తో గెలవాలని అనుకుంటున్నాం" అని తెలిపాడు. విండీస్ కెప్టెన్ అకీల్ హెూసేన్ మాట్లాడుతూ, నేపాల్ విజయాన్ని ప్రశంసించాడు. నేపాల్‌పై సులువుగా గెలుస్తామని అందరూ అనుకున్నారని, కానీ వారు బ్యాటింగ్, ఫీల్డింగ్ విభాగాల్లో అద్భుతంగా రాణించారన్నారు. ఈ గెలుపునకు వారు పూర్తిగా అర్హులని వ్యాఖ్యానించారు. ఈ చారిత్రక విజయం టీ20 క్రికెట్‌లో వర్ధమాన జట్లు కూడా సత్తా చాటగలవని మరోసారి నిరూపించింది.

## పీసీబీ ఛైర్మన్ పదవికి రాజీనామా చేయండి

- మాజీ క్రికెటర్ షాహిద్ అఫ్రిది డిమాండ్



**ఇస్లామాబాద్ :** పాకిస్థాన్ క్రికెట్ బోర్డు(పీసీబీ) ఛైర్మన్ బాధ్యతల నుంచి మోహ్సీన్ నఖ్వీ తప్పుకోవాలని ఆ జట్టు మాజీ క్రికెటర్ షాహిద్ అఫ్రిది డిమాండ్ చేశాడు. ఆసియా కప్ 2025 టోర్నీలో పాకిస్థాన్ జట్టు వైఫల్యం నేపథ్యంలో అఫ్రిది ఈ ప్రతిపాదన చేశాడు. పాకిస్థాన్ మంత్రిగా.. పీసీబీ ఛైర్మన్‌గా నఖ్వీ న్యాయం చేయలేకపోతున్నాడని అభిప్రాయపడ్డాడు. పాకిస్థాన్ క్రికెట్‌పై ప్రత్యేక శ్రద్ధ చూపే ఛైర్మన్ కావాలని అఫ్రిది నొక్కి చెప్పాడు.ఆసియా కప్ 2025 టోర్నీలో పాకిస్థాన్ జట్టు భారత్ చేతిలో ఘోర పరాజయాలను ఎదుర్కొంది. భారత్‌తో ఆడిన మూడు మ్యాచ్‌లకు మూడింటిని పాకిస్థాన్ ఓడిపోయింది. ఫైనల్లో పోటీ ఇచ్చినా తొలి రెండు మ్యాచ్‌ల్లో చిత్తయ్యింది. ఆసియా క్రికెట్ కౌన్సిల్ ప్రెసిడెంట్‌గా కూడా నఖ్వీ వ్యవహరిస్తున్నాడు. కీలక పదవుల్లో ఉన్న నఖ్వీ పూర్తిగా సలహాదారుపై ఆధారపడుతున్నాడని అఫ్రిది ఆరోపించాడు.పీసీబీ ఛైర్మన్, పాకిస్థాన్ మంత్రి అయిన మోహ్సిన్ నఖ్వీ సాబ్‌కు నా అభ్యర్థన, సలహా ఏంటంటే.. పీసీబీ ఛైర్మన్ బాధ్యతల నుంచి వీలైనంత త్వరగా తప్పుకోవాలి. పీసీబీ అనేది పాకిస్థాన్ మంత్రిత్వ శాఖ కంటే పూర్తిగా భిన్నమైనది.

# ప్రాక్టీస్ సెషన్‌కు పలువురు ఆటగాళ్లు దూరం



**న్యూఢిల్లీ (జనంసాక్షి) :** ఆసియా కప్ 2025 టోర్నీలో విజేతగా నిలిచిన టీమిండియా నాలుగు రోజుల వ్యవధిలోనే వెస్టిండీస్‌తో రెండు టెస్ట్‌ల సిరీస్‌కు సిద్దమైంది. గురువారం(అక్టోబర్ 2) నుంచి అహ్మదాబాద్ వేదికగా వెస్టిండీస్‌తో ప్రారంభమయ్యే తొలి టెస్ట్‌లో బరిలోకి దిగనుంది. ఇప్పటికే ఈ మ్యాచ్ కోసం అహ్మదాబాద్ చేరిన భారత జట్టు ప్రాక్టీస్ కూడా ప్రారంభించింది. ఈ ఇంటెన్స్ ప్రాక్టీస్ సెషన్‌కు టీమిండియా స్టార్ ఆటగాళ్లు అయిన జస్‌ప్రీత్ బుమ్రా, కుల్దీప్ యాదవ్, అక్షర్ పటేల్ దూరంగా ఉన్నారు.ఆసియా కప్ 2025 ఫైనల్ ఆడిన ఈ ముగ్గురు ఆటగాళ్లు.. అలసటను తొలగించుకునేందుకు ఈ ప్రాక్టీస్ సెషన్‌లో పాల్గొనలేదని తెలుస్తోంది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌తో పాటు ఇతర ఆటగాళ్లంతా ట్రైనింగ్ సెషన్‌లో పాల్గొన్నారు. హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ ఈ ప్రాక్టీస్ సెషన్‌ను పర్యవేక్షించాడు. మూడు గంటల పాటు సాగిన ఈ ప్రాక్టీస్ సెషన్ లైట్ వార్మప్‌తో మొదలైంది.ఆ తర్వాత ఫీల్డింగ్ ప్రాక్టీస్‌తో పాటు నెట్స్‌లో ఆటగాళ్లు బ్యాటింగ్, బౌలింగ్ సాధన చేశారు. యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్, ధ్రువ్ జురెల్ నెట్స్‌లో స్పిన్నర్లతో పాటు ఫాస్ట్ బౌలర్లను ఎదుర్కొన్నారు. మిడిలార్డర్ బ్యాటర్లు సాయి సుదర్శన్, దేవదత్ పడిక్కల్ భారీ షాట్లు సాధన చేశారు. గిల్.. పేస్ బౌలింగ్‌ను ఎదుర్కొన్నాడు. మహమ్మద్ సిరాజ్, ప్రసిధ్ కృష్ణ సుదీర్ఘ స్పెల్స్ బౌలింగ్ చేశారు. ఈ ఇద్దరూ ఆటగాళ్లు భారత్-ఏ తరఫున.. ఆస్ట్రేలియా-ఏతో టెస్ట్ సిరీస్ ఆడారు. బౌలింగ్ రిథమ్‌ను అందుకునేందుకు శ్రమించారు. గంభీర్.. ఈ మ్యాచ్‌కు సంబంధించిన పిచ్‌ను పలుమార్లు పరిశీలించాడు. పిచ్ కండిషన్స్‌కు తగ్గట్లు టీమ్ కాంబినేషన్‌ను ఎంపిక చేయడంపై గంభీర్ ఫోకస్ పెట్టాడు. ఆస్ట్రేలియా-ఏతో శతకం సాధించిన దేవదత్ పడిక్కల్‌ను తుది జట్టులోకి తీసుకునే ఛాన్స్ ఉంది. నితీష్ కుమార్ రెడ్డితో జట్టుకు బ్యాటింగ్‌తో పాటు అదనపు పేస్ ఆప్షన్ లభించనుంది. మరోవైపు వెస్టిండీస్ జట్టు వర్షం కారణంగా ఇండోర్ నెట్స్‌కే పరిమితమైంది. అరగంట మాత్రమే సాధన చేసింది. ఈ మ్యాచ్ పిచ్ కండిషన్స్ స్పిన్‌కు అనుకూలంగా ఉండనున్నాయి. స్పెషలిస్ట్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్‌తో పాటు జడేజా కీలకం కానున్నాడు.

## వరల్డ్ పారా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో భారత అథ్లెట్ల హవా




**ముంబయి :** వరల్డ్ పారా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో భారత అథ్లెట్లు దుమ్మురేపారు. ఒకే రోజు రెండు స్వర్ణాలతో పాటు నాలుగు మెడల్స్‌ను గెలుచుకున్నారు. మంగళవారం జావెలిన్ త్రోలో రెండు బంగారు పతకాలు, ఒక రజతం రాగా.. డిస్కస్ త్రోలో యోగేశ్ కతూనియా రజతం సాధించాడు. పురుషుల ఎఫ్ 64 కేటగిరిలో సుమిత్ అంటిల్ జావెలిన్‌ను 71.37 మీటర్ల దూరం విసిరి అగ్రస్థానంలో నిలిచాడు. ఈ క్రమంలో తానే సృష్టించిన ఛాంపియన్‌షిప్ రికార్డ్(2023లో 70.83 మీటర్లు)ను తుడిచిపెట్టాడు. ఈ టోర్నీలో పసిడి హ్యాట్రిక్ కూడా కొట్టాడు. 2023, 24 పారా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లోనూ అతను స్వర్ణం సాధించాడు.సుమిత్ అంటిల్ ముందుగా రెజ్లర్ కావాలనుకున్నాడు. కానీ 17 ఏళ్ల వయసులో రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. అతను నడుపుతున్న బైక్.. ట్రక్‌ను ఢీకొనడంతో ఎడమ కాలిని తీసేయాల్సి వచ్చింది. దాంతో రెజ్లర్ కావాలనే కల చెదిరింది. కానీ క్రీడలపై ఉన్న మక్కువ పోలేదు. 2017లో పారా అథ్లెట్‌గా కెరీర్ ప్రారంభించాడు. జావెలిన్ త్రోలో పట్టు సాధించి ఈ క్రీడల్లో దూసుకెళ్తున్నాడు.పురుషుల ఎఫ్ 44 జావెలిన్ త్రోలో సందీప్ సంజయ్ సర్గార్ స్వర్ణం.. సందీప్ సిల్వర్ మెడల్‌తో మెరిసారు. సంజయ్ 62.82 మీటర్ల త్రో వేయగా.. సందీప్ 62.67 మీటర్లు జావెలిన్ విసిరాడు. ఎడినిల్‌సన్(బ్రెజిల్) బ్రాంజ్ మెడల్ దక్కించుకున్నాడు.

# నేడు మద్యం, మాంసం దుకాణాల బంద్

- ఒకరోజు ముందే మద్యం దుకాణాల ముందు క్యూ



**హైదరాబాద్, అక్టోబర్1 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్రంలోని నగరాలు, పట్టణాలు, పల్లెల్లో దసరా పండుగ శోభ సంతరించుకుంది. పండగ నిర్వహించుకునేందుకు నగరాలు, పట్టణాల నుంచి ప్రజలు సొంత ఊర్లకు చేరుకుంటున్నారు. అయితే ఈ ఏడాది దసరా పండుగగాంధీ జయంతి రోజే వచ్చింది. గాంధీ జయంతి రోజున మద్యం, మాంసం దుకాణాలను రాష్ట్ర ప్రభుత్వం మూసివేస్తుంది. దీంతో పండగ వేళ మద్యం ప్రియులకు షాక్ తగిలినట్లు అయ్యింది. అయితే ఈ సమస్యకు ముందే మేల్కొన్న జనం బుధవారమే మద్యం షాపుల ముందు బారులు తీరారు. 2న హైదరాబాద్ నగరవ్యాప్తంగా మద్యం, మాంసం దుకాణాలు బంద్ కావడంతో.. సిటీలోని వైన్ షాపుల వద్ద రద్దీ పెరిగింది. నగరంలో ఎక్కడ చూసినా మాంసం, మద్యం దుకాణాలు జనాలతో కిక్కిరిసి పోయాయి. గాంధీ జయంతి ఎఫెక్ట్‌తో.. మంగళవారం ఒక్కరోజే రూ.270 కోట్ల వ్యాపారం జరిగినట్లు సమాచారం. బుధవారం రూ.300 కోట్ల సేల్స్ పెరగవచ్చని ఎక్సైజ్ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. మద్యం వ్యాపారులు భారీ స్టాక్‌తో సేల్స్‌కు రెడీ అయ్యారు. దీంతో వైన్ షాపులు, లిక్కర్ మార్టుల వద్ద మందుబాబుల కోలాహలం నెలకొంది. ఈ నేపథ్యంలో మద్యం దుకాణాల ముందు క్యూలైన్లలో మందు బాబులు హల్ చల్ చేస్తున్నారు.

# లిక్కర్ లోడ్‌తో వెళుతున్న డిసిఎంకు ప్రమాదం

- షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం
- బాటిళ్లు ఎత్తుకెళ్లిన జనం



**హైదరాబాద్, అక్టోబర్ 1 (జనంసాక్షి) :** హైదరాబాద్ రామంతపూర్‌లో లిక్కర్ లోడ్‌తో వెళుతున్న డిసిఎం విద్యుత్ ప్రమాదానికి గురయ్యింది. డ్రైవర్ అప్రమత్తతో ప్రమాద తప్పింది. సకాలంలో మంటలను ఆర్పారు. అయితే కొందరు చెల్లాచెదురుగా పడివున్న బాటిళ్లను ఎత్తుకెళ్లారు. లిక్కర్ లోడ్ డీసీఎంలో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు అంటుకున్న ఘటన చోటు చేసుకుంది. కరెంట్ వైర్లు కిందికి ఉండటం వల్ల డీసీఎం షార్ట్ సర్క్యూట్ కావడంతో ప్రమాదం జరిగింది. స్థానికులు మంటలు వ్యాపించడాన్ని గమనించి వెంటనే ఫైర్ డిపార్ట్‌మెంట్‌కు సమాచారం అందించారు. ఫైర్ ఇంజిన్ సహాయంతో మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఈ ఘటనలో మంటల ప్రభావంతో డీసీఎంలో ఉన్న లిక్కర్ బాటిల్స్ కొంతవరకు దెబ్బతిన్నాయి. ఇదిలా ఉంటే.. మంటల వల్ల రోడ్డు మీద కొన్ని మద్యం సీసాలు పడ్డాయి. ఇది చూసిన పబ్లిక్ అందిన కాడికల్లా రోడ్డు మీద పడ్డ సీసాలను సేకరించారు. పలువురు స్థానికులు ఆ సీసాలను ఎత్తుకెళ్లారు. స్థానిక పోలీసులు ఈ ఘటనపై సమాచారాన్ని సేకరిస్తూ మద్య నిల్వ, విద్యుత్ సేఫ్టీ అంశాలను పరిశీలిస్తున్నారు. అంతేకాకుండా షార్ట్ సర్క్యూట్ కారణాలను గుర్తించడానికి ఫైర్ డిపార్ట్‌మెంట్ దర్యాప్తు కొనసాగిస్తోంది.

## తెలంగాణకు నాలుగు విద్యాలయాలు


- కేంద్రానికి కృతజ్ఞతలు తెలిపిన కిషన్ రెడ్డి

**న్యూఢిల్లీ, అక్టోబర్ 1 (జనంసాక్షి) :** కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు కొత్తగా మరో నాలుగు కేంద్రీయ విద్యాలయాలను కేటాయించిందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. ఇప్పటికే ఉన్న 35 కేంద్రీయ విద్యాలయాలకు తోడుగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రం (యాస్పిరేషనల్ డిస్ట్రిక్ట్), ములుగు జిల్లా కేంద్రం (గిరిజన ప్రాంతం), జగిత్యాల జిల్లా - జగిత్యాల రూరల్ మండలం చెల్గల, వనపర్తి జిల్లా - నాగవరం శివారులో ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. ఈ నాలుగు విద్యాలయాలు మారుమూల ప్రాంతాల్లో.. నాణ్యమైన ప్రాథమిక, సెకండరీ విద్యను అందించడంలో కీలకం కానున్నాయని కిషన్ రెడ్డి విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. తెలంగాణలో విద్యాభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తున్నందుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు ధన్యవాదాలు చెప్పారు.

గత రెండేళ్లలోనే కేంద్ర ప్రభుత్వం తెలంగాణలో నాణ్యమైన సెకండరీ విద్యను అందించేందుకు రూ.400 కోట్లతో 832 పీఎం-శ్రీ స్కూల్స్‌ను మంజూరు చేసిందని కిషన్ రెడ్డి తెలిపారు. దేశవ్యాప్తంగా పీఎం శ్రీ స్కూల్స్ కోసం ఎక్కువ కేటాయింపులు అందుకున్న రాష్ట్రం తెలంగాణనే కావడం విశేషమన్నారు. సమగ్రశిక్షా అభియాన్ కింద గత రెండేళ్లలో తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం దాదాపు రూ.2వేల కోట్లు కేటాయించిందని వివరించారు. దాదాపు రూ.వెయ్యి కోట్లతో ములుగు జిల్లాలో సమ్మక్క, సారక్క సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీని కూడా కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిందని గుర్తుచేశారు.

# అక్టోబర్‌లో చంద్రబాబు విదేశీ పర్యటన

- విదేశీ పర్యటన షెడ్యూల్ ఖరారు
- పెట్టుబడులు ఆకర్షణే లక్ష్యంగా పర్యటన



**అమరావతి, అక్టోబర్1 (జనంసాక్షి) :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విదేశీ పర్యటనకు ముహూర్తం ఖరారు అయింది. అక్టోబర్ 22 నుంచి 24వ తేదీ వరకు దుబాయ్, అబుదాబి, యూఏఈలలో సీఎం చంద్రబాబు పర్యటించనున్నారు. నవంబర్ 14, 15 తేదీల్లో విశాఖపట్నం వేదికగా పార్టనర్ షిప్ సమ్మిట్ -2025 జరగనుంది. ఈ సమ్మిట్‌కు విదేశీ పెట్టుబడుదారులను ఆహ్వానించేందుకు ఆయా దేశాల్లో సీఎం చంద్రబాబు పర్యటించనున్నారు. రియల్ ఎస్టేట్స్, భవన నిర్మాణం, లాజిస్టిక్స్ తదితర రంగాల్లో పెట్టుబడులను సీఎం చంద్రబాబు ఆహ్వానించనున్నారు. అలాగే రవాణా, ఫైనాన్స్ సర్వీసెస్, ఇన్నోవేషన్స్ రంగాల్లో సైతం పెట్టుబడుదారులకు ఆయన స్వాగతం పలకనున్నారు. ఈ విదేశీ పర్యటనకు సీఎం చంద్రబాబు వెంట మంత్రులు టీజీ భరత్, బీసీ జనార్దన్ రెడ్డిలతోపాటు పరిశ్రమలు, పెట్టుబడులు, ఏపీఐఐసీ విభాగాలకు చెందిన పలువురు ఉన్నతాధికారులు వెళ్లనున్నారు. సీఎం చంద్రబాబు చేస్తున్న ఈ విదేశీ పర్యటనకు జీఏడీ పొలిటికల్ సెక్రటరీ ముకేష్ కుమార్ మీనా బుధవారం అనుమతులు ఇస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధే లక్ష్యంగా చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. రాజధాని అమరావతితోపాటు.. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల అభివృద్ధి కోసం సర్కార్ కీలకంగా అడుగులు వేస్తోంది. అందులో భాగంగా సీఎం చంద్రబాబు విదేశాల్లో పర్యటిస్తూ.. రాష్ట్రాభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమిస్తున్నారు. ఆ క్రమంలో ఇప్పటికే సింగపూర్, దావోస్‌లో సైతం ఆయన పర్యటించారు. విశాఖపట్నం వేదికగా నవంబర్‌లో జరగనున్న ఈ సమ్మిట్‌కు వివిధ దేశాల ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలను ఇప్పటికే ఆహ్వానించారు. మరోవైపు ఏపీ మున్సిపల్ శాఖ మంత్రి నారాయణపాటు పలువురు ఉన్నతాధికారులు ప్రస్తుతం దక్షిణ కొరియాలో పర్యటిస్తున్నారు. ఈ పర్యటన సందర్భంగా ఆ దేశ ప్రభుత్వాధికారులతోపాటు పారిశ్రామికవేత్తలతో ఈ ప్రతినిధి బృందం వరుస భేటీలు నిర్వహిస్తోంది.

# రాజమహేంద్రవరం నుంచి తిరుపతికి విమాన సర్వీసు

- ఢిల్లీ నుంచి ప్రారంభించిన మంత్రి రామ్మోహన్ నాయుడు




**న్యూఢిల్లీ, అక్టోబర్1 (జనంసాక్షి) :** రాజమహేంద్రవరం నుంచి తిరుపతికి విమాన సర్వీసును పౌర విమాన యానశాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు ప్రారంభించారు. దిల్లీలోని రాజీవ్‌గాంధీ భవన్ నుంచి ఎంపీ పురందేశ్వరితో కలిసి వర్చువల్‌గా ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రాజమహేంద్రవరం విమానాశ్రయంలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, ఎమ్మెల్యేలు ఆది శ్రీనివాస్, బుచ్చయ్య చౌదరి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ దేవీ నవరాత్రుల్లో తిరుపతికి విమాన సర్వీసులు ప్రారంభించడం అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు. టికెట్ ధర మొదటి 35 సీట్లకు రూ.1999, తర్వాత 35 సీట్లకు రూ.4000 మూడు నెలలపాటు అందుబాటులో ఉంటుందన్నారు. దిల్లీ, ముంబయికి ప్రారంభించిన విమాన సర్వీసులు నిండుగా నడుస్తున్నాయని చెప్పారు. భవిష్యత్తులో షిర్డీ, వారణాసి, కొచ్చి తదితర ప్రాంతాలకు సర్వీసులు ప్రారంభిస్తామన్నారు. పురందేశ్వరి మాట్లాడుతూ తిరుపతికి విమాన సర్వీసును ప్రారంభించుకోవడం శుభపరిణామమని చెప్పారు. రాజమహేంద్రవరం ఎయిర్‌పోర్టు నుంచి పలు ప్రాంతాలకు కనెక్టివిటీ పెరుగుతోందన్నారు. ఈ ప్రాంత అభివృద్ధికి ఇది ఎంతో దోహదపడుతుందని చెప్పారు. భవిష్యత్తులో మరిన్ని సర్వీసులు ప్రారంభించేందుకు ప్రయత్నిస్తామని తెలిపారు.అలయన్స్ ఎయిర్ విమానయాన సంస్థ ఈ విమాన సర్వీసులను నడపనుంది. దీని ద్వారా ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల వాసులకు ఆకాశయానం ద్వారా ఆధ్యాత్మిక యాత్ర దగ్గరకానుంది. రెండో తేదీ నుంచి షెడ్యూల్ ప్రకారం ఈ సర్వీసు అందుబాటులోకి రానుంది. మంగళ, గురు, శనివారాల్లో అలయన్స్ ఎయిర్ విమానయాన సంస్థ దీన్ని నడపనుంది. దివంగత లోక్‌సభ స్పీకర్ జీఎంసీ బాలయోగి జయంతి సందర్భంగా రామ్మోహన్‌నాయుడు నివాళులర్పించారు. పాత పార్లమెంట్ భవనం సెంట్రల్ హాల్‌లో బాలయోగి చిత్రపటం వద్ద ఆయన అంజలి ఘటించారు. బాలయోగి జీవితం ఎన్నో తరాలకు ఆదర్శమని చెప్పారు. కోనసీమ గడ్డ నుంచి ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంలో లోక్‌సభ స్పీకర్‌గా ఆయన పనిచేసి తెలుగువారి కీర్తిని ఎల్లలు దాటించారన్నారు. ఆయన సేవలు దేశ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీ సానా సతీశ్, మాజీ ఎంపీ కనకమేడల రవీంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
2 అక్టోబర్ 2025
















































































Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370